వాసిలే గత వారంలో సినిమాల పై విశ్లేషణ
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
తాడేపల్లిగూడెం
: fb.com/vaartha Digital
Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam
3-5-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 91 పేజీలు: 10+4 వెల: 6.50

ఉగ్రవాదుల అంతానికి భారత్‌కు సహకరించండి: జెడి వ్యాన్స్
5లో

నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా, రాహుల్‌కు ఇడి నోటీసులు

# వికసిత్ భారత్ గ్రోత్ ఇంజన్ 'అమరావతి'

## రాజధాని పునఃప్రారంభపనుల కార్యక్రమంలో ప్రధాని మోడీ

### 60 వేల కోట్ల విలువైన పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

### విశాఖలో ఏక్తా మాల్, స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణానికి ఇది శుభసంకేతం


శుక్రవారం అమరావతి పనుల పునఃప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రధాని మోడీ

## పదేళ్లలో అమరావతికి కేంద్రం అండగా నిలిచింది: ప్రధాని మోడీ

**విజయవాడ,మే2,ప్రభాతవార్తప్రతినిధి:** ఎన్టీఆర్ వికసిత ఏపీ కోసం కలగన్నారని దానిని మనందరం నిజం చేయాలి ప్రధాని మోడీ అన్నారు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా భారత్ నిలిచిందని అన్నారు. ఒకప్పుడు ఆంధ్రా, తెలంగాణ రైల్వే ప్రాజెక్టులకు కలిపి కేవలం 900 కోట్లలోపే అన్నారు.ఇప్పుడు కేవలం ఏపీకే 9వేల కోట్ల నిధులు ఇచ్చాం అన్నారు. గతానికంటే పది రెట్లు అధికంగా నిధులు కేటాయించామన్నారు. గత పదేళ్ల లో ఏపీలో 750రైల్వే బ్రిడ్జిలు, అండర్ పాస్‌లు నిర్మించాం అన్నారు. ఏపీలో 70కి పైగా రైల్వేస్టేషన్లను అమృత్ భారత్ ప్రాజెక్టు కింద అభివృద్ధి చేస్తున్నామన్నారు. మౌలిక వసతుల కల్పనతో ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందన్నారు.

**ప్రధానికి ఘన సన్మానం:** అమరావతి రాజధాని పునః నిర్మాణ పనులకు విచ్చేసిన ప్రధాని నరేంద్రమోడీకి సభా వేదికపై ఘన సన్మానం జరిగింది. ఆయనకు ధర్మవరం నేసిన పట్టుకండువాను >>2

**విజయవాడ,మే2,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌ను అధునాత నప్రదేశ్‌గా మార్చే శక్తి అమరావతికి ఉంది అని, అమరావతిని వికసిత్ భారత్ గ్రోత్ ఇంజిన్‌గా మార్చాలి అని ప్రధానమంత్రి మోడి అన్నారు. రాజధాని అమరావతి పునఃనిర్మాణ పనులను ప్రధాని మోడి ప్రారంభించారు. శుక్రవారం మధ్యాహ్నం అమరావతి పునఃప్రారంభోత్సవానికి ప్రధానమంత్రి మోడి విచ్చేశారు. సాం స్కృతిక కార్యక్రమాలు, పలువురు మంత్రుల ప్రసంగాల అనంతరం ప్రధాని వర్చువల్‌గా పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారం భోత్సవాలు చేశారు. అనంతరం తెలుగులో ప్రసంగం ప్రారంభించిన ప్రధాని మోదీ దుర్గాభవానీ కొలువైన పుణ్యభూమిలో మిమ్మల్ని కలవడం ఆనందంగా ఉంది. ఇవి కేవలం శంకుస్థాపనలు కాదు.. ఎపి ప్రగతికి, వికసిత్ భారత్‌కు నిదర్శనం. అమరావతి స్వప్నం సాకారం అవుతున్నట్లు కనిపిస్తోంది. స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణానికి ఇది శుభ సంకేతం. అమరావతి ఒక నగరం కాదు, అమరావతి ఒక శక్తి. ఒక కొత్త అమరావతి, కొత్త ఆంధ్రప్రదేశ్. ఇప్పుడు నేను పుణ్యభూమి అమరావతిపై నిలబడి ఉన్నా. చంద్రబాబు నా టెక్నా లజీ వాడకం గురించి చెప్పారు. సాంస్కృతిక కార్యక్రమాలు, పలువురు మంత్రుల ప్రసంగాల అనంతరం .రాష్ట్ర చరిత్రలో మరో మహోన్నత ఘట్టం ఆవిష్కృతమైంది. ఆంధ్రుల ఆశలకు, ఆకాం క్షలకు కేంద్రమైన రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనులను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఈ పునఃప్రారంభ సభలో హైకోర్టు, అసెంబ్లీ భవనం, సచివాలయ, హెచ్ఓడి టవర్‌ల



శుక్రవారం అమరావతి సభావేదిక నుంచి వర్చువల్‌గా వివిధ పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తున్న ప్రధాని మోడీ. చిత్రంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, సిఎం చంద్రబాబు, కేంద్రమంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్

నిర్మాణానికి, మౌలిక సదుపాయాల కల్పన ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపన చేశారు. మొత్తం 57,962 కోట్లు విలువ గల 94 అభివృద్ధి పనులకు ప్రధాని శంకుస్థాపనలు చేసి జాతికి అంకితం ఇచ్చారు. అమరావతిలో రూ.49,040 కోట్లతో 74 ప్రాజెక్టు పనులకు అదనంగా రూ.5028 కోట్లతో చేపట్టే తొమ్మిది ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. రూ.3680 కోట్లతో నిర్మాణం పూర్తైన 8 జాతీయ రహదారుల ప్రారంభించారు. మరో రూ.254 కోట్లతో నిర్మించిన మూడు రైల్వే ప్రాజెక్టులు జాతికి అంకితమిచ్చారు. రాజధానిలో కొత్తగా అసెంబ్లీ, సచివాలయం, హైకోర్టు భవనాలు, న్యాయమూర్తుల నివాస సముదాయ భవనాల నిర్మాణం చేపట్టనున్నారు. విశాఖలో పీఎం ఏక్తా మాల్‌ను ప్రధాని ప్రారంభోత్సవం చేశారు. రూ.3680 కోట్లతో విలువైన నేషనల్ హైవే పనులకు ప్రధాని శంకుస్థాపన చేశారు. న్యాయమూర్తుల నివాస సముదాయాలకు శంకుస్థాపన చేశారు. రూ.1459 కోట్లతో నాగాయలంకలో క్షిపణి ప్రయోగ కేంద్రం రూ.100కోట్లతో విశాఖలో డీపీఐటీ చేపట్టే యూనిటీమాల్‌కు రూ.293 కోట్లతో >>2


శుక్రవారం సభలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

## చరిత్రలో నిలిచిపోయే రోజు

### సిఎం చంద్రబాబు

**విజయవాడ,మే2,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతి రాజధాని పున:ప్రారంభోత్సవం జరిగిన రోజు చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయే రోజని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. గత ఐదు సంవత్సరాలు రాజధాని పనులు ఆగిపోయాయని, విధ్వంసం జరిగిందని అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. రాజధాని పున:ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ ఈ రోజు చాలా గొప్ప రోజు. చరిత్రలో శాశ్వతంగా లిఖించదగ్గ రోజు. ఆ రోజు అమరావతి పనులకు ప్రధాని మోదీ గారు శంకుస్థాపన చేశారు. ఐదు సంవత్సరాలు విధ్వంసం జరిగింది. పనులు నిలిచిపోయాయి. మళ్లీ ప్రధాని మోదీ గారే పున:ప్రారంభం చేస్తున్నా రంటే దీనికంటే మంచి రోజు చరిత్రలో ఇంకోటి లేదని విజ్ఞప్తి చేస్తున్నాన్న అని అన్నారు. 2014లో రాజధాని లేని పరిస్థితుల్లో మనం పాలన ప్రారంభించాం. అమర లింగేశ్వర స్వామి ఆలయం కొలువైన పుణ్య భూమిగా, శాతవాహనుల రాజధానిగా, బౌద్దుల ఆధ్యాత్మిక కేంద్రంగా, కృష్ణమ్మ తీరాన విలసిల్లిన అమరావతిని రాజధానిగా ఎంపిక చేశాం.అమరావతి కేవలం ఒక నగరం కాదు.5 కోట్ల ఆంధ్రప్రదేశ్ ప్రజల సెంటిమెంట్. ప్రజల ఆత్మగౌరవానికి, ఆత్మవిశ్వాసానికి, ఆశలకు, >>2



## కస్టడీకి రాజ్ కసిరెడ్డి

**విజయవాడ,మే2,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న కెసిరెడ్డి రాజశేఖరరెడ్డిని విజయవాడ జిల్లాజైలు నుండి విచారణ నిమిత్తం సిట్ అధికారులు కస్టడీలోకి తీసుకున్నారు. జిల్లా జైలు నుంచి వైద్య పరీక్షల నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్య పరీక్షల అనంతరం విచారణకు ఆయన్ను కార్యాలయానికి తీసుకువెళ్ళారు. వైకాప హయాంలో జరిగిన మద్యం కుంభకోణంలో నాటి ప్రభుత్వ పెద్దల తరపున అన్నీ తానై వ్యవహరించిన కెసిరెడ్డి రాజశేఖరరెడ్డిని వారం రోజుల పాటు సిట్ కస్టడీకిస్తూ విజయవాడ >>2

## రైతుల త్యాగాలు మరువలేం

### ప్రపంచస్థాయి రాజధానిగా ఆవిర్భవించనున్న అమరావతి: పవన్ కల్యాణ్

### ఐదేళ్లుగా నలిగిపోయిన అమరావతి రైతులు



**విజయవాడ,మే2,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతి కోసం రైతులు చేసిన త్యాగం మరువలేనిదని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్అన్నారు.శుక్రవారం వెలగపూడిలో అమరావతి రాజధాని పునర్ నిర్మాణ పనులను ప్రధాని నరేంద్రమోడీ ప్రారంభించడానికి ముందు పవన్ ఉద్వేగ పూరిత ప్రసంగం చేసారు.అమరావతి కోసం కేసులు పెట్టించుకున్నారు. ఆందోళనలు చేశారు.ఐదేళ్ల క్రితం మా బాధ ప్రధానికి తెలుస్తుందా? అని ఆనాడు మహిళలు అడిగారు. మీ కష్టాలు ప్రధానికి తెలియకుండా పోవన్నాను,1237వ ఆది శంకరాచార్య జయంతి సందర్భంగా అమరావతి పునః ప్రారంభం జరుగుతుంది: అమరావతి రైతుల తరపున ప్రధానికి అభినందనలు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. దివిసీమ తుపానులా గత ప్రభుత్వం రాష్ట్ర, అమరావతి భవిష్యత్తును తుడిచిపెట్టిందన్నారు. అమరావతి అంటే పరదాలు, సెక్షన్ 144 గుర్తుకొచ్చేలా చేశారు. ధర్మం కోసం నిలిస్తే ధర్మం నిలుస్తుందని రైతులు చాటారు. ధర్మయుద్ధంలో రైతులు గెలిచారు. 34 వేల ఎకరాల భూములను రైతులు త్యాగం చేశారు. స్వచ్ఛందంగా తమ పొలాలు ఇచ్చిన రైతులకు, మీ త్యాగానికి మీ పోరాటానికి శిరస్సు వంచి నమస్కారాలు అన్నారు. అమరావతి పోరులో మహిళలు, దివ్యాంగుల లాఠీలు పడ్డాయి. గాయాల య్యాయి.శాయశక్తులా అమరావతి నిర్మాణానికి కూటమి ప్రభుత్వం పాటుపడుతుంది.అమరావతి మహిళా రైతుల పాత్ర చాలా అభినందనీయం. మగవారే ఆపేస్తే ఆడవారు బయటకొచ్చి పౌరుషం చూపారు పవన్‌కల్యాణ్ మహిళ సాహసం, సహనం అందరికీ ఆదర్శమన్నారు. గత ప్రభు త్వం అమరావతిని తుడిచిపెట్టిందన్నారు. అమరావతి సర్వశ్రేష్ఠ రాజధానిగా నిలుస్తుం దన్నారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ దేశమే తన కుటుంబంగా చేసుకుంటూ దేశాన్ని పాలిస్తున్న నరేంద్రమోదీకి రాష్ట్ర ప్రజల తరపున నమస్కా రాలు తెలియచేశారు ఏపీ ఉపముఖ్య మంత్రి పవన్ కల్యాణ్. ప్రస్తుతం దేశంలో కీలక పరిస్థితులు నెలకొన్న తరుణంలో ఎంతో బిజీ షెడ్యూల్ మధ్య కూడా ప్రధాని అమరావతికి రావడం చాలా సంతోషకరమని పవన్ అన్నారు. ప్రధాని మోదీకి ఆ కనకదుర్గమ్మ మంచి ఆరోగ్యం, మరిన్ని విజయాలు ప్రసాదించాలని పవన్ దేవతామూర్తిని ప్రార్థించారు. అమరావతి రైతులు, రాష్ట్ర ప్రజలు ధర్మ యుద్ధంలో విజయం సాధించారని పవన్ చెప్పారు. అమరావతి పనులు పు:న ప్రారంభమవుతున్న శుభసందర్భంలో రాజధానికి భూములు ఇచ్చిన రైతులకు పవన్ ధన్యవాదాలు తెలియచేశారు. గత ఐదేళ్లలో పడిన గాయాలు మనందరికీ గుర్తున్నాయి. ఎన్నో అవమానాలు, గాయాలు అమరావతి రైతులు అనుభవించారని పవన్ అన్నారు. "గత ఐదేళ్ల అమరావతి రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. లాఠీ దెబ్బలు కూడా తిన్నారు. అమరావతి రైతులు మరిచి పోలేని పోరాటం చేశారు. అమరావతే ఏపీ రాజధా నిగా ఉంటుందని ఆనాడు మాట ఇచ్చాం. ఇచ్చిన మాటకు కట్టుబడి మళ్లీ ప్రధాని నరేంద్ర మోదీతో రాజధాని అమరావతి పనులు పునఃప్రారంభం చేసుకుంటున్నాం. గత ప్రభుత్వం అమరావతి భవిష్యత్‌ను తుడిచిపెట్టే సింది. అయితే, ధర్మయుద్ధంలో అమరావతి రైతులు విజయం సాధించారు" అని పవన్ అన్నారు. రాళ్లలో రప్పల్లో ఓ మహానగరాన్ని చూసిన వ్యక్తి చంద్రబాబు అన్నారు. సైబరా బాద్‌ను ఎలా రూపకల్పన చేశారో అలాగే అమరావతి రూపొందుతుందన్నారు. పెహల్గాం ఉగ్రవాది దాడి తర్వాత దేశం మొత్తం యుద్ధం వైపు వెళ్తోంద న్నారు.గుండెల్లో ఎంతో బరువున్నా ప్రధాని అమరావతి వచ్చారు. ఉగ్రవాద బాధితుల ఆవేదనను నేను ప్రత్యక్షంగా చూశాను. ఉగ్రవాదంపై ప్రధాని కఠినమైన వైఖరి అనుసరిస్తారని పవన్ కల్యాణ్ అన్నారు. కనకదుర్గమ్మ ఆశీస్సులతో ప్రధానికి శక్తిని ఇవ్వాలి అని పవన్ కల్యాణ్ అన్నారు. అమరావతి ప్రపంచస్థాయి రాజధానిగా ఆవిర్భవిస్తుందని పవన్ ఆకాంక్షించారు. రాజధాని రైతులు భూములు మాత్రమే ఇవ్వలేదు.. రాష్ట్రానికి ఒక భవిష్యత్ ఇచ్చారని పవన్ కల్యాణ్ కొనియాడారు.



## మోడీతో పెట్టుకుంటే మ్యాప్‌లో పాకిస్థాన్ కనుమరుగు

### సభలో మంత్రి లోకేష్

**సచివాలయం,మే 2,ప్రభాతవార్త :** రాష్ట్రంలో 2019-24నడుమ విధ్వంస పాలన నడిచింది. చంద్రబాబుపై వ్యక్తిగత కక్షతో అమరావతి చంపాలని చూశారు,ఒక్క ఇటుక పెట్టకుండా మూడు రాజధానులు అంటూ 5ఏళ్ళు గడిపేశారని రాష్ట్ర విద్య,ఐటి,ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ధ్వజమెత్తారు.అమరావతి పనుల పున:ప్రారంభం సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో లోకేష్ మాట్లా డుతూ 8ఏళ్ళ పిల్లాడి దగ్గర నుండి 80ఏళ్ళ వృద్ధుల వరకు జై అమరావతి అంటూ జెండా పట్టారు.జై అమరావతి అన్నందుకు ఆనాడు రైతులకు సంకెళ్ళు వేశారు.అమరావతి ఉద్యమంలో పాల్గొన్నందుకు మహిళా రైతుల్ని పోలీసుల బూటు కాలితో తన్నించారు.1631రోజుల పాటు అమరా వతి ఉద్యమం కొనసాగింది.270మంది రైతులు చనిపోయారు.3వేల మంది పై అక్రమ కేసులు పెట్టారు.ఎన్ని కుట్రలు చేసినా జైఅమరావతి నినాదాన్ని మాత్రం ఆపలేకపోయారు.ఆపడానికి,పీకడానికి అమరావతి ఎవరి ఇంట్లో పెంచుకున్న పెరటి మొక్క కాదు.జనం గుండెల్లో దాచుకున్న ప్రజా రాజధాని,అమరావతికి శంకుస్థాపన చేసింది మన ప్రధాని. ఆయన శంకుస్థాపన చేసిన దాన్ని ఆపే దమ్ము ఎవడికీ లేదు.1631రోజులు పోరాడి అమరావతిని సాధించుకున్న రైతులకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను.

**వరల్డ్ మ్యాప్‌లో పాకిస్థాన్ మిస్సింగ్ ఖాయం:** పాకిస్థాన్ గీత దాటింది.అమాయకుల్ని చంపి చాలా పెద్ద తప్పుచేసింది.ఒక్క పాకిస్థాన్ కాదు,వంద పాకిస్థాన్‌లు వచ్చినా భారతదేశం నేలపై మొలిచిన గడ్డి కూడా పీకలేదు.వంద పాకిస్థాన్లకు సమాధానం చెప్పే ఒక మిస్సైల్ మన దగ్గర ఉంది.ఆ మిస్సైల్ పేరు నరేం ద్రమోడీ.సింహం ముందు ఆటలు ఆడకూడదు.మన సింహం నమో కొట్టే దెబ్బకు వరల్డ్ మ్యాప్‌లో పాకిస్థాన్ మిస్సింగ్ అని రావడం ఖాయం.పాకిస్థాన్ ఆర్మీలో పనిచేసేవారు శెలవు పెట్టి పారిపోతున్నారు.కొ ంతమంది రాజీనామా చేస్తున్నారు.దటీజ్ నరేంద్ర మోడీ.నమో కొట్టే దెబ్బకి పాకిస్థాన్ దిమ్మతిరగడం ఖాయం.పాకిస్థాన్ కు ధీటుగా సమాధానం ఇవ్వడానికి దేశం మొత్తం ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి అండగా నిలుస్తుంది.పహాల్గామ్ ఉగ్రవాదుల దాడిలో చనిపోయిన వారికి నివాళులర్పిస్తున్నాను.ఉగ్రదాడిలో చనిపోయిన వారి కుటుంబాలకు దేశం అండగా ఉంటుంది.

**కులగణన సంచలనాత్మక నిర్ణయం:** కేంద్రంకుల గణన చేయాలని తీసుకున్న నిర్ణయం ఒక సంచలనం.ఇతరులు దశాబ్దాలుగా సంకోచించిన ఒక కీలక అంశంపై మోడీజీ ధైర్యంగా నిర్ణయం తీసుకొని చరిత్రను తిరగ రాశారు.అణగారిన వర్గాలకు సాధికారత కల్పించాలనే నిబద్ధతకు లోబడి మోడీజీ సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారు.వెనుకబడిన వర్గాల సామాజిక న్యాయం >>2

మతం మారిన రోజే..

## ఎస్సీ హోదా కోల్పోతారు

### హైకోర్టు స్పష్టీకరణ

**విజయవాడ,మే2,ప్రభాతవార్తప్రతినిధి:** షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) వ్యక్తులు క్రైస్తవంలోకి మారిన రోజే ఎస్సీ హోదాను కోల్పోతారని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ విషయంలో ఎస్సీ,ఎస్టీ చట్టం నుండి రక్షణ పొందలేరని తెల్చిచెప్పింది.ఈ అంశంపై ఒక చర్చి ఫాస్టర్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ క్రింద పలువురిపై పోలీసులు కేసు నమోదు చేయడాన్ని తప్పుబట్టింది. చట్టాన్ని దుర్వినియోగం చేసి తప్పుడు ఫిర్యాదు ఇచ్చారని ఆక్షేపించింది. పోలీసులు ఛార్జిషీటు వేయకుండా ఉండాల్సిందని అభిప్రాయపడింది. కేసును కొట్టేసింది. న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ ఈ మేరకు ఇటీవల తీర్పు ఇచ్చారు. తనను కులం పేరుతో దూషించి,దాడి చేసి గాయపరిచారని ఉమ్మడి గుంటూరు జిల్లా పిట్టలవాని పాలెం మడలం కొత్తపాలెం గ్రామానికి చెందిన ఫాస్టర్ చింతాడ ఆనంద్ 2021లో చందోలు పోలీసులకు >>2

## మీ సలహాలు ఆనందకర సేవలకు దోహదం

### భక్తుల అభిప్రాయాలకు వాట్సాప్‌తో టిటిడి నూతన ఫీడ్‌బ్యాక్

**తిరుమల,మే 2 ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనార్థం దేశం నలుమూలల నుండి తిరుమలకు విచ్చేస్తున్న భక్తులకు వసతి,దర్శనం, అన్నప్రసాదాలు ఇతరత్రా సేవలపై భక్తుల నుండి అభిప్రాయసేకరణకు టిటిడి అధికారులు వినూత్న ఆలోచన చేశారు. తిరుమలకు వచ్చిన భక్తులు అన్ని సేవలపై అందుతున్న సౌకర్యాలు ,ఇంకా మెరుగుపరచాల్సిన విషయాలు తెలుసుకునేందుకు టిటిడి కొత్త ఫీడ్‌బ్యాక్‌విధానం(అభిప్రాయసేకరణ)కు వాట్సాప్‌ద్వారా సులభంగా అభిప్రాయం చెప్పేలా రూపొందించింది. ఈ నూతన విధానం శుక్రవారం నుండి తిరుమలలో మొదలైంది. ఇందుకు పలు ప్రాంతాల్లో క్యూఆర్‌కోడ్‌ను ఏర్పాటుచేసి, భక్తులు తమ మొబైల్‌తో స్కాన్‌చేస్తే వాట్సాప్‌లో తెలియజేయాల్సిన అభిప్రాయసేకరణ కనిపిస్తుంది. తిరుమలలో గత పదినెలల కాలంలో సామాన్యభక్తుల సౌకర్యాలకు పెద్ద పీట వేస్తూ అన్నప్రసాదం, లడ్డూల నాణ్యత రుచి పెంచింది. తిరుమలలో పరిశుభ్రత కూడా కాటేజీల గదులు, అతిధిగృహాల గదుల్లో ,యాత్రికుల వసతి సముదాయాల్లో శుభ్రత, చెత్తా చెదారం తొలగిం చడం వంటి పనులు మెరుగుపడ్డాయి. టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ప్రతిరోజూ లక్షమంది వరకు భక్తులు తిరుమలకు వస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలతో తిరుమలలో మెరుగుపరచాల్సిన సేవలపై భక్తుల నుండి సాంకేతికంగా అభిప్రాయసేకరణకు శ్రీకారం చుట్టింది.




**ఫీడ్‌బ్యాక్‌విధానం:** ఏడుకొండల వెంకన్న దర్శనార్థం తిరుమల, తిరుపతికి వస్తున్న భక్తులు తమకు ఎదురయ్యే ఇబ్బందులు, అసౌకర్యం, సూచనలు సలహాలు తెలియజేసేందుకు ప్రత్యేకంగా వాట్సాప్‌ద్వారా ఫీడ్‌బ్యాక్ విధానం అమలుచేస్తోంది. ఇందుకు భక్తులు సంచరించే పలు ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన క్యూఆర్ కోడ్‌ను మొబైల్‌తో స్కాన్‌చేస్తే వాట్సాప్‌లో టిటిడి అభిప్రాయసేకరణ పేజీ కనిపిస్తుంది. ఈ అప్లికేషన్‌లో భక్తులు తమ పేరు, విభాగం అన్నప్రసాదం, కల్యాణకట్ట, లడ్డూకౌంటర్లు,లగేజీ,దర్శనం అను భవం, పరిశుభ్రత ,క్యూలైన్‌లు, గదులకు సంబంధించిన అంశాలు ఎంచుకోవాలి. ఆ తరువాత భక్తులు తమ అభిప్రాయం తెలియజేయడానికి టెక్స్ట్‌రూపంలోగానీ, వీడియో ఫార్మాట్‌ను >>2

## అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ

### ఐబిఎం, టిసిఎస్, ఎల్‌అండ్‌టితో ఒప్పందం

**విజయవాడ,, మే2,ప్రభాతవార్తప్రతినిధి:** క్వాంటం కంప్యూటింగ్‌లో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ముందువరుసలో నిలపాలని పట్టుదలతో అడుగులు ముందుకు వేస్తున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.2026, జనవరి 1న అమరావతి కేంద్రంగా క్వాంటం కంప్యూటింగ్ కార్యకలాపాలు ప్రారంభించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. శుక్రవారం ఉండవల్లిలో సీఎం చంద్రబాబు నివాసంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఐబీఎం, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), లార్సన్ టూబ్రో సంస్థలతో ఎంవోయూ కుదుర్చుకుంది. >>2



శుక్రవారం ప్రధాని మోదీకి స్వాగతం పలుకుతున్న గవర్నర్ నజీర్, సీఎం చంద్రబాబు



శుక్రవారం అమరావతి పనుల పునఃప్రారంభానికి హాజరైన అశేష జనవాహిని



ప్రధానికి వీడ్కోలు పలుకుతున్న సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్

## వికసిత్ భారత్‌కు గ్రోత్ ఇంజన్ 'అమరావతి'

>> గుంతకల్ వెస్ట్‌మల్లప్ప గేట్ ఆర్‌యూబీ నిర్మాణం 3,716 కోట్లతో ఆరు జాతీయ రహ దారుల ప్రాజెక్టులు రూ.254 కోట్లతో పూర్తి చేసిన ఖాజీపేట-విజ యవాడ మూడో లేన్‌ను ప్రారంభించారు. రూ.57,962 కోట్ల ప్రాజె క్టులకు ప్రధాని మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్స వాలు చేశారు. ఆంధ్రప్రదేశ్‌ను అధునాతనప్రదేశ్‌గా మార్చే శక్తి అమరావతికి ఉంది. నేను గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు ఏపీ సీఎంగా చంద్రబాబు టెక్నాలజీ వాడకాన్ని గమనించాను. ఏఐ, టెక్నాలజీ, గ్రీన్ ఎనర్జీ, విద్యా రంగాల్లో అమరావతి ముందు ఉంటుంది. 10 ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం అమరావతికి అన్ని విధాలుగా మద్దతుగా నిలిచింది. రికార్డు స్పీడులో పనులు పూర్తి చేయడానికి కేంద్రం సహకరిస్తుంది. ఏపీలో అవసరమైన నిర్మాణాలకు ప్రాధాన్యతనిస్తుంది. ఏపీలోని ప్రతి ఒక్కరి కలలను అమరావతి సాకారం చేస్తుంది. అమరావతికి ఉన్న ఆటంకాలు తొలగిపోయి, ఇప్పుడు పనులు వేగంగా జరుగు తున్నాయి. గత పదేళ్లలో భారతదేశం అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఒకటిగా నిలిచింది. ఏపీలో కనెక్టివిటీ ఒక కొత్త అధ్యాయం మొద లవ్వబోతోంది. తక్కువ సమయంలో తమ పంటను తీసుకెళ్లడ మనేది పర్యాటకం, తీర్థయాత్ర, తదితర రంగాలకు కూడా ఉపయోగ పడుతుంది. హైవేల నిర్మాణం వల్ల టూరిజం అభివృద్ధి చెందు తుంది. అమరావతిని వికసిత్ భారత్ గ్రోత్ ఇంజిన్‌గా మార్చాలి. అమృత్ భారత్ కింద చాలా రైల్వే స్టేషన్లను ఆధునీకరించాం. సాగునీరుకు ఇబ్బంది లేకుండా నదుల అనుసంధానం చేస్తున్నాం. మౌలిక సదుపాయాల కల్పన వల్ల ఉపాధి అవకాశాలు పెరుగు తాయి. పోలవరాన్ని వేగంగా పూర్తి చేయడానికి సహకారమందిస్తాం. శ్రీహరికోట నుండి జరిగే ప్రయోగాలు, దేశ మొత్తాన్ని గర్వపడేలా చేస్తున్నాయి. రోడ్ల నిర్మాణం వల్ల రైతులు, ఉద్యోగులు, సామా న్యులకు ప్రయోజనం. రైతులకు ఎంఎస్‌పీ సమస్య ఉండకూడదనేది మా ఉద్దేశం 2009-14 వరకు ఉమ్మడి ఏపీకి రూ.900 కోట్ల కంటే తక్కువ బడ్జెట్ ఉండేది. ఇప్పుడు ఒక్క ఏపీ రైల్వే బడ్జెట్ రూ.9 వేల కోట్లపైనే ఉంది. రైల్వే ప్రాజెక్టులతో రాష్ట్రాల మధ్య అనుసంధానం పెరుగుతుందన్నారు. ఇది ఆర్థిక, పర్యాటక అభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో నడిపించేందుకు సీఎం చంద్రబాబునాయుడు మీద విశ్వాసం ఉందని, అమరావతి నగర నిర్మాణం మూడేళ్లలో పూర్తవుతుందని ప్రధాని మోదీ ధీమా వ్యక్తం చేశారు. అమరావతిలో తలపెట్టిన అభివృద్ధి ప్రాజెక్టులన్నీ పూర్తైతే, ఆంధ్రప్రదేశ్ జీడీపీ గణనీయంగా పెరుగుతుందని ప్రధానమంత్రి అన్నారు. చంద్రబాబు ఆహ్వానం మేరకు నేను యోగా దినోత్సవం రోజున ఏపీలో పర్యటిస్తాను అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

## అమరావతికి అండ

>> ఏపీ సీఎం చంద్ర బాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కప్పి సత్కరించారు. అమరావతి నగర నేపథ్యం ఉన్నకలంకారీ జ్ఞాపికను అందజేశారు. ఈ సభా వేదికపై మంత్రులు పి.నారాయణ, సత్యకు మార్ యాదవ్, నాదెండ్ల మనోహర్, కేంద్రమంత్రులు కె.రామ్మోహన్‌నాయుడు, భూపతిరాజు శ్రీనివాసవర్మ, పెమ్మసాని చంద్రశేఖర్.శాసనసభ్యులు యలమంచిలి సత్యనారాయణ(సుజన) చౌదరి, తెనాలి శ్రావణ్‌కుమార్,వేదికపైకి వచ్చే ముందు మండలి బుద్ధప్రసాద్ తదితరులతో ప్రధాని కరచాలనం చేసారు.అమరావతి పునర్ నిర్మాణ పనులు అనంతరం ఆయన విజయవాడ విమానాశ్రయం చేరుకున్నారు.ప్రత్యేక విమానంలో ఢిల్లీ వెళ్లారు. ఈ సందర్భంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆయనకు స్వయంగా వీడ్కోలు తెలిపారు. ఇక ప్రధాని సభకు భారీగా జనం తరలివచ్చారు.ప్రత్యేకంగా అమరావతి ఉద్యమంలో పాల్గొన్న మహిళలు ఈ సభలో అత్యంత ఉత్సాహంగా కనిపించారు .ప్రధాని, సీఎం,డిప్యూటీసీఎం ప్రసంగించే సందర్భంలో వారు జయహో అమరావతి అంటూ బిగ్గరగా నినాదాలు చేసారు. ప్రధాని రాక సందర్భంగా జాతీయరహదారిపై వాహనాల రాకపోకలపై ఆంక్షలు విధించారు. విజయవాడ మహానగరంలో వాహనాలు అడుగుపెట్టకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.నేరుగా అమరా వతి చేరుకోవడానికి బైపాస్‌పై వాహనాలకు అనుమతినిచ్చారు.

## చరిత్రలో నిలిచిపోయే రోజు

>> ఆకాంక్షలకు ప్రతి రూపం ప్రపంచంలో ఎన్నడూ లేని విధంగా 29 వేల మంది అన్నదాతలు, 34 వేల ఎకరాలు రాజధానికిచ్చారు.అద్భుత రాజధాని నిర్మాణం తలపెడితే....తరువాత వచ్చిన ప్రభుత్వం విధ్వంసం చేసింది. నాటి ప్రభుత్వ దమనకాండ పై రైతులు, రైతు కూలీలు, మహిళలు తిరుగులేని పోరాటం చేశారు. ఈ సమయంలో జరిగిన న్యాయ పోరాటంలో న్యాయస్థానాలు అమరావతిని బతికించాయి. 2024 ఎన్నికల్లో ఏకపక్షంగా ఇచ్చిన ప్రజాతీర్పుతో అమరావతి మళ్లీ ఊపిరిపోసుకుంది. 10 నెలల్లో సవాళ్లను అధిగమించి, కేంద్ర సహకారంతో, మోదీ ఆశీస్సులతో అమరావతి నిర్మాణాలను పట్టాలెక్కించాం. నేడు మోదీ గారి చేతుల మీదుగా అమరావతి పనులను రీ స్టార్ట్ చేస్తున్నాం.రాష్ట్రంలో ప్రతి పౌరుడు సగర్వంగా"నా రాజధాని అమరావత్తి అని చెప్పుకునేలా నిర్మిస్తాం. 2015లో ప్రధాని చేతుల మీదుగా శంకుస్థాపన చేసిన రాజధానిని విధ్వంసం చేశారు మళ్లీ నేడు మీ చేతుల మీదుగా పనులు ప్రారంభించాం...రేపు మీరే మళ్లీ ప్రారంభోత్సవం చేయాలని కోరుతున్నాం.ఒకే రోజు రూ.49,000 కోట్ల విలువైన 74 పనులకు శంకుస్థాపన చేసుకున్నా వీటికి అదనంగా రూ.5,028 కోట్లతో చేపట్టే 9 కేంద్ర ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. అలాగే, రూ.3,680 కోట్లతో నిర్మాణం పూర్తి చేసుకున్న 8 జాతీయ రహదారులను ప్రధాని ఈ రోజు ప్రారంభించారు.మరో రూ.254 కోట్లతో నిర్మించిన 3 రైల్వే ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు. అమరావతి, కేంద్ర ప్రాజెక్టులు కలిపి మొత్తం రూ.57,962 కోట్ల విలువైన 94 ప్రాజెక్టులకు ఈరోజు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. వరల్డ్ క్లాస్ క్యాపిటల్ : బ్లూ అండ్ గ్రీన్ సిటీగా అమరావతి ఉంటుంది. 30 శాతం ప్రాంతం పచ్చదనం, జలవనరులతో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతాం. నవ నగరాలను రాజధానిలో భాగంగా ఉంటాయి. రాజధాని నిర్మాణానికి ప్రధాని మోదీ గారు పలు సూచనలు చేశారు. వాటిని అమలుచేస్తాం.ఇన్నర్ రింగ్ రోడ్, అవుటర్ రింగ్ రోడ్, భవిష్యత్ నగరంగా అమరావతి ఉంటుంది. గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్ పోర్టుతో అన్ని ప్రపంచ దేశాలకు కనెక్టివిటీ పెంచుతాం. ప్రపంచస్థాయి సంస్థల ఏర్పాటుతో అమరావతి హెల్త్, ఎడ్యుకేషన్ హబ్ గా ఉండబోతోంది.మోదీ గారు సూచించిన జపాన్ మియావాకీ తరహా పచ్చదనం పెంచే విధానాన్ని అమలు చేస్తాం.అన్నీ వయాడక్ట్ పద్దతిలో అందిస్తాం. గ్రీన్ ఎనర్జీతో పర్యావరణ అనుకూలంగా రాజధానిఇన్ లాండ్ వాటర్ వేస్, సైక్లింగ్ ట్రాక్స్, డిస్ట్రిక్ట్ కూలింగ్ సిస్టం, వాకింగ్ పాత్ తీసుకువస్తాం. బిజినెస్ స్కూల్, గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేస్తాం.అభివృద్ధి వికేంద్రీకరణ మన సిద్దాంతం. రాజధాని మాత్రమే కాదు26 జిల్లాల్లో ప్రతీ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తాం. అభివృద్ధి వికేంద్రీకరణ చేపడతాం. 201419 మధ్య కేంద్ర ప్రభుత్వ సంస్థలను అన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేశాం. కేంద్ర సహకారంతో 2027 నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తాం. రాష్ట్రంలో నదుల అనుసంధానం పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీళ్లు ఇస్తామన్నారు.

**ప్రధాని మోదీకి అండగా ఉంటాం:** సీఎం చంద్రబాబు తన ప్రసంగం ప్రారంభంలోనే ఉగ్రవాదం గురించి ప్రస్తావించారు.ఈ అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందిస్తూ.. ముందుగా మీ అందరికీ ఓ విషయం చెప్పాలి. గతంలో మోదీ గారిని ఎప్పుడు కలిసినా.. చాలా ఆహ్లాదకరంగా ఉండేవారు. కానీ, మొన్న అమరావతి కార్యక్రమానికి పిలవడానికి వెళ్లాను. ఆ మీటింగ్ చాలా గంభీరంగా సాగింది. దీనికి కారణం.."నా దేశ ప్రజలు ఉగ్రవాదుల దాడిలో చనిపోయార్థు అన్న ఆవేదన మోదీ గారిలో చూశాను. ఈ సందర్భంగా మీ అందరి తరపునా ఆయనకు నేనో విజ్ఞప్తి చేస్తున్నాను. ఉగ్రవాదాన్ని అణిచివేయడానికి మోదీ, కేంద్రం తీసుకునే నిర్ణయాలకు మేము అండగా ఉంటామ్థు స్పష్టం చేశారు.

**రైట్ లీడర్ ఫర్ ది నేషన్:** నరేంద్ర మోదీ నాయకత్వం గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ రైట్ టైం .. రైట్ లీడర్ ఫర్ ది నేషన్.. దట్ ఈజ్.. నరేంద్ర మోదీజీ. చాలా దృఢమైన నాయకుడు.. బ్యాలెన్స్ కలిగిన నాయకుడు. ప్రపంచం నలుమూలలా ఉన్న ప్రజలందరూ మోదీ నాయకత్వాన్ని మెచ్చుకుంటున్నారు. నరేంద్ర మోదీ తన 11 ఏళ్ల పాలనలో ప్రపంచ ఎకానమీలో దేశాన్ని 10 స్థానం నుంచి 5వ స్థానానికి తీసుకువచ్చారు. ఈ సంవత్సరం జపాన్‌ను వెనక్కు నెట్టి 4వ స్థానంలోకి రాబోతోంది అని అన్నారు.

## ప్రధాని మోడీకి ఘనస్వాగతం

**విజయవాడ,మే2,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతిలో రాజధాని నిర్మాణ పనులు పునః ప్రారంభం సందర్భంగా వెలగపూడి చేరుకున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి హెలీప్యాడ్ వద్ద గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్,స్వాగతం పలికారు.అక్కడ నుంచి ప్రత్యేక వాహనంలో సభా వేదిక వద్దకు ప్రధాన మంత్రి నరేంద్రమోడీ చేరుకున్నారు.సభావేదికపై వస్తున్న ప్రధాని నరేంద్రమోడీకి అపూర్వస్వాగతం లభించింది.సభావేదిక వద్ద ప్రధానమంత్రి నరేంద్ర మోదీ" మంత్రులు నారా లోకేష్ , నారాయణ సత్యకుమార్ కొల్లు రవీంద్ర గారు, నాదెండ్ల మనోహర్ కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడుశ్రీనివాసవర్మ , పెమ్మసాని చంద్రశేఖర్ కూటమి ఎమ్మెల్యేలు, నేతలు. స్వాగతం పలికారు. అంతకు ముందు గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ప్రజా ప్రతినిధులు, ఇతర రాజకీయ ప్రముఖులు ఘన స్వాగతం పలికారు. శుక్రవారం మధ్యాహ్నం 02:50 గంటలకు ప్రత్యేక విమానంలో గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయమునకు చేరుకున్న భారత ప్రధానికి ప్రజా ప్రతినిధులు, రాజకీయ ప్రముఖులు స్వాగతం పలికారు. రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, హోంమంత్రి వంగలపూడి అనిత, రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, రాష్ట్ర కార్మిక, ఫ్యాక్టరీలు, బాయిలర్స్, బీమా వైద్యసేవలు శాఖ, కృష్ణా జిల్లా ఇన్చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్, పార్లమెంట్ సభ్యులు సీఎం రమేష్, బందరు పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి, విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేసినేని శివనాథ్ (చిన్ని), బాపట్ల పార్లమెంట్ సభ్యులు కృష్ణ ప్రసాద్ తెన్నేటి, రాజ్యసభ సభ్యులు పాక వెంకట సత్యనారాయణ, ఎమ్మెల్సీ చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ, ప్రభుత్వ విప్ గన్నవరం నియోజకవర్గం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు, ఎమ్మెల్సీలు సోము వీర్రాజు, కొణిదల నాగబాబు, విజయవాడ పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు యలమంచిలి సుజనా చౌదరి, కైకలూరు నియోజకవర్గం శాసనసభ్యులు కామినేని శ్రీనివాసరావు, ఉత్తర విశాఖపట్నం శాసనసభ్యులు విష్ణుకుమార్ రాజు, జమ్మలమడుగు నియోజకవర్గ శాసనసభ్యులు సిహెచ్ ఆదినారాయణ రెడ్డి, మాజీ పార్లమెంట్ సభ్యులు కంభంపాటి రామ్మోహన్ రావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి అనంత రాము, పోలీసు జైల్స్ అండ్ కరెక్షనల్ సర్వీసెస్ డిజి అంజనీ కుమార్, ఇంటెలిజెన్స్ బ్యూరో జాయింట్ డైరెక్టర్ అభిషేక్, కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, కృష్ణాజిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావు ప్రధానమంత్రికి ఘన స్వాగతం పలికారు.

## కేంద్రం సాయం మరువలేనిది: సీఎం చంద్రబాబు నాయుడు

**విజయవాడ,మే2,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణ పనుల పున:ప్రారంభోత్సవానికి విచ్చేస్తున్న ప్రధాని నరేంద్రమోడీకి మన:పూర్వకంగా స్వాగతం పలుకుతున్నట్లు సిఎం చంద్రబాబు తెలిపారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'వేదికగా పోస్టు చేశారు. రాష్ట్ర ప్రజల కలల రాజధాని నిర్మాణాన్ని సాకారంచేసేందుకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. ఏపీలో ప్రతి పౌరుడికీ ఉద్యోగ,ఉపాధి అవకాశాలు సృష్టించే ప్రజా రాజధానిగా అమరావతి ఆవిష్కృతం అవుతుందని, సంపద సృష్టితో రాష్ట్రానికి ఒక చోదక శక్తిగా నిలబడుతుందని పేర్కొన్నారు. ఇందుకు సహకరిస్తున్న ప్రధాని నరేంద్రమోడీకి రాష్ట్ర ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

### ఐదు కోట్ల ఆంధ్రుల ఆకాంక్షలకు ప్రతిరూపం అమరావతి - డీ.సీఎం పవన్‌కళ్యాణ్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజా రాజధాని అమరావతి నిర్మాణ పనులను పున:ప్రారంభించేందుకు రాష్ట్రానికి విచ్చేస్తున్న నరేంద్ర మోడీకి హృదయపూర్వక స్వాగతం పలుకుతున్నట్లు డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ పేర్కొన్నారు. ఐదు కోట్ల ఆంధ్రుల ఆకాంక్షలకు ప్రతిరూపంగా రూపుదిద్దుకుంటున్న ప్రజా రాజధాని పునర్నిర్మాణాన్ని ప్రారంభిస్తున్నందున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు.

## మోడీతో పెట్టుకుంటే మ్యాప్‌లో పాకిస్థాన్ కనుమరుగు

>> కోసం దశాబ్దాలుగా చేస్తున్న పోరాటాలకు ఈ నిర్ణయం పరిష్కారం చూపుతుంది.

**జెట్ స్పీడ్‌తో అభివృద్ధి వికేంద్రీకరణ:** ప్రధాని నరేంద్రమోడీ చేతుల మీదుగా అమరావతి పనులు తిరిగి ప్రారంభం అవుతున్నాయి.ఇక మనకు తిరుగులేదు.అమరావతి అన్‌స్టాపబుల్ అభివృద్ధి వికేంద్రీకరణ జెట్‌స్పీడ్‌తో జరగబోతుంది.అమరావతి,పోలవరం,విశాఖ స్టీల్ ప్లాంట్,భోగాపురం ఎయిర్ పోర్ట్ ,ప్రకాశం జిల్లాలో సిబిజి ప్లాంట్ ..ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి అన్ని రకాలుగా ప్రధాని నరేంద్ర మోడీ సహాకారం అందిస్తున్నారు.మనం గతాన్ని ఒకసారి గుర్తుచేసుకోవాలి.2014లో కట్టుబట్టలతో మనల్ని బయటకు గెంటేశారు.ఎక్కడినుండి పరిపాలన ప్రారంభించాలో తెలియని పరిస్థితి,చంద్రబాబుకి సంక్షోబాలు కొత్త కాదు..ఒక పక్క సంక్షేమం..మరో పక్క అభివృద్ధి చేసి చూపించారు.అందరూ ఆమోదం తెలిపిన తర్వాతే అమరావతిని రాజధానిగా ప్రకటించారు.రైతుల త్యాగాలతో అమరావతి ఏర్పడింది. ఒకే రాజధాని..అభివృద్ధి వికేంద్రీకరణ ఎజెండాతో పనిచేశాం.రాయలసీమను ఎలక్ట్రానిక్స్,ఆటోమొబైల్ హబ్‌గా తయారు చేశాం.గోదావరి జిల్లాల్లో అక్వాను ప్రోత్సహించాం,ఉత్తరాంధ్రలో ఫార్మా,ఐటి కంపెనీలను తీసుకొచ్చాం .

**ఇప్పుడు ఏపిలో డబుల్ ఇంజన్ సర్కార్:** ప్రధాని నరేంద్రమోడీజీకి ఆంధ్రప్రదేశ్ అన్నా,అమరావతి అన్నా ఎంతో ప్రేమ.ఇప్పుడు ఆయన ఢిల్లీలో ఎంత బిజీగా ఉన్నారో మనందరికీ తెలుసు,అయినా ఈ కార్యక్రమానికి వచ్చారు.2024ఎన్నికల్లో ప్రజలు ఎన్డీయేకి 94శాతం సీట్లు ఇచ్చారు.మన ప్రధాని ఆంధ్రప్రదేశ్ కోరిన ప్రతి కోరికను తీరుస్తున్నారు.గతంలో విశాఖపట్నం వచ్చి రైలే వ్జోన్,ఎన్టీపిసీ గ్రీన్,నక్కపల్లి బల్ క్ డ్రగ్ పార్కుకు శంకుస్థాపన చేశారు.విశాఖ ఉక్కును కాపాడారు.ఇప్పుడు అమరావతి అభివృద్ధికి నిధులు కేటాయించడమే కాకుండా పనులు తిరిగి ప్రారంభిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్ లోఇప్పుడు డబుల్‌ఇంజన్ సర్కార్ ఉంది.రెండూ పవర్ ఫుల్ ఇంజన్లు ఒక్క పక్క పవర్‌ఫుల్ ఇంజన్ నమో,మరోపక్క మన చంద్రబాబు అభివృద్ధి సంక్షేమం జోడెద్దుల బండి ఎన్ని ఇబ్బందులు ఉన్నా సంక్షేమ కార్యక్రమాలు అమలుచేస్తూ అభివృద్ధి పరుగులు పెట్టిస్తున్నారు మన చంద్రబాబు,పవనన్న ఇక మనకు తిరుగులేదు.


**20లక్షల ఉద్యోగాల కల్పనదిశగా అడుగులు:** ప్రజాప్రభుత్వం ఏర్పడిన 10నెలల్లోనే 8లక్షల కోట్ల పెట్టుబడులు వాటి ద్వారా 5లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి ఒప్పందాలు కుదుర్చుకున్నాం.16347పోస్టులతో మెగా డిఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చాం.185000కోట్లు పెట్టుబడి,57వేల మందికి ఉద్యోగాలు కలి ్పంచే ఎన్టీపిసి గ్రీన్ ఎనర్జీ విశాఖపట్నం రాబోతుంది. 136000కోట్లు పెట్టుబడి, 55వేల మందికి ఉద్యోగాలు కల్పించే ఆర్సెల్లార్ మిట్టల్ అనకాపల్లికి రాబోతుంది.97000కోట్లు పెట్టుబడి,3వేల మందికి ఉద్యోగాలు కలి ్పంచే బిపిసిఎల్ రామాయపట్నం కి రాబోతుంది.తిరుపత్తి జిల్లాకు ఎల్జీ ఎలక్ట్రానిక్స్,కర్నూలు,కడప,అనంతపురం కు రెన్యూవబుల్ ఎనర్జీ ప్రకాశం కు రిలయన్స్ సిబిజి ఉత్తరాంధ్రకు ఫార్మా,ఐటి ఇలా అన్ని జిల్లాలను అభివృద్ధి చేయబోతున్నాం.5ఏళ్ళలో 20లక్షల ఉద్యోగాలు కల్పించడం లక్ష్యంగా పెట్టుకొని పనిచేస్తున్నామని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.

## అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ

>>దీంతో అమరావతిలో భారతదేశపు మొట్టమొదటి, అత్యాధునిక క్వాంటమ్ వ్యాలీ టెక్ పార్క్ నిర్మాణం కానుంది. దేశంలోనే తొలిసారి ఐబీఎం అతిపెద్ద క్వాంటమ్ కంప్యూటర్ 156 క్యూబిట్ హెరాన్ ప్రాసెసర్ కలిగిన"క్వాంటం సిస్టం 2ని అమరావతిలో నెలకొల్పనుంది.ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడారు.

**ఆంధ్రప్రదేశ్‌కు చారిత్రాత్మక రోజు :** 1990 దశకంలో దేశంలో ఐటీ విప్లవానికి ఆంధ్రప్రదేశ్ కీలకంగా నిలిచిందని సీఎం చంద్రబాబు అన్నారు., ఇప్పుడు దేశంలో క్వాంటమ్ విప్లవానికి కూడా నాయకత్వం వహిస్తుందని అన్నారు. ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీతో జరిగిన ఒప్పందం"ఈ రోజు ఆంధ్రప్రదేశ్‌కే కాదు, భారతదేశానికి కూడా చారిత్రాత్మకమ్థ అని ముఖ్యమంత్రి అన్నారు. "క్వాంటమ్ కంప్యూటింగ్థ భవిష్యత్ పాలనకు, ఆవిష్కరణలకు పునాది అవుతుందని చెప్పారు. సాంకేతికరంగంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి కొత్త అవకాశాలు వస్తున్నాయని, అయితే వాటిని అందిపుచ్చుకోవడం ముఖ్యమని సీఎం చంద్రబాబు అన్నారు. భవిష్యత్ అవసరాలన్నీ క్వాంటం కంప్యూటింగ్‌పైనే ఆధారపడి ఉంటాయని అందుకే అమరావతిని క్వాంటం వ్యాలీ చేయాలనుకున్నట్టు ముఖ్యమంత్రి చెప్పారు. సిలికాన్ వ్యాలీ తరహాలో క్వాంటం వ్యాలీగా అమరావతిని తీర్చిదిద్దాలని ఐబీఎం, టీసీఎస్ సంస్థల ప్రతినిధులకు ముఖ్యమంత్రి సూచించారు. హైటెక్ సిటీని 15 నెలల్లో నిర్మించిన అనుభవాన్ని గుర్తుచేస్తూ, క్వాంటమ్ వ్యాలీ తక్కువ సమయంలోనే నిర్మించవచ్చన్నారు. ఇప్పటికే ఎల్ టీకి స్థలాన్ని కేటాయించామని, మౌలిక వసతులను అత్యంత వేగంగా అభివృద్ధి చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇందుకోసం రెండు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఒక కమిటీ నిర్మాణం పురోగతిని పరిశీలిస్తే, మరొక కమిటీ వ్యవస్థ అభివృద్ధిపై దృష్టి సారిస్తాయని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి త్వరలోనే ఈ ప్రాజెక్టును సవివరంగా తెలియజేస్తామన్నారు.

**క్వాంటం ప్రయాణానికి కీలక మలుపు :** భారతదేశంలో ఐబీఎం క్వాంటం సిస్టం 2 స్థాపన, దేశ క్వాంటం ప్రయాణానికి కీలక మలుపు కానుందని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం టీసీఎస్‌తో కలిసి పని చేయడం వల్ల క్వాంటం అల్గోరిథం అభివృద్ధి వేగవంతం అవుతుందని ఐబీఎం క్వాంటం వైస్ ప్రెసిడెంట్ జే గాంబెట్టా అన్నారు. క్వాంటం, క్లాసికల్ సిస్టమ్‌లను కలిపిన హైబ్రిడ్ కంప్యూటింగ్ ద్వారా జీవశాస్త్రం,




ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఐబీఎం, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), లార్సన్ టూబ్రో సంస్థలతో సీఎం చంద్రబాబు సమక్షంలో ఎంవోయు కుదుర్చుకున్న దృశ్యం

మెటీరియల్స్, క్రిప్టోగ్రఫీ వంటి రంగాల్లో విప్లవాత్మక ఫలితాలు సాధించవచ్చని ఇది ఒక కీలక ఘట్టమని టీసీఎస్ సీటీవో డాక్టర్ హారిక్ విన్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో టీసీఎస్ తొలిసారి రాష్ట్రంలో డిజిటల్ గవర్నెన్స్‌కు బీజం వేసిందని టీసీఎస్ ప్రతినిధులు వి. రాజన్న, సి.వి. శ్రీధర్ గుర్తు చేశారు. క్వాంటం వ్యాలీ ద్వారా పరిశోధన, అభివృద్ధి మరింత ముందుకు సాగుతుందని చెప్పారు. దివీవి నెట్‌వర్క్ ద్వారా 17 రాష్ట్రాల్లో 43 కేంద్రాలకు ప్రత్యక్షంగా లబ్ధి చేకూరుతుందని వివరించారు. క్వాంటం కంప్యూటింగ్ అనేది రెండో క్వాంటం విప్లవమని, ఈవీ బ్యాటరీల నుంచి ఆర్థిక వ్యవస్థ వరకు దీని ఉపయోగాలు విస్తృతంగా ఉంటాయని ఐబీఎం వైస్ ప్రెసిడెంట్ స్కాట్ క్రౌడర్ అన్నారు. తాజా ఒప్పందంతో అమరావతిలో క్వాంటం వ్యాలీ ఏర్పాటుకు తొలి అడుగు పడినట్టయ్యింది. క్వాంటం కంప్యూటింగ్ పరిశోధనలకు ఆంధ్రప్రదేశ్‌ను జాతీయ కేంద్రంగా మార్చడం ద్వారా పెద్దఎత్తున పెట్టుబడులను ఆకర్షించాలనేది రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నమన్నారు.

## కస్టడీకి రాజ్ కసిరెడ్డి

>> ఎసిపి ప్రత్యేక న్యాయస్థానం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న ఆయన్ను శుక్రవారం నుండి ఈ నెల 8వ తేదీ వరకు సిట్ కస్టడీకి అప్పగించింది. రోజూ ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 6గంటల మధ్య విచారించాలని పేర్కొంది. మద్యం సరఫరా కంపెనీలు,డిస్టిలరీల నుంచి కెసిరెడ్డి ప్రతి నెల రూ.50-60 కోట్ల మేర ముడుపులు వసూలు చేసి,ఆ సొమ్మంతా నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డికి చేర్చేవారని సిట్ దర్యాప్తులో గుర్తించింది.

## మీ సలహాలు ఆనందకర సేవలకు దోహదం

>> ఎంచుకోవాలి. సేవలకు సంబంధించి భక్తులు అభిప్రాయాలను ఉత్తమం/సగటు, మకరింత మెరుగుదల అవసరం లేదా బాగాలేదు అనే వాటిపై తమ రేట్‌చేయాల్సి ఉంటుంది. భక్తులు తమ అభిప్రాయాన్ని గరిష్టంగా 600 అక్షరాల పరిమితిలో టైప్‌చేయవచ్చు.వీడియోగా అప్‌లోడ్ చేయవచ్చు. అభిప్రాయం పూర్తిచేసిన వెంటనే "మీ అభిప్రాయం విజయవంతంగా నమోదు చేయబడింది,మీ విలువైన ఫీడ్‌బ్యాక్‌కు ధన్యవాదాలు"అనే ధృవీకరణ సందేశం ఆ మొబైల్‌నంబర్‌కు వస్తుంది. భక్తుల నుండి అందిన అభిప్రాయాలను టిటిడి యాజమాన్యం పరిగణనలోనికి తీసుకుని సేవల ప్రమాణాన్ని పెంచేందుకు తగిన చర్యలు తీసుకుంటుంది.

## కాందహార్ హైజాకర్ ఇంట్లో ఎన్ఐఎ సోదాలు

**శ్రీనగర్, మే 2:** పహల్గాం దాడి అనంతరం కశ్మీర్‌లో భద్రతా దళాలు గాలింపు చర్యలను మరింత వేగవంతం చేశాయి. ఐసీ 814 విమానాన్ని హైజాక్ చేసిన అల్ ఉమర్ ముజాహిద్దీన్ చీఫ్ ముష్తాక్ అహ్మద్ జర్గర్‌ను ఉగ్రవాదులు విడిపించారు. ఈనేపథ్యంలో అతని నివాసంలో శుక్రవారం భద్రతా దళాలు సోదాలు చేపట్టాయి. కీలక ఆధారాల కోసం ఈ సోదాలు చేపట్టారు. ఈ ఉగ్రదాడికి కర్మ, కర్త, క్రియ అంతా పాకిస్థానేనని ఇప్పటికే ఎన్ఐఏ తన ప్రాథమిక దర్యాప్తులో స్పష్టం చేసింది. ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబాతో పాక్ ఈ దాడి చేయించిందని పేర్కొంది. అదీకాక అల్ ఉమర్ ముజాహిద్దీన్ చీఫ్ ముష్తాక్ అహ్మద్ జర్గర్ ప్రస్తుతం పాకిస్థాన్‌లో ఉంటున్నాడు.అతడికి, ఈ దాడికి ఏమైనా సంబంధాలుండే అవకాశ ముందని ఎన్ఐఏ భావిస్తోంది. అందులోభాగంగా అతడి ఇంటిలో ఈ తనిఖీలు చేపట్టింది.

## ఎస్సీ హోదా కోల్పోతారు

>> ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన ఎ.రామిరెడ్డి మరో ఐదుగురిపై ఎస్సీ ఎస్టీ చట్టంతో పాటు ఐపీసీ సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణ గుంటూరు ఎస్సీ,ఎస్టీ కోర్టులో పెండింగ్‌లో ఉంది. కేసును కొట్టేయాలంటూ నిందితులు 2022లో హైకోర్టులో పిటీషన్ వేశారు. ఫఠిర్యాదులోనే పేర్కొన్నారు. తాజాగా జరిగిన విచారణలో పిటీషనర్ల తరపు న్యాయవాది జేవీ ఫణిదత్ వాదనలు వినిపించారు. ఫిర్యాదుదారు పదేళ్ళుగా ఫాస్టర్‌గా పనిచేస్తున్నారు. ఈ విషయాన్ని ఫిర్యాదులోనే పేర్కొన్నారు. క్రైస్తవంలోకి మారిన వ్యక్తికి ఎస్సీ,ఎస్టీ చట్టం వర్తించదు. రాజ్యాంగం(షెడ్యూల్డ్ కులాలు) ఆర్డర్-1950 ప్రకారం హిందూ మతాన్ని కాకుండా ఇతర మతాలను స్వీకరించిన వారిని ఎస్సీ,ఎస్టీ చట్టం క్రింద రక్షణ ఉండదని సుప్రీం కోర్టు తీర్పులు ఇచ్చింది. వీటిని పరిగణలోకి తీసుకొని కేసును కొట్టేయండి అని కోరారు. పాస్టర్ ఆనంద్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఫిర్యాదిదారుడు ఎస్సీ అని తహశీల్దార ధృవపత్రం ఇచ్చారని గుర్తు చేశారు. పిటీషనర్ల తరపు న్యాయవాది వాదనలతో ఏకీభవించిన న్యాయమూర్తి ఎస్సీ,ఎస్టీ చట్టం క్ర ఇంద ఫిర్యాదుదారుడు రక్షణ పొందలేదని నిందితులపై ఐపీసీ కింద నమోదు చేసి సెక్షన్లు చెల్లుబాటు కావని తీర్పులో పేర్కొన్నారు.

### వారం - వర్జ్యం

తేది : 03-05-2025, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
వైశాఖ మాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, శుక్ల పక్షం
షష్ఠి ఉ.7.54
పునర్వసు మ.12.39
వర్జ్యం రా.8.45-10.22
దు.ఠె.5.42-ఉ.7.21
రాహుకాలం - ఉ.9.00-10.30

### వార్తాఫలం

**మేషం :** దూరప్రాంతాల నుండి వచ్చిన సమాచారం సంతోషం కలి గిస్తుంది. ఆకస్మిక ధన, వస్తు, లాభాలు పొందుతారు.

**వృషభం :** వ్యవహారాలు విజయవంతంగా పూర్తిచేస్తారు. చిన్ననాటి మిత్రులను కలుసుకుంటారు.

**మిథునం:** వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగాలలో మరింత ప్రోత్సాహం పొందుతారు.

**కర్కాటకం:** బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. ఆలయాలు సందర్శిస్తారు.

**సింహం:** పనులలో జాప్యం జరిగినా నిదానంగా పూర్తి చేస్తారు. ఆకస్మిక ప్రయాణాలలో నూతన పరిచయాలు.

**కన్య :** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. వృత్తి, వ్యాపారాలలో తొందరపాటు వద్దు..

**తుల :** ఉద్యోగాలలో గందరగోళంగా ఉంటాయి. బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు.

**వృశ్చికం:** ఆర్థిక ఇబ్బందులు తొలుగుతాయి. చిన్ననాటి మిత్రుల నుండి ఆహ్వానాలు అందుకుంటారు.

**ధనుస్సు:** వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగాలలో పదోన్నతులు పొందుతారు.

**మకరం:** వ్యవహారాలలో స్వల్ప అవాంతరాలు ఏర్పడిన అధిగమించి ముందుకు సాగుతారు. వస్తుకొనుగోలు.

**కుంభం:** అనుకోని ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి. ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి.

**మీనం :** బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. ఉద్యోగాలలో చిన్న చికాకులు తప్పవు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# కర్నూలు - గుంటూరు హైవేపై రోడ్డు ప్రమాదం

## శ్రీశైలం నుంచి ఆదోని వెళ్తూ చెట్టును ఢీకొన్న బొలెరో వాహనం - నలుగురు వ్యక్తులు మృతి!

### గాయపడిన క్షత్రగాత్రులను ఆత్మకూరు వైద్యశాలకు తరలించిన పోలీసులు

**ఆత్మకూరు,మే02,ప్రభాతవార్త:** కుటుంబంతో కలసి శ్రీశైలం పుణ్యక్షేత్రంలో వెలసిన మల్లికార్జున బ్రహ్మారాంభిక స్వామి ఆశీస్సుల కోసం ఆదోని పట్టణం నుంచి గురువారం శ్రీశైలానికి బయలు దేరి వెళ్లారు. దర్శనం చేసుకోని తిరుగు ప్రయాణంలో శుక్రవారం నంద్యాల జిల్లా శ్రీశైలం నియోజకవర్గం ఆత్మకూరు మండల పరిధిలోని సిద్దాపురం చెరువు కట్ట సమీపంలోని కర్నూలు - గుంటూరు జాతీయ రహదారిపై ఘోరా రోడ్డు ప్రమాదం జరిగిన సంఘటన చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న సిఐ రాము, ఎస్ఐ వెంకటనారాయణరెడ్డి సంఘటన స్థలానికి చేరుకోని క్షతగాత్రులను వెంటనే 108 వాహనంలో ప్రవేట్ వాహనాలలో ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడిక్కడే నలుగురు మృతి చెందారు. మృతులలో చంద్రమ్మ (35) శశికళ(40), గిడ్డయ్య(42), లక్ష్మి(28)లు మృతి చెందారు. రామాంజి అనే వ్యక్తి పరిస్థితి తీవ్రమైన గాయాలు కావడంతో కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు మెరుగైన చికిత్స కోసం తరలించారు. చిన్నపిల్లలు, వృద్దులు, మహిళలు, పెద్దలు అందరికి తలకు, మోచేతులకు, కాళ్ళకు, మెడ, వీపుపై బలమైన గాయాలు కావడం జరిగింది. చికిత్స తీసుకుంటునగానే మరోకరు మృతి చెందారు. 16మందికి పైగా క్షతగాత్రులు తీవ్రమైన గాయాలు, రక్తం అధికంగా పోవడంతో మెరుగైన వైద్యసేవలు అందించడం జరుగుతుంది. నల్లమల అటవీ ప్రాంతంలోని ఘాట్ రోడ్డులో తీవ్రమైన ఘోర రోడ్డు ప్రమాదం జరగడం ఇదే మొదటి సారి. ఉరుములు, మెరుపులతో గాలివాన భీభత్సవం రావడంతో స్పీడ్‌గా వస్తున్న బొలెరా వాహనం ఆకస్మికంగా అతి వేగంతో వెళ్లి చెట్టుకు డీకొన్నడంతో బొలెరో వాహనంలో ఉన్న కుటుంబ సభ్యులు అందరు వాహనం తిరిగి పడడంతో నలుగురు ప్రాణాలు అక్కడే పోయాయి. వాహనదారులు ప్రాణాంతకమైన మలుపులను దృష్టిలో ఉంచుకోని నల్లమల అటవీ ప్రాంతంలో ప్రయాణం నెమ్మదిగా కొనసాగించాలని పోలీసులు వాహనదారులకు సూచిస్తున్నారు. కర్నూలు - గుంటూరు జాతీయ రహదారిపై జరిగిన ఈ ఘోరా రోడ్డు ప్రమాదంలో పోయిన ప్రాణాలు తిరగి రావని కుటుంబం అంతా కలసికట్టుగా దైవ దర్శనంకు వెళ్లి కొందరు తిరిగిరాని లోకంకు వెళ్లడం వంటి సంఘటనలు ఎదురవుతే ఆ కుటుంబం అంతా కన్నీమునీరు కావాల్సిందేనని పోలీసులు తెలిపారు. రోడ్డు ప్రమాదంపై ఎంఎల్‌ఏ బుడ్డా రాజశేఖరరెడ్డి దిగ్భ్రాంతి... మండల పరిధిలని ఎస్‌ఎన్‌తాండ - బైర్లూటి మద్యలో గల సిద్దాపురం చెరువు సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదం ఘటనపై శ్రీశైలం ఎంఎల్‌ఏ బుడ్డా రాజశేఖరరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ఆదోనికి చెందిన భక్తులు శ్రీశైలం వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ఘటన జరగడం మరవలేనిది అన్నారు. నలుగురు మృతి చెందడంతో మరో 14మంది గాయాపడడం పట్ల విచారణ తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులు తెలిపారు. ప్రమాద బాదితులను ఆదుకుంటామని ఎంఎల్‌ఏ బుడ్డా రాజశేఖరరెడ్డి తెలియజేశారు.



గుంటూరు-గుంతకల్లు డబ్లింగ్ రైలు మార్గంలో తాజాగా అందుబాటులో వచ్చిన పాణ్యం-బుగ్గానిపల్లె డబ్లింగ్ రైలు మార్గం

## సీమలో రూ.477 కోట్లతో రైల్వే ప్రాజెక్టులు

**గుంతకల్లు రైల్వే,మే 2,ప్రభాతవార్త** రాష్ట్రంలో రూ.477కోట్ల వ్యయంతో భారీ రైల్వే ప్రాజెక్టులకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ పచ్చజెండా ఊపారు. వీటిలో ఒకటి ప్రారంభోత్సవం కాగా, మరొకటి శంకుస్థాపనలు,రాయలసీమలోని పడమటి గుంతకల్లు నుంచి మల్లప్ప గేట్ వరకు రూ.293కోట్ల అంచనా వ్యయంతో కొత్తగా నిర్మించనున్న 10కి.మీల రైలు ఓవర్ రైలు(ఆర్ఓఆర్) నూతన రైలు మార్గాన్ని ప్రధాని మోడీ శంకుస్థాపన చేశారు. అలాగే గుంటూరు-గుంతకల్లు డబ్లింగ్ రైలు మార్గంలో భాగంగా పాణ్యం-క్రిష్ణమ్మ కోన-బుగ్గానిపల్లె సిమెంట్ నగర్‌ల మద్య రూ.184కోట్ల వ్యయంతో పూర్తి చేసిన 19కి.మీ డబ్లింగ్ రైలు మార్గాన్ని ప్రధాని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్,సిఎం చంద్రబాబు,డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపిలు,ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి, గన్నవరం నుండి గరివిడికి 18 మంది ప్రొఫెసర్లు బదలీ

**గరివిడి ( విజయనగరం జిల్లా ) మే,2 ప్రభాతవార్త:** వాత్త నెలలో వి సి ఐ ఇన్స్ పెక్షన్ జరగనుండటం తో గరివిడి పశు వైద్య కళాశాలకు తిరుపతి, గన్నవరం పశు వైద్య కళాశాలల నుండి 18 మంది ప్రొఫెసర్ లను హడావిడిగా బదిలీ చేశారు. ఈ నెల రెండోవారం,లేదా మూడో వారం లో గరివిడి పశు వైద్య కళాశాల ను పరిశీలించేందుకు న్యూ ఢిల్లీ కి చెందిన వేటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా బృందం రానున్న నేపథ్యంలో తిరుపతి, గన్నవరం నుండి ఇక్కడి కి 18 మంది ప్రొఫెసర్ లను తిరుపతి శ్రీ వెంకటేశ్వర పశు విశ్వవిద్యాలయం డీన్ డాక్టర్ వీర బ్రహ్మయ్య శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతం లో విసిఐ ఇన్స్ పెక్షన్ సమయంలో హడావిడి గా తిరుపతి, గన్నవరం నుండి గరివిడి పశువైద్య కళాశాలకు డెప్యుటేషన్ పై గరివిడి పశు వైద్య కళాశాల కు చెందిన 20 మంది ప్రొఫెసర్ లనుబదిలీ చేసిన అధికారులు మళ్ళీ అదే బృందం పరిశీలనకు రానుండటంతో మళ్ళీ బదిలీ ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాగా గతంలో వి సి ఐ పరిశీలన అనంతరం వెంటనే అదే ప్రొఫెసర్లు ని గరివిడి నుండి డెప్యూటేషన్ పై తిరుపతి, గన్నవరం కళాశాలకు బదిలీ చేశారు. కాగా 18 మంది ప్రొఫెసర్లలో విశాఖపట్నం, వెన్నెల వలస,వెంకట మంగన్న గూడెం,రామచంద్రాపురం ,విశాఖపట్నం లో గల కళాశాలల నుండి 6 గురు ఆచార్యులు ఉన్నారు.వి సి ఐ పరిశీలన కే ఆచార్యులను పరిమితం చేయడం వలన ఇక్కడ విద్యార్థులు కి విద్యా బోధనలో ఇబ్బంది కర పరిస్థితులు ఉత్పన్నమవు తున్నాయి. శాశ్వత పరిష్కారం లభించక పోవడం వలన ఇక్కడ విద్యార్థులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితులు ఉన్నాయి. యూనివర్సిటీ ఉన్నతాధికారులు, పాలకులు గరివిడి పశువైద్య కళాశాలలో బోధకులు పై దృష్టి పెట్టి శాశ్వతంగా కొనసాగేందుకు తగిన ఆదేశాలు జారీచేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.ఆ దిశ గా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని విద్యార్థులు ఆశిస్తూ ఉన్నారు.

## మోడీని ఆశ్చర్యానికి గురిచేసిన డిప్యూటీ సిఎం పవన్

**విజయవాడ,మే2,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతి మహా నగర నిర్మాణ పనుల ప్రారంభానికి వచ్చిన ప్రధాని నరేంద్రదామోదరదాస్ మోడీని ఆచ్చెరువుకు గురి చేసారు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్,ఈ సభలో ప్రారంభ ఉపన్యాసం చేసిన పురపాలక శాఖా మంత్రి పొంగూరు నారాయణ తరువాత కీలక ప్రసంగాన్ని మానవ వనరుల శాఖా మంత్రి ప్రధాని ప్రస్తావన వచ్చినప్పుడల్లా " నమో" అంటూ మాట్లాడారు.ఆయన నరేంద్ర మోడీ పేరును పొట్టిపేరుగా చేసి మాట్లాడి తన ఉపన్యాసాన్ని రక్తి కట్టిస్తే,పెద్దగా వెలుగులోకి రాని ప్రధాని మరో పేరును పవన్ వెల్లడించారు.ప్రతి అంశాన్ని క్షుణంగా అధ్యయనం చేసే అలవాటున్న పవన్ మోడీ రాజకీయాల్లో క్రియాశీలక కాక ముందు ఆయన కొంత కాలం హిమాలయాల్లో సన్యాస (ఏకాంత)జీవనం గడిపిన విషయాన్ని ప్రస్తావించారు.అప్పట్లో ఆయనను మిత్రులు ' అనివాస్" అని ముచ్చటగా పిలిచే వారు, ఎందుకంటే ఆయనకు సొంత ఇళ్ళు ఉండేది కాదు.తరువాత ఆయన మళ్ళీ ఆర్ఎస్ఎస్‌లో కీలకం కావడం అటునుంచి రాజకీయాల్లో రావడం,ఎంఎల్ఏ కాకుండా నేరుగా గుజరాత్ ముఖ్యమంత్రి అయ్యారు.అనంతర పరిణామాల్లో ప్రధాని అయ్యారు.అనివాస్‌గా మోడీకి ఇళ్ళు లేక పోతే కలిగే ఇబ్బంది తెలుసునని అందుకే దేశవ్యాప్తంగా లక్షల్లో ఇళ్ళు ఇస్తున్నారని పవన్ ప్రస్తావించారు.

# జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

## - లారీ ఢీకొని మోటార్ సైకిలిస్ట్ మృతి



మృతుని ఫైల్‌ఫొటో

**కోవూరు,(నెల్లూరు) మే 2 ప్రభాతవార్త :** కోవూరులోని జాతీయ రహదారి సాయిబాబా గుడి సమీపంలో శుక్రవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. నెల్లూరు నుంచి కావలి వైపు వెళ్తున్న ఓ లారీ అదే మార్గంలో మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తున్న కాకుమూడి వెంకటరమణయ్యను వేగంగా ఢీకొంది. ఈ సంఘటనలో తీగ్రాయాలపాలైన రమణయ్య అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న కోవూరు హెడ్ కానిస్టేబుల్ రషీద్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వెంకటరమణయ్య బోర్లు వేసే పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. నెల్లూరుకు వెళ్లి తిరిగి మానేగుంటపాడుకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కొడవలూరు మండలం మానేగుంటపాడు గ్రామం, దళితవాడకు చెందిన కాకుమూడి వెంకటరమణయ్య బోరు పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు, ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ అక్కడికక్కడే లారీని వదిలేసి పరారీ అయ్యాడు. ఈ మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఉదయం టిఫిన్ చేసి ఇంటి నుంచి బయలుదేరిన భర్త కాసేపటికే మృతి చెందడం పట్ల ఆ కుటుంబంలో తీరని విషాదం చోటు చేసుకుంది. ఆస్పత్రి వద్ద వారు పెట్టే రోధనలు చుట్టుపక్కల వారిని కలిచివేశాయి.

# కరువు నేలలో కృషి చేసిన ఇద్దరు విశిష్ట వ్యక్తులు

## - ఒకరు విన్సెంట్ ఫెర్రర్.. మరొకరు పుట్టపర్తి సత్య సాయిబాబా

**అనంతపురం, మే 2 ప్రభాతవార్త బ్యూరో :** కరువు నేల ఉమ్మడి అనంతపురం జిల్లాలో పేద, మధ్యతరగతి వర్గాలకు అండగా నిలబడి ఎన్నో అభివృద్ధి, సంక్షేమ, సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజల హృదయాల్లో నిలిచిపోయారు ఇద్దరు. వారిద్దరిని దేవుళ్ళుగా ప్రజలు కొలుచుకుంటున్నారు. గుడిలో దేవుడి కంటే ఎప్పుడూ మన మధ్య ఉంటూ మనకోసం విదేశాల్లో విరాళాలు తీసుకొచ్చి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశారు. వాళ్ళిద్దరూ ప్రస్తుతం మన మధ్య లేకపోయినా వారు బతికున్నప్పుడు చేసిన అభివృద్ధి, సేవ కార్యక్రమాలు సంస్థల రూపంలో ఇప్పటికీ కొనసాగుతున్నాయి. ఆ ఇద్దరు దేవుళ్ళు ఎవరో కాదు ఒకరు భగవాన్ సత్యసాయి బాబా అయితే మరొకరు ఆర్డిటి వ్యవస్థాపకులు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్. స్పెయిన్ దేశంలో పుట్టి ఏదో సేవ చేయాలని ఒక లక్ష్యంతో ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ ఇండియాకు వచ్చి వెనుకబడిన అనంతపురం జిల్లాలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ, సేవ కార్యక్రమాలు చేసి చరిత్ర సృష్టించారు. మన భారతదేశ ప్రభుత్వం అందించే అత్యుత్తమ పురస్కారం భారతరత్న. ఇలాంటి పురస్కారాన్ని ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్‌కు చెందిన ఆర్డిటికి అందించిందంటే ఆ సంస్థకు ఎంత పేరు వచ్చిందో అర్థం చేసుకోవచ్చు. ఆర్‌డిటి సంస్థను అనంతపురంతోపాటు తెలుగు రాష్ట్రాలకు విస్తరింపచేసిన ఆర్డిటి వ్యవస్థాపకుడు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ 2009 జూన్ 19వ తేదీన చనిపోయారు. ఆయన మరణానంతరం కూడా ఒక సంస్థలా ముందుకు వెళ్తోంది. మిన్సెంట్ ఫెర్రర్ సతీమణి అన్నే ఫెర్రర్, ఆయన కుమారుడు మాంచో ఫెర్రర్ ఇతర డైరెక్టర్లు, సిబ్బంది ఆర్‌డిటి లక్ష్యాలను ముందుకు తీసుకెళ్తున్నారు. అదేవిధంగా భగవాన్ సత్యసాయిబాబా అనంతపురం జిల్లా పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయాన్ని ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దారు. అన్ని కులాలు, అన్ని మతాలు ఒక్కటే అని చాటి చెప్పడంతోపాటు నైతిక, ఆధ్యాత్మిక విలువలు పెంపొందించేందుకు భగవాన్ సత్యసాయిబాబా చేసిన సేవలు ఎన్నో ఉన్నాయి. దేశ, విదేశాల్లోని ఎందరో భక్తులు, సంస్థలు ఇచ్చిన కోట్లాది రూపాయల విరాళాలతో శ్రీసత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ ద్వారా విద్య, వైద్య, ఇతర సేవా కార్యక్రమాలను చేపట్టారు. సాగునీళ్ళు దేవుడెరుగు గుక్కెడు మంచినీటి కోసం కూడా ప్రజలు తహతహలాడుతున్న ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజల దాహార్తిని తీర్చేందుకు వందల కోట్ల రూపాయలతో శ్రీసత్యసాయి మంచినీటి పథకాన్ని చేపట్టి అమలు చేసి ప్రజల హృదయాల్లో నిలిచిపోయారు. ఆయన ఉన్నా లేకపోయినా శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ద్వారా విద్య, వైద్య రంగాల్లోను, ఇతర సేవా కార్యక్రమాలు కొనసాగే విధంగా భగవాన్ సత్య సాయి బాబా అన్ని వనరులు పకడ్బందీగా సమకూర్చారు. 2011 సంవత్సరం ఏప్రిల్ 24వ తేదీన సత్యసాయిబాబా మన నుంచి దూరమయ్యారు. సత్యసాయిబాబా సేవలు, ఆధ్యాత్మిక, నైతిక విలువలు పెంపొందించే బోధనలు, సేవలు చూసే విదేశాల నుంచి భక్తులు, వివిధ సంస్థల ప్రతినిధులు ఇక్కడికి వచ్చి చూసిన తర్వాతే అంతర్గతంగా విరాళాలు ఇచ్చేవారు అని చెబుతుంటారు. అయితే ఆ విరాళాల గురించి శ్రీ సత్యసాయి సెంటర్ ట్రస్ట్ ఎంత గోప్యత పాటించేవారు.. ఏడాదికి ఒక సారి సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ బడ్జెట్ ప్రవేశపెట్టి అభివృద్ధి కార్యక్రమాలను ఖర్చులు, నిధులు వివరాలను బహిర్గతం చేస్తూ వస్తున్నారు. అదేవిధంగా విన్సెంట్ ఫెర్రర్, ఇతర ఆర్‌డిటి సంస్థ ప్రతినిధులు అనంతపురం జిల్లా కరువు పరిస్థితులను, పేదరికాన్ని, వెనుకబడి తనాన్ని, ఇతర పరిస్థితులను నివేదికల ద్వారా విదేశీ సంస్థలకు, దాతలకు పంపుతూ వచ్చారు. ఆ మేరకు స్పెయిన్ తదితర దేశాల నుంచి ఇక్కడ పరిస్థితులు చూసేందుకు తరచూ వచ్చేవారు. వాళ్లు ఇక్కడ పరిస్థితులను కల్లారా చూసి నివేదికరిస్తూ వచ్చారు. అలాంటి విదేశ ప్రతినిధులకు అర్థమయ్యే విధంగా పరిస్థితులను వివరించేందుకు స్పెయిన్ భాషను మనవాళ్లకు నేర్పించే కోర్సులు కూడా ప్రవేశపెట్టారన్నారు. ఆ విధంగా ఆర్డీటి సంస్థ ఎంతో కృషి చేసి విదేశీ నిధులు ప్రతియేటా వచ్చే విధంగా దారులు కల్పించింది. అయితే గత రెండేళ్ల నుంచి విదేశాల నుంచి ఆర్‌డిటికి నిధులు రావడం కష్టంగా మారింది. ఎఫ్‌సిఆర్‌ఏ కింద విదేశీ నిధులు విరాళాలు వచ్చే ప్రక్రియకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిలుపుదల చేసింది. ఈ విషయంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు, ప్రజా సంఘాలు, ప్రజలు ఆర్డిటికీ అండగా నిలబడ్డారు. ఈ విషయంలో బిజెపికి చెందిన రాష్ట్ర మంత్రి సత్య కుమార్ చొరవ తీసుకొని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాను కలిసి పరిస్థితి గురించి ఆర్డిటిని ప్రత్యేక దృష్టితో చూసి ఆదుకోవాలని విన్నవించారు.

# శేషాచలం అడవిలో చెలరేగిన మంటలు !

## - ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాలతో కదిలిన రెండుజిల్లాల అధికారులు

### - మధ్యాహ్నానికి అదుపుచేసిన అటవీశాఖ

**తిరుమల,మే 2 ప్రభాతవార్తప్రతినిధి:** శేషాచలం కొండలు విస్తరించిన చిత్తూరు,కడపజిల్లాల పరిధిలోని అన్నమయ్య జిల్లా బాలపల్లిఅటవీ రేంజ్‌పరిధిలోని ఓ గ్రామంలోచెలరేగిన మంటలు తిరుమల తుంబురుతీర్థం, పాపవినాశనమ్ అడవికి వ్యాపించాయి. గురువారం సాయంత్రం ఈ మంటలు తుంబురుతీర్థం వద్ద పెద్ద ఎత్తున చెలరేగడంతో దట్టమైన పొగఅలముకుంది. అదే సమయంలో చిరుజల్లులు కురవడంతో మంటలు ఆరిపోయాయి. అయితే రాత్రి మళ్ళీ పాపవినాశనమ్ ప్రాంతంలో మంటలు రేగడంతో అటవీశాఖ ,టిటిడివిజిలెన్స్ సిబ్బంది,అగ్నిమాపకసిబ్బంది చీకట్లోనే అడవిలోకి చేరుకున్నారు. మంటలను అదుపుచేయడంలో గంటలతరబడి శ్రమించారు. అయితే మంటలు అదుపులోకి రాలేదు. అర్థరాత్రి ఈ మంటలు కుమారధార, వసువుధారప్రాజెక్టులున్న అటవీప్రాంతం వైపు మళ్ళాయి. విషయం తెలుసుకున్న అటవీశాఖమంత్రి, ఉపముఖ్య మంత్రి పవన్‌కల్యాణ్ స్వయంగా టిటిడి డిఎఫ్ఒ వివేక్‌కు ఫోన్‌చేసి మంటలను పూర్తిగా అదుపుచేయాలని, వన్యప్రాణులకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు. దీంతో తిరుపతి జిల్లాలోని అటవీశాఖ సిబ్బంది. అన్నమయ్యజిల్లా,చిత్తూరుజిల్లాలోని అటవీశాఖ, అగ్నిమాపక సిబ్బంది రెండువందలమంది వరకు తిరుమల శేషాచలంలోని తుంబురు తీర్థం, పాపవినాశనమ్ అడవిలోకి చేరుకున్నారు. పూర్తిగా పచ్చనిచెట్ల కొమ్మలు, ఈతమండలతో మంటలను అదుపుచేశారు. అప్పటికీ అడవంతా దట్టమైన పొగ అలము కుంది. శుక్రవారం మధ్యాహ్నానికి అడవిలో మంట లను అదుపుచేశారు. కొండల్లో లోయలతో కూడిన దట్టమైన అటవీ ప్రాంతం కావడంతో అగ్నిమాపక వాహనాలు కూడా చేరుకోలేని పరిస్థితి. టిటిడి అటవీశాఖ అధికారి వివేక్, అన్నమయ్యజిల్లా సబ్ డిఎఫ్ఒ సుబ్బరాజు ఆధ్వర్యంలో స్వయంగా రేంజ్ అధికారులు, సిబ్బంది,అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపుచేశారు. ఎండ తీవ్రంగా ఉండటం, ఎండిన ఆకులు, కొమ్మల కారణంగా మంటలు ఎగసిపడ్డాయి. ఇదిలా ఉండగా 2014 మార్చిలోనూ ఇదే తరహాలో తిరుమల అడవిలో కాకులకొండ, మామండూరు ప్రాంతాల్లో కార్చిచ్చు రగిలి వేలాది ఎకరాలు



అటవీప్రాంతం దగ్ధమవడం, ఏకంగా పదిరోజులు ఈ మంటలను అదుపుచేయలేక చివరకు హెలికాప్టర్లద్వారా నీటిని స్ప్రేచేసి మంటలు అదుపులోకి తీసుకువచ్చిన విషయం విదితమే.

టిటిడి అటవీపరిధిలో ఫైర్‌వాల్స్ పునరుద్దరణ జరగాలని, ప్రమాదవశాత్తు మంటలు వ్యాపిస్తే వేగంగా వ్యాప్తికాకుండా మరిన్ని చర్యలు తీసుకోవాలని అటవీశాఖ వన్యప్రేమికులు కోరుతున్నారు.

# మూడు కొత్త కార్యక్రమాలు చేపట్టిన ఎన్నికల సంఘం

## - రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వివేక్ యాదవ్

**విజయవాడ,మే2,ప్రభాతవార్తప్రతినిధి:** ఓటర్ల జాబితాల ఖచ్చితత్వాన్ని మరింతగా మెరుగుపరచడం, ఓటువేసే ప్రక్రియను పౌరులకు మరింత సులభతరం చేసే ఉద్దేశంతో భారత ఎన్నికల సంఘం మూడు కొత్త కార్యక్రమాలకు నాంది పలికినట్లు రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ వెల్లడించారు. ఎన్నికల కమిషనర్‌లు డా.సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషిల సమక్షంలో రాష్ట్రాల ముఖ్య ఎన్నికల అధికారులతో ఈ ఏడాది మార్చి నెలలో నిర్వహించిన సమావేశంలో భారత ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ఈ కొత్త కార్యక్రమాలను గురించి ప్రకటించినట్లు తెలిపారు. దీనిప్రకారం జనన మరణాల రిజిస్ట్రార్ జనరల్ నుంచి నమోదైన మరణాలకు సంబంధించిన మరణ ధృవీకరణ ఎలక్ట్రానిక్ పద్ధతిలో డేటాను ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు ఎప్పటికప్పుడు తీసుకొనే అవకాశం ఏర్పడుతుందన్నారు. ఫారం7లో దరఖాస్తు అందనప్పటికీ బూత్ స్థాయి అధికారులు(బి.ఎల్.ఓ)లు ఈ జాబితా ఆధారంగా క్షేత్రస్థాయిలో పర్యటించి తనిఖీచేసి ఓటర్ల సమాచారాన్ని ధృవీకరిం చడానికి అవకాశం కలుగుతుం దన్నారు. ఓటరు సమాచార స్లిప్(వి.ఐ.ఎస్) లను ఓటర్ల స్నేహపూర్వకంగా రూపొందిం చడంలో భాగంగా దీని డిజైన్‌ను మార్చాలని భారత ఎన్నికల సంఘం నిర్ణయించింది. దీనిప్రకారం క్రమ సంఖ్య, ఓటరు పార్ట్ నెంబరు పెద్దగా, ప్రముఖంగా కనిపించేలా దీనిని డిజైన్ చేశారు. తద్వారా ఓటర్లు తమ పోలింగ్ కేంద్రాన్ని సులభంగా గుర్తించేందుకు వీలు కావడంతోపాటు ఓటర్ల జాబితాలో ఓటర్ల పేర్లను త్వరగా గుర్తించేందుకు అవకాశం కలుగుతుంది. ఓటర్ల ధృవీకరణ, ఓటర్ల నమోదు, ఇతర ఎన్నికల సంబంధిత ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టే సమయంలో బి.ఎల్.ఓ.లను ఓటర్లు సులభంగా గుర్తిం చేందుకు వీలుగా ఇ.ఆర్.ఓ.ల ద్వారా నియమితులైన బూత్ స్థాయి అధికారులకు ఇకపై ప్రామాణిక ఫోటో గుర్తింపు కార్డులను అందజేయాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. తద్వారా ఓటర్ల నమోదు, జాబితాల తనిఖీ వంటి కార్యక్రమాల సందర్భంగా బి.ఎల్.ఓ.లను గుర్తించి, వారితో ఓటర్లు నమ్మకంగా వారి సమచారాన్ని పంచుకొనేందుకు అవకాశం కలుగుతుంది. ఎన్నికల సంబంధ విధులకు సంబంధించి భారత ఎన్నికల సంఘం, ఓటర్ల మధ్య బి.ఎల్.ఓ.లు మొదటి స్థాయి అనుసంధాన వ్యవస్థగా వున్న నేపథ్యంలో ఇంటింటి సందర్శనలకు వెళ్లేటపుడు ప్రజలు వారిని సులువుగా గుర్తించేలా వుండాలన్నారు.

# రాష్ట్రాభివృద్ధికి కేంద్రం భారీ నిధులు

## - కేంద్ర భారీ పరిశ్రమలు స్టీల్ శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ..

**విజయవాడ మే 2,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర రాజధాని అమరావతితో పాటు రాష్ట్రాభివృద్ధికి, మోలికి వసతుల కల్పనకు పెద్ద ఎత్తున నిధులు, ప్రాజక్టులను కేటాయిస్తున్న దేశ ప్రధాని శ్రీ నరేంద్ర మోదీకి కేంద్ర భారీ పరిశ్రమలు స్టీల్ శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ ధన్యవాదమలు తెలిపారు. శుక్రవారం రాష్ట్ర రాజధాని అమరావతిలో నిర్వహించిన అభివృద్ధి పనుల పున: ప్రారంభ సభలో ఆయన మాట్లాడుతూ అమరావతిలో రూ.58 వేల కోట్లు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టేందుకు వచ్చిన దేశ ప్రధాని శ్రీ నరేంద్ర మెదీకి ధన్యవాదములు తెలిపారు. రాజధాని నిర్మాణానికి కేంద్రం పెద్ద ఎత్తున నిధులు ఇస్తోంన్నారు. రాష్ట్రంలో రైల్వే రంగంలో రూ.74 వేల కోట్లు పెట్టు బడులు పెట్టడం జరిగిందన్నారు. అమరావతి ని దేశంలోని ప్రధాన నగరాలకు అనుసంధానం చేసేందుకు దాదాపు రూ.2,245 కోట్లతో నూతన రైల్వే లైను నిర్మాణం మరియు విశాఖ రైల్వేజోన్ నిర్మాణం కేంద్ర సహాకారంతోనే సాధ్యమైందన్నారు. పోలవరం ప్రాజక్టుకు రూ.12,500 కోట్లు, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ కు రూ.11,500 కోట్ల మేర ఆర్థిక సహాయాన్ని అందించడమే కాకుండా పూడి మడకలో రూ.1 లక్షా 85 వేల కోట్లుతో గ్రీన్ హైడ్రోజన్ కేంద్రం, నక్కపల్లిలో బల్కు డ్రగ్ కేంద్రం ఏర్పాటతో పాటు కృష్ణపట్నాన్ని రూ.4,500 కోట్లతో పారిశ్రామికి కేంద్రంగా తీర్చిదిద్దే పనులు కేంద్ర సహాకారం వల్లే సాధ్యమైందన్నారు. రూ.2,800 కోట్లతో ఓర్వకల్లును, రూ.2,200 కోట్లతో కొప్పర్తిని పారిశ్రామిక కేంద్రాలిగా తీర్చిదిద్దేందుకు నిధులను మంజూరు చేయడం జరిగిందన్నారు. లక్షలాధి మంది యువతకు ఉద్యోగ అవకాశలు కల్పించే విధంగా రామాయపట్నంలో రూ.95 వేల కోట్లతో తీశిదిలి రిఫైనరీని ఏర్పాటు చేయడం జరుగుచున్నది. జాతీయ రహదారులకు వేల కోట్ల నిధులు ఖర్చు పెట్టడం జరుగుచున్నదని, నర్సాపురం నియోజకవర్గంలో గత 20 సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న బీమవరం బైపాస్ రోడ్డు నిర్మాణానికి రూ.2,400 కోట్లు నిధులను మంజూరు చేయడం జరిగిందన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
జలవనరుల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు
నెం.01/2025-26 తేది: 30.04.2025
కార్యనిర్వాహక ఇంజనీరు, డ్రైనేజ్ డివిజన్, భీమవరం పరిధిలో 1 పనిని చేయుటకుగాను రూ.9.00 లక్షలకు టెండర్లు ఆహ్వానించడమైనది. టెండర్లు తీసుకొను ఆఖరి తేది: 19.05.2025, మ.3.00గం.ల వరకు. తదుపరి సమాచారం కొరకు www.apeprocurement.gov.in సందర్శించగలరు.
సం/-, కార్యనిర్వాహక ఇంజనీరు, డ్రైనేజ్ డివిజన్, భీమవరం.
DIPR.NO. 16275/CL/ADVT/1/1/2022-23 తేది: 02.05.2025

GOVERNMENT OF INDIA : MINISTRY OF DEFENCE
EX-SERVICEMEN CONTRIBUTORY HEALTH SCHEME,
STATION HQ (ECHS CELL), SECUNDERABAD
Ph.: 7382361574 | E-mail : echsstnhqsecbad@gmail.com

EMPLOYMENT NOTICE

1. ECHS CELL, Headquarters Telangana and Andhra Sub Area invites applications to engage Medical, Para-Medical & Non-Medical Staff on contractual basis for a period of 12 Months for ESMs and Widows of Service Personnel and 11 Months for Civilian candidates at given locations of ECHS Polyclinics in Telangana and Andhra Pradesh.

| Appointment | Minimum Qualification | Salary (Rs) | Vacancies | Location of Vacancies (ECHS Polyclinics) |
|---|---|---|---|---|
| OIC Polyclinic | Graduate (Retired Defence Officers Drawing Pension from CDA) | 75,000/- | 02 | Eluru & Secunderabad-II |
| Medical Specialist | MD/MS in General Medicine | 1,00,000/- | 04 | Chittoor, Gidaluru, Gunturu & Secunderabad-I |
| Medical Officer | MBBS | 75,000/- | 07 | Chittoor, Eluru, Gunturu, Karimnagar, Secunderabad-I, Secunderabad-II & Vijayawada |
| Dental Officer | BDS | 75,000/- | 03 | Giddalur, Kadapa & Secunderabad-II |
| Dental Hygienist | Diploma in Dental Hyg/Class-I DH/DORA Course (Armed Forces) | 28,100/- | 12 | Anantapur, Eluru, Giddaluru, Golconda, Guntur, Kadapa, Khammam, Kurnool, Nellore, Secunderabad-I, Secunderabad-II & Sainikpuri |
| Pharmacist | B Pharmacy OR 10+2 with Science and Diploma in Pharmacy | 28,100/- | 03 | Eluru, Giddalur & Kurnool |
| Lab Technician | B Sc (Medical Lab Tech (MLT) OR 10+2 with Science and Diploma in Medical Lab Tech (DMLT) | 28,100/- | 07 | Chittoor, Eluru, Giddalur, Kadapa, Kurnool, Khammam & Nellore |
| Lab Assistant | DMLT/Class-I Lab Tech Course (Armed Forces) | 28,100/- | 03 | Giddalur, Secunderabad-I & Sainikpuri |
| Nursing Assistant | BSc Nursing, GNM/ Diploma/Class-I Nursing Assistant Course Cert from (Armed Forces) | 28,100/- | 01 | Nellore |
| Female Attendant | Literate | 16,800/- | 02 | Golconda & Secunderabad-II |
| Chowkidar | 8th Class or GD Trade for Armed Forces personnel | 16,800/- | 06 | Chittoor, Secunderabad-I, Secunderabad-II Vijayawada & Mahabubnagar |
| Driver | 8th Class/Class-I MT Driver (Armed Forces) | 19,700/- | 02 | Golconda & Sainikpuri |
| Safaiwala | Literate | 16,800/- | 04 | Guntur, Kurnool, Nellore & Vijayawada |
| Peon | 8th Class or GD Trade (Armed Forces) | 16,800/- | 01 | Vijayawada |

PLEASE READ ALL INSTRUCTIONS CAREFULLY

**(2) For Terms & Conditions, Application Form & Remuneration**: For qualifications, work experience and age limits, kindly see website www.echs.gov.in. Application Form can be downloaded from the website under **EMPLOYMENT OPPORTUNITIES.** For additional details, contact on Tele No 07382361574 & email ID : echsstnhqsecbad@gmail.com during working hours. Preference will be given to the Ex-Servicemen. **(3) Last Date of Receipt of Application as per Format Given at our Website.** Application as per format alongwith self attested photocopies of testimonials for educational qualification (with Mark Sheets), work experience, Registration Certificates, Discharge book & PPO) will be submitted to Officer-in-Charge, Station HQ ECHS Cell, HQ TASA, Near Rastrapati Nilayam, Secunderabad 500010, Telangana by **16 May 2025 (1800hours).** Any application received after **16 May 2025** will not be accepted. **Online applications will not be accepted.** **(4)** Interview Date, Timing & Venue : Date & Time of interview will be intimated to all Accepted applicant through email. (5) Candidates meeting the Qualitative Requirements will only be called for interview. Candidates must bring all the original educational certificates, along with work experience and discharge book, PPO, Service Records and two PP size colour photographs at the time of interview. No TA/DA is admissible.

**NOTE : CANDIDATES NOT SUBMITTING COMPLETE / INCORRECT DOCUMENT WILL NOT BE CALLED FOR INTERVIEW.**

వార్త

ధనం లేకపోయినప్పటికీ ఏవో కోర్కెలు కలవాడు, సమర్థత లేనప్పటికి కోపించేవాడు వీరిరువురూ తమను తామే నాశనం చేసుకుంటారు.

-జి.ఇలియట్

# పునరంకితం

ఆరు కోట్ల ఆంధ్రుల కలలు సహాకారమైన వేళ అమరావతికి మంచి రోజులు వచ్చాయి. ఆ ప్రాంత రైతులు ఇప్పుడు సంబరాలు చేసుకుంటున్నారు. ముక్కారు పంటలు పండే సుభిక్షమైన నేల ఎన్నో వాణిజ్య పంటలు పండుతూ పదేళ్ల క్రితం వరకు రైతుకు మంచి ఆదాయం తెచ్చిపెట్టింది. నవ్యాంధ్రను స్వర్ణాంధ్ర సంకల్పంతో 9ఏళ్లనాడు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రధాని మోడీ చేత శంకుస్థాపన చేయించారు. ఆ రోజు ప్రధాని దేశంలోని అన్ని నదుల నుండి పవిత్ర జలాలు, సుక్షేత్రాల మట్టినీ తీసుకొచ్చి సంకల్ప బలాన్ని అందించారు. ఎన్నో శుభసంకల్ప ప్రమాణాలతో నేల నింగీతుళ్లిపడేలా కార్యక్రమాన్ని నిర్వహించినా, ఆ తర్వాత వచ్చిన పాలకులు మూడు రాజధానుల ప్రతిపాదన చేసి అమరావతి రైతురంగాన్నిఆందోళనలో ముంచారు. ఇటురైతుకు పంటలు పండించుకునే అవకాశమూ లేదు అలాఅని అంతకుముందు సంకల్పాలను నెరవేర్చనూ లేదు. ఏమైతేనే అమరావతిని అత్యంత వైభవ నగరంగా తీర్చిదిద్దాలన్న తపనతో ఆనాడు ప్రధాని మోడీ వేసిన శంకురాయిని పట్టించుకునేవారు లేకపోయారు. అమరావతి ప్రాంత యావత్ ప్రజానీకం ముక్తకంఠంతో అమరావతి నిర్మాణం కోసం సుక్షేత్రాలనిచ్చినా తమ త్యాగఫలాన్ని ఊరికేపోరాదని 1631 రోజులు సుదీర్ఘకాలం నిరాహార దీక్షలు చేపట్టారు. ఆంధ్ర దేశప్రజలు అదృష్టం ఏమోకానీ మళ్ళీ అమరావతి కలలు నిజమయ్యే రోజు రానే వచ్చింది. శుక్రవారం సాయంత్రం ప్రధాని మోడీ అమరావతి సంకల్పానికి పునఃప్రతిష్టంగావించారు. అమరావతి నిర్మాణంలో అత్యంత కీలకమైనవిగా భావిస్తున్న కార్యక్రమాలకు ప్రధాని శంకుస్థాపన చేశారు. చారిత్రక పరంపర, ప్రగతి కలిసి ప్రయాణిస్తోందని, అమరావతి స్వప్నం సాకారమవుతోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సందర్భంగా మాట్లాడుతూ అన్నారు. ఇకపై కొత్త అమరావతిని, కొత్త ఆంధ్రప్రదేశ్‌ను చూడబోతున్నామన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అమరావతి ఒక సమ్మిళిత శక్తిగాఉండడం స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణానికి శుభ సంకేతంగా పేర్కొన్నారు. అమరావతికి ఇక ఎటువంటి ఆటంకం ఉండబోదని కేంద్రం పూర్తి స్థాయిలో సహకరిస్తుందని, వికసిత్ భారత్‌కు అమరావతే గ్రోత్ ఇంజిన్‌గా పనిచేస్తుందని ప్రధాని భరోసా ఇచ్చారు. ఇరుగుపొరుగు దాయాది దేశాల మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకున్న తరుణంలో కూడా అమరావతి సంకల్పాన్ని ప్రధాని పక్కన పెట్టలేదు. దేశ పురోగతి అనగానే అన్నిరంగాల అభివృద్ధిగా నమ్మే ప్రధాని మోడీ ఈ ఉదయం కేరళ రాష్ట్రంలోని విలింజమ్ ఎయిర్పోర్ట్‌ను ప్రారంభించారు. దాదాపు రూ.1.07 లక్షల కోట్ల పనులకు శుక్రవారం ప్రధానమంత్రి శంకుస్థాపన చేశారు. వాటిలో ఒక్క అమరావతిలోనే ప్రధాన రూ.49,040 కోట్ల విలువైన పనులకు ప్రారంభం శంకుస్థాపనలు చేశారు. డిఆర్‌డిఏ ఆధ్వర్యంలో నాగాయలంక మండలం గుల్లలమోదలో క్షిపణి టెస్టింగ్ రేంజ్‌ను కూడా ఈ సందర్భంగా ప్రారంభించారు. సభావేదికపై నుంచి ఒకేసారి వర్చువల్ విధానంలో బటన్‌నొక్కి ప్రారంభించారు. జాతీయ రహదారులు రైల్వే విస్తరణ పనులు రూ.57వేల 962కోట్లతో చేపట్టారు. వీటిలో శాసనసభ, హైకోర్టు, సచివాలయం న్యాయమూర్తుల,పరిపాలన భవనాలు నిర్మిస్తారు. అంతేకాక 5200కుటుంబాలకు నివాస భవనాలు కూడా నిర్మించే ప్రతిపాదన ఉంది. వాటి నిర్మాణ పనులు, మౌలిక సదుపాయాలు అన్నీ ఒకేసారి ఒకే వేగంతో పూర్తవుతాయని జనం విశ్వసిస్తున్నారు. తొలిసారి గతంలో 2015 అక్టోబర్ రెండో తేదీన ఉద్దండరాయునిపాలెంలో అమరావతి రాజధాని పనుల నిర్మాణానికి ప్రధాని శంకుస్థాపన చేశారు. ఈసారి వెలగపూడిలో ఈ కార్యక్రమం చేపట్టటం విశేషం. ప్రపంచస్థాయి రాజధానిగా అమరావతి నిర్మించాలని సంకల్పం నెరవేరితే ఆంధ్రప్రదేశ్అగ్రభాగాన ఉన్నట్లే. ఇప్పటికే రూ.30వేల కోట్ల పెట్టుబడులను అమరావతి నిర్మాణ కోసం ఆకర్షించారు. అమరావతి పున్నిర్మాణానికి ప్రపంచ బ్యాంక్ ద్వారా రూ.15 వేలకోట్లు ద్వారా అందింది. అప్పట్లో అమరావతి కోసం 58రోజుల్లోనే34,281 ఎకరాల భూసమీకరించారు. ఇవన్నీ ఇలా ఉండగా అమరావతికి అధీకృత గుర్తింపే లేదన్న విపక్ష ఆరోపణలను కొట్టిపారేస్తూ తాజాగా మరో ఆలోచన ఎవరికీ రానీయకుండా ఈసారి పాలకులు పకడ్బందీగా అమరావతిని శాశ్వతం చేస్తోంది. ఇక ఆంధ్రా జనానికి అమరావతిని దూరం చేసే ఏ ప్రయత్నానికి అవకాశం ఉండదు. సాక్షాత్తూ ప్రధాని నీళ్ల నిధులు ఇచ్చి పునఃప్రతిష్ట చేస్తున్న ఈ కార్యక్రమంలో అమరావతికి భూములిచ్చిన ఆయా గ్రామ సీమల రైతాంగం ఆకుపచ్చ కండువాలతో తండోపతండాలుగా వచ్చి సంఘీభావం ప్రకటించారు. శాతవాహనులు, ఇక్ష్వాకులు వంటి చారిత్రిక రాజవంశాలు పాలించిన ఈ ప్రాంత చరిత్రలో నేటి పాలకుల చిత్తశుద్ధి కూడా చిరస్థాయిగా నిలిచిపోయింది. గుంటూరు కృష్ణా జిల్లాలోని 29 గ్రామాల రైతులు తన సారవంతమైన భూములను రాజధాని నగర నిర్మాణానికి స్వచ్ఛందంగా ఇచ్చారు. అది నిజంగా వాళ్ల చేసిన త్యాగమే. 18 ప్రధాన ప్రాజెక్టులకు రెండు రైల్వేలైన్లను జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎపి విధ్వంసం నుంచి విజయాల బాట పడుతోందని ఆనందం వ్యక్తం చేసారు. మూడేళ్ల తర్వాత అమరావతి పూర్తి కాగానే ప్రధాని నరేంద్ర మోడీ మళ్లీ వచ్చి ప్రారంభిస్తారని చంద్రబాబు హామీ ఇచ్చారు. ప్రపంచంలోని తొలి ప్రసిద్ధ రాజధానులలో అమరావతిని ఒకటిగా తీర్చిదిద్దాలన్న పాలకుల ఆకాంక్షలు తీరితే ఆంధ్రులను అదృష్టం వరించినట్లే!

చదరంగంలో మాదిరిగానే జీవితంలో కూడా ముందుచూపు ఎంతో అవసరం.



ఐ.జాన్సన్

జీవితంలో విజయం సాధించాలంటే మెట్లవైపు చూస్తూ ఉండక, వాటివైపు పయనం సాగించాలి.



మార్షల్

# ప్రజావాక్కు



## కుల గణనకు అధినాయక జయహే

కేంద్ర అధినాయకత్వం దేశవ్యాప్త కులగణనకు ఆమోదం తెలిపింది. చాలాఏళ్లుగా బీజేపీ మినహా మిగతా పక్షాలన్నీ కులగణన చేపట్టాలని కోరుతూ వస్తున్నాయి.అయితే అధికార పక్షం అందుకు వ్యతిరేకంకావడంతో అది కార్యరూపందాల్చలేదు.తమ రాష్ట్రవిభాగాలు అందుకు సరేఅన్నా, రాష్ట్రీయ స్వయం సేవక్ కూడా సానుకూలంగా మాట్లాడినా, కేంద్రంలో బీజేపీ అధినాయకత్వం మాత్రం ఇన్నాళ్లు ససేమిరా అంది. ఇప్పుడు అనూహ్యంగా కులగణన చేపట్టాలనికేబినెట్ నిర్ణయంతీసుకోవడంవిశేషం. రాబోయే జనగణన (సెన్సస్,జనాభా లెక్కలు) స్వాతంత్య్రం అనంతరం జరగబోయే తొలి కులగణనగా ఉండబోతోంది. ఈ నిర్ణయం ద్వారా బీజేపీ, ప్రతీ ఎన్నికల్లో కులగణనకు హామీ ఇస్తున్న ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ చేతి నుండి బలమైన ఎన్నికల ఆయుధాన్ని తీసుకున్నట్టే.

-డా.డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం

## పెరుగుతున్న కులాల పిచ్చి

నాడు కులాలు తమతమ వృత్తులను బట్టి ఏర్పడ్డాయి. నేడు పరిస్థితులు మారడంతోపాటు ప్రజల మనస్తత్వాలు కూడా మారిపోయాయి.కులాలను స్వీకరించే సాంప్రదాయం మరుగునపడిపోయింది. దాంతో ఆనాటి ఆచార వ్యవహారాలను, సాంప్రదాయాలను విశిష్టతలను విస్మరించి ఆధునిక వాదానికి ప్రజలు మొగ్గు చూపుతున్నారు. నేడు వృత్తుల దృష్ట్యా కులాల ప్రాధాన్యత తగ్గిపోయినా, ఇంకాకులాలను వినియోగించుకోవడం ఆత్మవంచనే అవుతుంది.అలాంటప్పుడు కొందరు ఇంకా ఈ కులాలను పట్టుకొని వేళ్లాడుతున్నారు. రాజకీయ పార్టీలు అధికారంలోకి రావడం కోసం ఈ కులాలను వజ్రాయుధాలుగా వాడుకుంటున్నారు. కులాలపిచ్చిన రూపుమాపాలంటే, రాజకీయ పార్టీలు కులమతాలను తెరపైకి తీసుకురాకుండా ఉండాలి.

-కాయల నాగేంద్ర, హైదరాబాద్

## చక్కదిద్దాలి

జాతీయ స్థాయిలో సగటున 12 శాతం చిన్నారులు బడి చదువులకు మధ్యలోనే దూరమవుతున్నారు. కారణాలేమిటో పాలకులు గ్రహించి, పరిస్థితులు చక్కదిద్దాలి. చదువులకు దూరమవుతున్న చిన్నారులు పాఠశాలకు వచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

-మా. శ్రీ.రాజు, పాల్వంచ

## అవినీతిని నిరోధించలేమా?

నీతి ఎక్కడున్నదో ఎంత వెదికినా కానరాదు.కాని అవినీతి ఎందెందు వెతికి చూసినా అందందే కలదు. ఈ రోజుల్లో అవినీతి మాత్రమే రాజ్యమేలుతోంది. ప్రభుత్వాధికారులు అటు ప్రభుత్వాన్ని ఇటు ప్రజలను మోసంచేస్తున్నారు. ఇటువంటి అవినీతి తిమింగలాలుఎన్నోవలలో చిక్కుకున్నకొద్దీ మళ్ళీమళ్ళీ దొరకుతున్నాయి. కాళేశ్వరం ఇంజినీర్ఇన్ చీఫ్‌హరిరామ్ అనినీతి బరువు 200 కోట్లని తేలింది. రెండు తెలుగురాష్ట్రాల లోనూ ఈయన ఆస్తులు కూడబెట్టారట. కాళేశ్వరం పాజెక్టు వ్యయంలో దాదాపు ఏభైవేల కోట్లవిలువైన పనులు ఈయన పర్యవేక్షణలోనే జరిగాయని ప్రభుత్వం గుర్తించింది. ఈమెగా ప్రాజెక్టు బీటలు వారిందంటే నాణ్యమైన పని జరగనట్టే కదా. ఇందులో కాంట్రాక్టర్లకు కూడా భాగస్వామ్యం లేనిదే ఇంత అవినీతికి తావుండదు కదా. పూర్వ ప్రధాని రాజీవ్‌గాంధీ ఓ మాటన్నారు.ప్రజల కోసం వినియోగించమని ఇచ్చే రూపాయిలో వారికి చేరేది పది పైసలు మాత్రమేనని అన్నారు.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## డాక్టరేట్ ఉద్యోగులు

గ్రామస్థాయి నుండి రాష్ట్రస్థాయివరకు,అటెండర్ నుండి ఐఏఎస్ అధికారి వరకు, డాక్టరేట్ పట్టా పొందిన వారిని గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ఆయాశాఖల పరిధిలోశాఖ అభివృద్ధికి సలహా సూచనలు స్వీకరించాలి. జిల్లావ్యాప్తంగా ఉన్న డాక్టరేట్ పట్టా పొందిన వారిని గుర్తించి ఒక టీమ్‌గా ఏర్పాటు చేసి ఆయా శాఖ పరిధిలో ఉన్నసమస్యలుఅధికారులకు తెలియజేసి పరిష్కరించే విధంగానిత్యం నివేదికలు తయారుచేయాలి. జిల్లా స్థాయి పర్యవేక్షణ చేయడానికిగాను వాహన సదుపాయాలు కల్పించాలి. ఆయాశాఖ పరిధిలో ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలపై అమలు విధానంపై అవగాహన చైతన్య కార్యక్రమాలను వీరి ద్వారా ప్రజలకు తెలియజేయాలి.

-రాపాక రవీందర్, జనగాం

## ఉపాధి దొరకని గ్రామాలు

ఈ మధ్య కాలంలో పురపాలికల్లో ఎక్కువ గ్రామాలు విలీనం కావడంవల్ల ఉపాధిహామీ ఆపురపాలికల చుట్టూ పక్కల గ్రామాలలో ఉండడం లేదు. అయితే పట్టణాలలో కూడా పెద్ద నీటికుంటల ఏర్పాటు చేయాలి. అలాగే ప్రభుత్వం సెర్ప్ ఆధ్వర్యంలో నైపుణ్య శిక్షణ సెంటర్స్ ఫామ్ చేసి యువతకు అందులో శిక్షణ ఇస్తూనే రోజు వారి కూలి చెల్లించాలి.

-భారత అవినాష్, జనగామ

మనవి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# వికలాంగమో వీరస్వర్గమో!

**దేశవ్యాప్తంగా వేలాదిమంది అసువులు బాస్తుండగా, కోట్లాదిమంది అంగవైకల్యంతో జీవనాధారంకోల్పోయి జీవచ్ఛ వాలుగా బతుకీడుస్తున్నారు. చేతికి అందివస్తున్న పిల్లలను కోల్పోయిన తల్లిదండ్రుల గర్భశోకం, తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారినపిల్లల పరిస్థితి వర్ణనాతీతం. ఇప్పటికైనా ఆదాయమే లక్ష్యంగా కాకుండామానవతా దృక్పథంతో నడుం కట్టాలి. మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై ఉక్కుపాదం మోపాలి. ప్రమాదాలకు కారకులైన డ్రైవర్ల లైసెన్సులను పాశ్చాత్య దేశాల్లోగా రద్దుచేయాలి. వారు జీవితంలో మళ్లీ స్టీరింగ్ పట్టకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి. అవసరమైతే చట్టాన్నిసవరించాలి. త్రికరణశుద్ధిగా ఆ కోణంలో ప్రయత్నాలు జరగక్కపోతే వాహనాలు మృత్యు దేవతల్లా రోడ్లపై వీరవిహారం చేయకమానవు. వేలాది మంది జీవితాలు అర్థాంతరంగా ముగియక తప్పదు.**

దామెర్ల సాయిబాబ

మానవుడి సుఖానికి, సంతోషానికి, అభివృద్ధి దోహదం కావాలి. సుఖం కోసం అభివృద్ధి మార్గాలను అన్వేషిస్తాం. రోడ్లు అభివృద్ధికి సోపానాలు అనేది అందరికి తెలిసిందే. మరి ఆ సోపానాలు మృత్యువుమార్గాలైతే ఎవరికి చెప్పుకోవాలి? ఏమని చెప్పుకోవాలి? దేశవ్యాప్తంగా రహదారుల అభివృద్ధికి కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నారు. మరొకపక్క అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన వాహనాలు తయారు చేస్తున్నారు. భద్రతకు మరెంతో ప్రాధాన్యత ఇస్తున్నారు. అయినా దేశవ్యాప్తంగా ప్రమాదాలు ఏమాత్రం తగ్గడంలేదు. రహదారులు రక్తసిక్తమవుతున్నాయి. ఇంటి నుంచి బయటకు వెళ్లిన మనిషి క్షేమంగా ఇంటికి వచ్చే గ్యారంటీ లేని పరిస్థితులు దాపురించాయి. అభద్రతా భావం రోజురోజుకు పెరిగిపోతున్నది. ఏ నిమిషానికి ఏమి జరుగునో అన్నట్లు ఎప్పుడు, ఏప్రమాదం ముంచుకొచ్చి ప్రాణాలు పోతాయో, వికలాంగులమవుతామోననే భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ నిబంధనలు మరింత పటిష్టం చేస్తున్నా, జరిమానాలు భారీగా పెంచుతున్నా, ప్రమాదాల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతున్నది. ప్రమాదాల్లో మరణించిన వారికి సంబంధించిన సన్నిహితులు, బంధువులు, గుండెలు బాదుకొని ఏడ్చేవారిని చూసి కన్నీరు సైతం ఘనీభవించే స్థితికి చేరుకున్నదేమోననిపిస్తున్నది. మొన్న బుధవారం నెల్లూరు జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక కారు రోడ్డుపక్కనున్న పూరింట్లోకి దూసుకుపోవడంతో ఐదుగురు మెరికల్లాంటి వైద్యవిద్యార్థులతో పాటు ఆ ఇంట్లో నిద్రిస్తున్న ఒక వృద్ధుడు కూడా మృత్యువాతపడ్డాడు. నెల్లూరుజిల్లా కోవూరు మండలం పోతిరెడ్డిపాలెం సమీపంలోని జాతీయ రహదారిపై బుధవారం మధ్యాహ్నం ఈ విషాద సంఘటన చోటు చేసుకున్నది. ఒక ప్రైవేట్ మెడికల్ కాలేజీలో రెండో సంవత్సరం ఎంబిబిఎస్ చదువుతున్న ఈ విద్యార్థి బృందం ఒక నిశ్చితార్థ కార్యక్రమానికి హాజరై తిరిగి వస్తుండగా కారు అదుపుతప్పి పక్కనున్న పూరింట్లోకి దూసుకువెళ్లింది.ఇంట్లో మంచంపై పడుకొని ఉన్న అరవైఐదేళ్ల వృద్ధుడిపైకి కారు దూసుకుపోవడంతో ఆయన అక్కడికక్కడే మరణించాడు. కారులో ఉన్న ఐదుగురు మెడికోలను గ్రామస్తుల సహాయంతో హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఐదుగురు మరణించారు. మొన్న తెలంగాణలో ఒకే రోజు జరిగిన వివిధ రోడ్డు ప్రమాదాల్లో పదకొండు మందికిపైగా మరణించారు. ఇందులో ఇద్దరు నర్సింగ్ విద్యార్థులున్నారు.అంతకు ముందు జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు అసువులుబాశారు. అన్నెంపున్నెం ఎరుగని వేలాది మంది అమాయకులు ఈ రోడ్డు ప్రమాదాలకు బలైపోతున్నారు. లక్షలాది మంది విక లాంగులుగా మారి కుటుంబానికి భారమై జీవితాంతంనరకం అనుభవిస్తున్నారు. ఒకరుకాదు, ఇద్దరు కాదు, ఒక రోజుకాదు, రెండు రోజులు కాదు నిత్యం ప్రమాదాల పరంపర కొనసాగుతూనే ఉన్నది. ఇలా ప్రమాదాలకు గురై అసువుల బాస్తున్న వారిలో అధికశాతం ముప్పై, ముప్పైఐదేండ్ల లోపు యువకులే. దేశవ్యాప్తంగా 2001 నుండి 2020 వరకు తొంభైఆరు లక్షల, అరవై రెండు వేల రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటే ఇరవై మూడు లక్షల ఇరవైఐదువేల మందికిపైగా మృత్యువాత పడ్డట్టు అధికార రికార్డులే వెల్లడిస్తున్నాయి. క్షతగాత్రులైన వారి సంఖ్యకోట్లలో ఉంది. రోడ్లపై ఏర్పడిన గుంతలు కారణంగా గతనాలుగేళ్లలో దాదాపు ఇరవైతొమ్మిదివేలకుపైగా ప్రమాదాలు చోటు చేసుకున్నాయి.అంతేకాదు ప్రమాదాలకు గురై ప్రాణాపాయ స్థితిలో సకాలంలో ప్రాథమిక చికిత్స

ఒక్క మాట

అందక మృత్యువుతో పోరాడి రోడ్లపైనే ప్రాణాలు వదులుతున్నవారు వేల సంఖ్యలో ఉన్నారు. అమెరికాలో రోడ్డు ప్రమాదాలకు గురైన ప్రతి రెండు వందల మందిలో ఒకరు మరణిస్తుంటే భారత్‌లో ప్రతి ఆరుగురిలో ఒకరు మరణిస్తున్నట్లు అధికార గణాంకాలే వెల్లడిస్తున్నాయి. అభివృద్ధికి సోపానాలైన రోడ్లే మృత్యువు మార్గాలై మానవాళిని కబళిస్తుంటే ఈ ప్రమాదాలను నివారించలేమా? ఇందుకు ఎవరు బాధ్యులు? లోపం ఎక్కడు న్నదనే ప్రశ్నలకు జవాబు అందరికి తెలిసినా ఆ కోణంలో చర్యలు తీసుకోలేకపోతున్నారు. సమావేశాలకు, సమీక్షలకు కొదవలేకపోయినా ఆచరణకు వచ్చేసరికి ప్రశ్నార్థకంగా మారిపోతున్నది. రోడ్డు భద్రతా వారోత్సవాలు ఘనంగానే నిర్వహించుకుంటుంటారు. ఒకపక్క ఈ కార్యక్రమాలు జరుగుతుంటేనే మరొకపక్క ప్రమాదాలు యథేచ్ఛగా జరుగుతుంటాయి. చట్టంలో కూడా మార్పులు తీసుకువస్తున్నారు. నిబం ధనలను అతిక్రమించినవారిపై భారీ జరిమానాలు విధిస్తు న్నారు. అంతేకాదు ప్రమాదాలకు గల కారణాలు, కారకులు ఎవరు అనే విషయంలో అధ్యయనం చేసేందుకు నిపుణుల కమిటీని కూడా నియమించారు. ఎంతో మంది నిపుణులుఎన్నో వ్యయప్రయాసలకోర్చి క్షేత్రస్థాయిలోఅధ్యయనాలు చేసి నివేదిక రూపొందించారు. ఆ నివేదికలను అటకెక్కించారు. ఎవరు ఎలా పోయినా, ఎంత మంది ప్రాణాలు అర్థాంతరంగా గాలిలో కలిసిపోయినా ఎన్ని లక్షల కుటుంబాలు వీధిన పడినా ధనార్జనే ధ్యేయంగా ప్రభుత్వం వ్యవహరిస్తున్నదనే విమర్శలను కొట్టివేయలేం. ప్రమాదాల నివారణకు శాశ్వత చర్యలు చేపట్టని ప్రభుత్వం నిర్లక్ష్యంగానో, మద్యం మత్తులోనో వాహనాలు నడిపి అమాయకులను బలితీసుకుంటున్నా, జరిమానాలు వసూలు చేయాలని లక్ష్యాలుగా నిర్ణయించడం ఎంతవరకు సమంజసమో ఆలోచించాలి. ప్రభుత్వ ఖజానాకు రాబడి ఇబ్బడి, ముబ్బడిగా పెంచడమే నిర్దేశంగా ప్రభుత్వం అడుగులు వేయాలనుకోవడం దురదృష్టకరం. నెలనెలా ఎన్ని కేసులుపెట్టాలో, ఎంత వసూలు చేయాలి? లక్ష్యాలు నిర్ణయిస్తున్నారు. సందట్లో సడేమియా అన్నట్లు కొందరు అధికారులు ఈ పేరుతో సొంత ఖజానాలు నింపుకుంటున్నారు. వాహనాల కట్టడి అనే లక్ష్యం నీరుగారిపోగా కాలంచెల్లిన వాహనాలకుపర్మిట్లు, లైసెన్సులు ఇష్టానుసారంగా జారీ అవుతున్నాయి. అధిక శాతం ప్రమాదాలు చోదకుల నిర్లక్ష్యం, తప్పిదం వల్లనే జరుగుతున్నాయని నిపుణుల అధ్యయనంలో తేలింది. ఇక మద్యపానం కూడా ఈ ప్రమాదాలను పెంచుతున్నదనే విషయం జగమెరిగిన సత్యం. కొందరు డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడుపుతుండడం వల్ల ప్రమాదాల సంఖ్య పెరిగిపోతున్నది. మద్యాదాయమే మహాప్రసాదం అన్నట్లు పాలకులు జాతీయ రహదారిపైకూడా మద్యం విక్రయకేంద్రాలకు అనుమతులు ఇవ్వడం ఈ ప్రమాదాలకు మరింత ఊతం ఇస్తున్నాయి. మద్యంతో ఆదాయం వస్తుండవచ్చు. కానీ జరుగుతున్న అనర్థాలను పట్టించుకోకపోవడం దురదృష్టకరం. ఇదిలావుంటే రోజురోజుకు వాహనాల సంఖ్య పెరిగిపోతున్నది. అందుకు తగినట్లుగా రోడ్లను విస్తరించలేకపోతున్నారు. ఏవో కమిటీలు, సమావేశాలు, వీడియో కాన్ఫరెన్స్‌లు అంటూ కాలం గడుపుతున్నారే తప్ప నిర్దిష్టమైన చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. అంతెందుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రోడ్డు ప్రమాదాలను నివారించడం కోసం మూడు దశాబ్దాల క్రితమే రోడ్ సేఫ్టీ ఆథారిటీని ఏర్పాటు చేసినా ఆ విభాగానికి నిధులు, విధులు అప్పగించకుండా మూలన కూర్చోబెట్టారు. చివరకు పరిస్థితి ఎలావచ్చిందంటే తమ మాట వినని, తమకు నచ్చని సీనియర్ అధికారులను అక్కడ పనిష్మెంట్ కింద పోస్టింగ్ఇచ్చి పనిలేకుండా కూర్చోబెట్టి నెలనెలా జీతభత్యాలు ఇస్తున్నారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత రెండు రోడ్ సేఫ్టీ ఆథారిటీలు ఏర్పడ్డాయి.దీంతో ఆ ఆథారిటీ అలంకరప్రాయంగా నిలిచిపోయింది. ఒక్కమాటలో చెప్పాలంటే ఆదాయం పెంచుకోవడంలో ఉన్న శ్రద్ధాశక్తులు ప్రమాదాలు నివారించడంలో చూపించలేకపోతున్నారు. ఫలితంగా నిత్యం రహదారులు రక్తసిక్తం అవుతున్నాయి. దేశవ్యాప్తంగా వేలాదిమంది అసువులు బాస్తుండగా, కోట్లాదిమంది అంగవైకల్యంతో జీవనాధారంకోల్పోయి జీవచ్ఛవాలుగా బతుకీడుస్తున్నారు. చేతికి అందివస్తున్న పిల్లలను కోల్పోయిన తల్లిదండ్రుల గర్భశోకం,తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారినపిల్లల పరిస్థితి వర్ణనాతీతం.ఇప్పటికైనా ఆదాయమే లక్ష్యంగా కాకుండామానవతా దృక్పథంతో నడుం కట్టాలి. మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై ఉక్కుపాదం మోపాలి. ప్రమాదాలకు కారకులైన డ్రైవర్ల లైసెన్సులను పాశ్చాత్య దేశాల్లోగా రద్దుచేయాలి. వారు జీవితంలో మళ్లీ స్టీరింగ్ పట్టకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి. అవసరమైతే చట్టాన్నిసవరించాలి. త్రికరణశుద్ధిగా ఆ కోణంలో ప్రయత్నాలు జరగక్కపోతే వాహనాలు మృత్యు దేవతల్లా రోడ్లపై వీరవిహారం చేయకమానవు. వేలాది మంది జీవితాలు అర్థాంతరంగా ముగియక తప్పదు. ●

# పత్రికా మర్యాదలతోనే స్వేచ్ఛకు నెలవు

రామ కిష్టయ్య సంగన భట్ల

జర్నలిస్టుల నిరసనగా గుర్తుగా మే 3వ తేదీని ప్రపంచ పత్రికా స్వేచ్ఛా దినోత్సవంగా జరుపుకుంటాము. అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటనలోని 19 ఆర్టికల్‌కు అనుగుణంగా పాలకులు పత్రికా స్వేచ్ఛను కాపాడాలని, వారికి పత్రికా స్వేచ్ఛ ప్రాధాన్యతను గుర్తు చేస్తూ ఐక్యరాజ్య సమితి 1993లో అంతర్జాతీయ పత్రికా స్వేచ్ఛ దినంగా మే 3వ తేదీని ప్రకటించింది. అప్పటినుంచి ప్రతి సంవత్సరం మే 3వ తేదీన పత్రికా స్వేచ్ఛ పరిరక్షణకు, పత్రికా స్వేచ్ఛపై అవగాహన కల్పించటానికి ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవంను జరుపుకుంటున్నారు. భారత స్వాతంత్ర్యానికి ముందు కూడా మీడియాలో రెండు తరగతులు వుండేవి. ఒకటి స్వాతంత్ర్య లక్ష్యం కోసం ప్రధానంగా పని చేసినవి, రెండవ తరగతి బ్రిటీష్ సామ్రాజ్య వాదులతో ఘర్షణపడకుండా స్వామికార్యం, స్వకార్యం నెరవేర్చుకొనేవి. తరువాత దేశ మీడియాలో ఆ గీత చెరిగిపోయింది. ప్రజల కోసం, ప్రజల సమస్యల మీద కేంద్రీకరణ లేదు. ఎవరు అధికారంలో వుంటే వారికి అనుకూలంగా, పెట్టుబడిపై లాభాలను ఆర్జించే వ్యాపకంగా మారింది. అందుకోసం వార్తను, దృశ్యాన్ని వ్యాపార సరకులుగా మార్చి వేశారు. స్వాతంత్ర్యానికి ముందు బ్రిటీష్ వారిని వ్యతిరేకిస్తూ పత్రికలు పెట్టిన ఎందరో తమ ఆస్తులను పణంగా పెట్టారు. ప్రస్తుతం అధిక సంఖ్యాక పత్రికలు, చానళ్లు లాభాల కోసం నడుస్తున్నవే. మా పత్రిక ధర మీరు కొనే సమోసా కంటే తక్కువే అని గతంలో ఒక మీడియా సంస్థ ప్రచారం చేసుకోవడం తెలిసిందే. ఒక్క పత్రికలు తప్ప ప్రపంచంలో ఏ వస్తువూ తయారీ ధరకంటే తక్కువకు లభ్యం కావటంలేదు. ప్రకటనలే పత్రికలను గటెక్కిస్తాయనడంలో సందేహంలేదు. వార్తా ప్రచురణ, ప్రసారం లాభదాయకమా కాదా? అన్నది అటుంచితే ఎందుకోకానీ నేడు నూటికి తొంభై తొమ్మిది సంస్థలు మాకేమిటి అన్నట్లుగా వ్యవహరిస్తున్నాయనే అపప్రద ఉంది. అలాంటి వాటికి భావప్రకటనా స్వేచ్ఛ వుంటేనే లేకపోతేనేం. నేడు మీడియా సంస్థలను డబ్బులు సంపాదించే పెట్టుబడిదారులు నడుపుతున్నారు తప్ప సంపాదకులకు ఎలాంటి స్వేచ్ఛ లేకుండాపోతోంది. మీడియా స్వేచ్ఛకు కలుగుతున్న హాని గురించి ఒక్కమాట కూడా రాయలేని నిస్సహాయత నేడు మనం చూస్తున్నాం. ఫోర్త్ ఎస్టేట్‌గా మన్ననలను పొందిన మీడియా రియలెస్టేట్‌గా మారిపోయిందనే ఆరోపణలు నిత్యం వినాల్సివస్తోంది. మీడియా యజమానులు, రాజకీయ నేతలకు మధ్య వున్న గీత దాదాపుగా చెరిగిపోయింది. ఒకరిప్రయోజనాలను ఇంకొకరు కాపాడుకుంటున్నారు. లేదా వారే వీరవుతున్నారు. దేశంలోని గుత్త పెట్టుబడిదారీ సంస్థలు మీడియా రంగంలో ప్రవేశించటంతో పత్రికా స్వేచ్ఛ హరించుకుపోతున్నది. పాలక పక్షాలు స్వార్థమే పరమార్థంగా వ్యవహరిస్తున్నాయన్నది స్పష్టం. గతంలో కాంగ్రెస్ అత్యవసర పరిస్థితిని ప్రకటించి మీడియా వార్తలపై ప్రత్యక్ష సెన్సార్‌షిప్ విధించింది. ఇప్పుడు అదే కాంగ్రెస్ లేదా బిజెపి వాటితో జట్టు కట్టే పాలకవర్గ ప్రాంతీయ పార్టీలు మీడియా మీద పరోక్ష సెన్సార్‌ను అమలు జరుపుతున్నాయి. మన దేశంలో గత కొన్నేళ్లుగా కుహనావార్తలు సామాజిక మాధ్యమాన్ని ముంచెత్తుతున్నాయి. హిట్లర్ ప్రభుత్వంలో మంత్రిగా వున్నగోబెల్స్ ఒక అబద్ధాన్ని వందసార్లు చెబితే నిజమైకూర్చుంటుంది అన్న సూత్రంతో పని చేశాడు. ఇప్పుడు మనిషి మనిషికీ ఇంటర్నెట్ అందుబాటులోకి రావటంతో గోబెల్స్‌లు వికటాట్టహాసంచేస్తున్నారు. నిజమైనవార్తలు, నిజమైన పత్రికా, మీడియా స్వేచ్ఛ విషయంలో జనం కూడా గందరగోళానికి గురవుతున్నారు.మన దేశంలో 1956లో ఏర్పాటు చేసిన తొలి ప్రెస్ కమిషన్ సిఫార్సుల మేరకు 1966 నవంబరు 16న ప్రెస్‌కౌన్సిల్ ఏర్పడింది. ఆరోజును జాతీయ పత్రికాదినంగా పాటిస్తూ 1997నుంచి ప్రెస్‌కౌన్సిల్ ప్రతిఏటా కార్యక్రమాలు నిర్వహిస్తున్నది. భారతదేశంలోనే కాకుండా చాలా ప్రపంచ దేశాలలో ప్రెస్‌కౌన్సిళ్లు ఉన్నాయి.అయితే భారతదేశకౌన్సిల్‌కు ఉన్న ప్రత్యే కత, గుర్తింపు ఏమంటే ప్రభుత్వ శాఖలపై కూడా తన అధికారాన్ని వినియోగించేఅవకాశంలభించడమే. స్వేచ్ఛాయుత,జవాబుదారీమీడియా కోసం జనం పరితపిస్తున్నారు.మీడియా సంస్థలనూ సరైనదారిలో పెట్టే సంకల్పంతో ప్రెస్‌కౌన్సిల్ ముందుకు సాగాలని కోరుకుందాం. ●

# కులగణన బడుగు జనహితమే!



డాక్టర్ సంగని మల్లేశ్వర్

దేశానికి స్వాతంత్రం వచ్చి ఏడు దశాబ్దాలు గడిచినప్పటికీ బిసిల విషయంలో మేమునగం, మాకునగం అనే నినాదంఎండమావిగానే నిలిచింది. ఓబీసీల సంక్షేమం కోసం పాటు పడినపాలకులు బహుఅరుదు. అలాంటి వారిలో వీపీ సింగ్, బిపి. మండల్, కరుణానిధి, కర్పూరి ఠాకూర్, ఆ తరువాత తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి వారి సరసన నిలుస్తారు. అనేక ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ఊదరగొట్టి 50శాతం పైగా ఉన్న బిసి జనాభాకు కులగణన చేయని కారణంగా ఏరంగంలో కూడా న్యాయం జరగలేదు. రాష్ట్రప్రభుత్వం చారిత్రాత్మకంగా తెచ్చిన రిజర్వేషన్ల బిల్లు మోడీ కోర్టులో వేయడం, దేశంలో కులగణన దిశగా 80 కోట్ల ప్రజలు మొగ్గడం, రాహుల్ నాయకత్వంలోనిఇండియా కూటమి దూకుడుగా వ్యవహరించడంవల్ల అపవాదు మూట గట్టుకుంటామనే భయంతో ఎన్డీఏ ప్రభుత్వం కులగణనకు పచ్చజెండా ఊపడం చరిత్రలో లిఖించదగ్గరోజు. దేశంలో రెండు పార్టీలు ఓబీసీలను ఇన్నాళ్లు నయవంచనకు గురి చేసినారనేది బడుగుల ఆర్థిక విధ్వంసానికి కారణమనే భావించాలి. బ్రిటిష్ కాలంలో 1931లో జరిగిన కులగణన దిక్కు అయింది. తర్వాత 1951లో నిర్వహించిన కులగణనను అంటరానిదిగా ముట్టుకోలేదు. ఈరోజు ప్రధానిగా బీసీ మోడీ ఉండడం వల్లనే తన వర్గానికి జరిగిన అన్యాయాన్ని ఆలస్యంగా అయిన గుర్తించడం వల్ల కాంగ్రెస్ ఆశలు ఆవిరి అయ్యే ప్రమాదం ఉంది. అయితే కులగణనతోనే జబ్బులు చేర్చుకుంటే సరిపోదు, సామాజిక న్యాయం జరగాలంటే ప్రభుత్వం చిత్తశుద్ధి కూడా అవసరం. ఓబీసీల తిరుగుబాటు చవిచూడక ముందే పార్లమెంట్‌లో రిజర్వేషన్ల బిల్లు రాజ్యాంగ సవరణ చేయాల్సిన అవశ్యకత ఉంది. నాడు బీసీ కమిషన్‌కు 123వ రాజ్యాంగసవరణ బిల్లు ఏకగ్రీవంగా ఆమోదింప చేసి రాజ్యాంగ హోదా కల్పించింది. అయితే ఇప్పుడు వచ్చే ముప్పును పసిగట్టి ముందస్తు చర్యలకు అడుగులు వేసిందనడంలో ఎలాంటి సందేహం అవసరం లేదు. ఉమ్మడి పాలనలో గడిచిన 77సంవత్సరాల కాలంలో ఓబీసీల అభివృద్ధికి ఏ ప్రభుత్వం పాటు పడలేదు.నాడు వీపీ సింగ్ ప్రభుత్వం ఉండడం మూలాన 27శాతం విద్య, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లకు నోచుకుంది. నేటికీ మన సమాజంలో అనేక కులాలు ఇంకా పాలితులుగానే ఉండడం మన వెనుకబాటు తనానికి సూచిస్తున్నది. దీంతో రాజ్యా



ధికారం అనే భావ నను ఏ మాత్రం అనుభవించకుండా ఐదేండ్లకోసారి ఓటేసే ఓటర్లుగా మాత్రమే బతుకుతున్న జనాభాకు కులగణన ఊపిరిపోసింది. స్థానికసంస్థల ఎన్నికలకు బీసీల సామాజిక అంశమేముఖ్య అజెండాగా పోయేందుకు కాంగ్రెస్ పార్టీతోపాటు భారతీయ జనతాపార్టీ, బారాస పార్టీలు కొంగజపం కాకుండా విద్య,ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్ల అమలుకోసం,సమన్యాయం కోసం పార్లమెంటులో రిజర్వేషన్ల బిల్లు ఆమోదించే విధంగా మేల్కొంటే అన్ని పార్టీలు బట్టకడతాయంటే అతిశయోక్తి కాదు. విద్య, ఉద్యోగ ఉపాధి రాజకీయ రంగాలలో 42 శాతం రిజర్వేషన్ అమలు చేయడానికి అన్నిపార్టీలు ఎలాం టి అరమరికాలు లేకుండా కృషి చేయవలసిన పరిస్థితులు ఏర్పడినాయి. దేశంలో కులగణన అంశంనాయకులకు నిద్రపోనివ్వడం లేదంటే అతిశయోక్తి కాదు. కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 2011లో సామాజిక, ఆర్థిక సర్వే చేపట్టింది కానీ, లెక్కలు బయటపెట్టలేదు.ఎన్నికల ముందు రాహుల్ హామీ ఇచ్చిన మాదిరిగానే అసెంబ్లీలో తీర్మానం చేసి యుద్ధ ప్రాతిపదికన చేపట్టిన కులగణన రాష్ట్రప్రభుత్వాన్ని విమర్శలకు తావిచ్చింది. అందులో పిహెచ్‌డికి సరిపోయే 53 ప్రశ్నావళికి బడుగులు స్పందించలేదు.తదుపరి అవకాశం ఇచ్చినా ఆదరణకు నోచుకోలేదు.కేంద్రంచేపట్టనున్న కులగణనలో స్పష్టంగా ఒక పేజీకి మించకుండాసామాజిక, విద్య, ఉద్యోగ అంశాలపై దృష్టిసారిస్తే 100శాతం ఫలితాలు రాబట్టవచ్చుననే భావం ఏర్పడింది. ఈనేపథ్యం లో అనేక విషయాలు జవాబు లేని ప్రశ్నలుగా మనముందుంటున్నాయి. కుటుంబాలవారీగా ఆదాయ గణన ఒకశాస్త్రీయ పద్ధతిలో జరగనప్పుడు అర్హత గల పేద కుటుంబాలను ఎలాగుర్తిస్తారు? నిజానికి అందరికి ఆమోదయోగ్యమైన విధంగా దశాబ్దాలుగా శాస్త్రీయంగా పేదలను గుర్తించే అధ్యయనం జరుగలేదు.అలాంటప్పుడు దుడ్డు ఉన్నోడిదే బర్రె అన్నమాదిరిగా ఇలాంటి పథకాలుతప్పుదారి పట్టడం మామూలే. ప్రభుత్వాలకు సైతం అమలు చేయడం సమస్య గా మారుతుంది. ఇంకా చెప్పాలంటే మన దేశంలో వ్యక్తిగతంగా వార్షికాదాయం లెక్కించడం మరిక్లిష్టతరమైనది. పనికి తగ్గ వేతనం లేదు.స్వయం ఉపాధి మీద ఆధారపడి జీవిస్తున్న సగటు ప్రజల వార్షికాదాయం లెక్కించడం సాధ్యమయ్యే పనికాదు. అందుకే కులగణన సమస్యాత్మకంగా మారింది.దేశంలో కులగణనకు తెలంగాణ, బీహార్ ,కర్ణాటక ఆదర్శంగా నిలిచాయని,అందులో కాంగ్రెస్‌పాలిస్తున్న రాష్ట్రాలు ముందడుగు వేయడంతో ఆలస్యంఅమృతం విషం అన్ననానుడి గుర్తుకొచ్చి బీజేపీ నిర్ణయం తీసుకోవడం తప్పలేదు. సుప్రీంకోర్టు విధించిన 50శాతం పరిమితి దాటడానికి రాజమార్గంఏర్పడ్డది. ఏదిఏమైనా రాహుల్ఇచ్చిన కులగణన హామీతో బెంబేలెత్తి పచ్చజెండా ఊపడం ముదావహం. ●

# సుంకాల విషయంలో నిజాయితీయే ముఖ్యం

## డొనాల్డ్ ట్రంప్ చర్చల ప్రతిపాదనపై చైనా



**బీజింగ్, మే 2:** అమెరికా, చైనాల మధ్య పరస్పర సుంకాల నేపథ్యంలో వాణిజ్య యుద్ధం నెలకొన్న విషయం తెలిసిందే. టారిఫ్‌లపై విస్తృతస్థాయిలో చర్చలు జరిపేందుకు అమెరికా అధికారుల బృందం చైనా అధికారులను సంప్రదించింది. తాజాగా ఈ విషయంపై బీజింగ్ స్పందిస్తూ.. వాషింగ్టన్ ఇటీవల తీసుకున్న వాణిజ్య విధాన నిర్ణయాలు, సుంకాల తగ్గింపు విషయమై అగ్రరాజ్యంతో చర్చలు జరపాలా? వద్దా అని యోచి స్తున్నట్లు వెల్లడించింది. 'టారిఫ్ సమస్యలపై బీజింగ్‌తో చర్చలు జరపాలనే ఆశను వ్యక్తంచేస్తూ అమెరికా సంబంధిత వర్గాల ద్వారా అనేకసార్లు సందేశాలను పంపింది. దీంతో చర్చల విషయంలో ఎటువంటి నిర్ణయం తీసుకో వాలనే విషయాన్ని అధికారులతో సంప్రదించి ఓ అంచనాకు వస్తాము' అని చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ పేర్కొంది. అయితే తమపై టారిఫ్ విధిస్తూ వాణిజ్య యుద్ధాన్ని అమెరికా ఏకపక్షంగా ప్రారంభించిందని వాణిజ్య మంత్రిత్వ శాఖ ప్రతినిధి అన్నారు. ఇప్పుడు ఆ దేశం తమతో చర్చలు జరపాలంటే తమతో నిజాయితీగా ఉండాలని తెలిపారు. బీజింగ్‌తో వ్యవహరిస్తున్న తప్పుడు పద్ధతులను సరిదిద్దుకొని తమపై విధించిన ఏకపక్ష సుంకాలను ఎత్తివేయడానికి చర్చలు తీసుకోవాలన్నారు. అప్పుడే అమెరికాతో బీజింగ్ సానుకూల చర్చలు చేపడుతుందని తెలిపారు. మరోవైపు చైనానే టారిఫ్‌లపై చర్చల కోసం తీవ్రస్థాయిలో యత్నిస్తోందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పదేపదే చెబుతున్నారు. బుధ వారం కూడా ఆయన మాట్లాడుతూ డీల్ కుదు ర్చుకోవడానికి బలమైన అవకాశాలున్నాయని చెప్పారు. 'చర్చల్లో మా నిబంధనలకు లోబడే ఒప్పందం చేసుకోనున్నాం. అదే మంచిది' అని ఆయన న్యూస్‌నేషన్ టౌన్‌హాల్ కార్యక్రమంలో వెల్లడించారు. దాదాపు వారం రోజుల క్రితం ట్రంప్ ఇటువంటి ప్రకటనే చేయగా చైనా బహిరంగంగానే ఖండించింది. నాడు బీజింగ్ ప్రతినిధి గువో జియాకున్ మాట్లాడుతూ 'ఇరుదేశాల మధ్య సంప్రదింపులు ఏమీ జరగడం లేదు. వాణిజ్య ఒప్పందం కుదరలేదు' అని చెప్పారు. అయితే ఈ అంశంపై భవిష్యత్తులో చర్చలకు సిద్ధమే అని చెప్పడం విశేషం. అయితే తాము చేసిన కొత్త వాణిజ్య ఒప్పందాల గురించి తమతో చర్చించడానికి 75 కంటే ఎక్కువ దేశాలు ఇప్పటికే సిద్ధంగా ఉన్నాయని వైట్‌హౌస్ పేర్కొంది. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చైనాపై టారిఫ్‌ల కొరడా విసురుతున్న ట్రంప్ బీజింగ్ నుంచి దిగుమతి చేసుకొనే వస్తువులపై సుంకాన్ని 145 శాతానికి పెంచిన విషయం తెలిసిందే. దీనికి ప్రతిగా చైనా కూడా అగ్రరాజ్య ఉత్పత్తులపై 125 శాతం టారిఫ్‌లు ప్రకటించింది. దీంతో ఇరు దేశాల మధ్య వాణిజ్య విభేదాలు భగ్గుమన్నాయి.

# శశిథరూర్‌తో నాఫోటో చూసి కాంగ్రెస్‌కు నిద్రపట్టదు

## తిరువనంతపురంలో ప్రధాని మోడీ ఛలోక్తులు



**తిరువనంతపురం, మే 2:** దేశాభివృద్ధిలో ఓడరేవులద్వారా వాణిజ్యం ఇపుడు కీలకం అవుతున్నదని కేరళలోని ఒక కార్యక్రమంలో పాల్గొని మాట్లాడిన ప్రధాని మోదీ ప్రతిపక్ష పార్టీపై వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. శశిథరూర్‌తో కలిసి ఉన్న ఫోటో చాలామందికి నిద్రలేకుండా చేస్తుందని కాంగ్రెస్‌ను ఉద్దేశించి శశిథరూర్, విజయన్ ముందే మోదీ వ్యాఖ్యానించారు. ఈ రోజు శశి థరూర్ ఇక్కడ ఉన్నారు. ఈ కార్యక్రమం కొందమందికి నిద్రలేని రాత్రిని మిగులుస్తుంది. సందేశం ఎక్కడి వెళ్లాలో అక్కడికి వెళ్లిపోయింది అని మోదీ చమత్కరించారు. అంతకు ముందు గురువారం రాత్రి కేరళ చేరుకున్న ప్రధానిని శశి థరూర్ వ్యక్తిగతంగా వెళ్లి స్వాగతించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఢిల్లీ ఎయిర్‌పోర్టులో విమానాల ఆలస్యంగా నడుస్తున్నప్పటికీ సమయానికి తిరువనంతపురం చేరుకోగలిగా. నా నియోజకవర్గానికి వచ్చిన ప్రధాని మోదీని సాదరంగా స్వాగతించా అని థరూర్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అయితే, కాంగ్రెస్ అధినాయకత్వంతో ఎంపీ శశి థరూర్ బంధం బీటలు వారుతున్నట్లు ఊహాగానాలు విని పిస్తున్నాయి. గత కొన్ని నెలలుగా థరూర్ తన సొంత పార్టీపై బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఆ మధ్య ఓ కేంద్రమంత్రితో ఆయన సెల్ఫీ దిగడంతో థరూర్ పార్టీ మారనున్నట్లు ప్రచారం జరిగింది. ఆ తర్వాత భారత విదేశాంగ విధానాన్ని ప్రశంసిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలు కూడా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఈ పరిణామాల వేళ థరూర్ మోదీతో వేదిక పంచుకోవడం చర్చనీయాంశంగా మారింది. గడిచిన 10 ఏళ్లలో భారత ఓడరేవుల సామర్థ్యం రెట్టింపు అయిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెల్లడించారు. పోర్టుల సామర్థ్యం గణనీయంగా మెరుగుపడిందని వివరించారు. నావికుల సంఖ్యలో ప్రపంచంలోని తొలి మూడు దేశాల్లో భారత్ ఒకటిగా నిలిచిందన్న ప్రధాని, టర్నరౌండ్ సమయం 30శాతం తగ్గిందని తెలిపారు. ఇంతకుముందు 75 శాతం భారత షిప్‌మెంట్ కార్యకలాపాలు విదేశీ ఓడరేవులలో నిర్వహించడం వల్ల దేశం చాలా ఆదాయాన్ని నష్టపోయిందని తెలిపారు. తిరువనంతపురంలో రూ. 8వేల867 కోట్లతో నిర్మించిన విజింజం అంతర్జాతీయ ఓడరేవును పినరయి విజయన్, కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్, పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ సమక్షంలో మోదీ ప్రారంభించారు. అంతర్జాతీయ వాణిజ్యం, షిప్పింగ్‌ల కోసం భారతదేశానికి ఈ ఓడరేవు కీలకమవుతుందని ప్రధాని తెలిపారు. దేశాభివృద్ధిలో పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్యం కీలక పాత్ర పోషిస్తుందని వెల్లడించారు. జి20 శిఖరాగ్ర సమావేశంలోనే మేము భారత్‌మధ్యప్రాచ్యంయూరప్ కారిడార్‌పై అనేక పెద్దదేశాలతో ఒప్పందాలు చేసుకున్నాము. ఓడరేవులకు సంబంధించి కేరళ చాలా ముఖ్య స్థానంలో ఉంది. విజింజం ఓడరేవు నుంచి కేరళ కూడా పెద్ద ఎత్తున ప్రయోజనం పొందబోతోంది. మన దేశంలోని సముద్ర రంగాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్లడంలో ప్రైవేట్ రంగం కీలక పాత్ర పోషిస్తుందని మోదీ అన్నారు.

# ఉగ్రవాదుల అంతానికి భారత్‌కు సహకరించండి

## పాక్‌కు యుఎస్ వైస్‌ప్రెసిడెంట్ జెడి వాన్స్ సూచన

**వాషింగ్టన్, మే 2:** పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల పాశవిక దాడితో భారత్-పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. ఈ పరిణామాలపై తాజాగా అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ దాడి విషయంలో భారత్ ప్రతిస్పందన ప్రాంతీయ సంఘర్షణలకు దారి తీయకుండా ఉండాలని కోరారు. అంతేగాక, ఉగ్ర వేటలో న్యూఢిల్లీకి పాక్ సహకరించాలని పిలుపు నిచ్చారు. 'పర్యాటకులపై ఉగ్రదాడి ఘటన తీవ్ర దిగ్భ్రాంతికరం. అయితే, దీనికి భారత్ ప్రతిస్పందించడం సరైనదే. అయితే, అది విస్తృత ప్రాంతీయ సంఘర్షణలకు దారితీయని రీతిలో ఉంటుందని మేం విశ్వసిస్తున్నాం. ఇక, పాకిస్థాన్ కూడా ఈ విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆశిస్తున్నాం. కొన్నిసార్లు పాక్ భూభాగం నుండి కార్యకలాపాలు సాగిస్తున్న ఉగ్రవాదులను వేటాడటంలో భారత్ చేస్తున్న ప్రయత్నాల్లకు వారు సహకరించాలి' అని జెడి వాన్స్ ఓ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో వెల్లడించారు. జెడి వాన్స్ సతీసమేతంగా భారత పర్యటనలో ఉన్న సమయంలోనే పహల్గాం ఉగ్రదాడి ఘటన జరిగిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో ఆ దాడిని వాన్స్ తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ చేసే పోరాటంలో అమెరికా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తుందని ఆయన భరోసా నిచ్చారు. ఇప్పటికే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సహా పలు అగ్రరాజ్య నేతలు ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తూ భారత్‌కు మద్దతుగా నిలిచారు. ఇదిలా ఉండగా.. భారత్-పాకిస్థాన్ సరిహద్దుల్లో అలజడి కొనసాగుతూనే ఉంది. నియంత్రణ రేఖ వెంబడి పాక్ సైన్యం మరోసారి కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి కవ్వింపులకు పాల్పడింది.



కుప్వారా, బారాముల్లా, పూంఛ్, నౌషెరా, అఖ్నూర్ సెక్టార్లలో దాయాది బలగాలు కాల్పులకు తెగబడ్డాయి. వీటిని భారత ఆర్మీ సమర్థంగా తిప్పికొట్టింది. సరిహద్దుల్లో పాక్ బలగాల దుశ్చర్యకు పాల్పడటం వరుసగా ఇది ఎనిమిదో సారి కావడం గమనార్హం. ఏప్రిల్ 22న పహల్గాంలోని బైసరన్ లోయలో ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో 26 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే.

# ఐదో తరగతి స్టూడెంట్‌తో టీచర్ జంప్,అరెస్టు



**సూరత్, మే 2:** నాలుగు రోజుల క్రితం 11 ఏళ్ల విద్యార్థితో పారిపోయిన మహిళా ఉపాధ్యాయురాలిని గురువారం పోలీసులు అరెస్టు చేశారు. గుజరాత్‌లోని సూరత్‌లో ఉన్న పూనాగం ప్రాంతం నుంచి ఐదో తరగతి విద్యార్థితో పారిపోయిన సదరు ఉపాధ్యాయురాలిని రాజస్థాన్ సరిహద్దులోని షామ్లాజీ ప్రాంతంలో అదుపులోకి తీసుకున్నారు. విద్యార్థితో కలిసి బస్సులో వెళ్తుండగా అరెస్టు చేశారు. మొబైల్ టవర్ లొకేషన్ ఆధారంగా వారు ఉన్న స్థలాన్ని పోలీసులు గుర్తించారు. బాధిత విద్యార్థిని అతడి కుటుంబానికి అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం టీచర్, విద్యార్థి కలిసి వడోదర, అహ్మదాబాద్, జైపూర్, ఢిల్లీ, బృందావన్ వంటి వివిధ ప్రదేశాల్లో తిరిగారు. వారిద్దరు దాదాపు 2,200 కిలోమీటర్లు మేర ప్రయాణించారు. ఈ ప్రయాణం చేసే క్రమంలో బాలుడిని సదరు ఉపాధ్యాయురాలు శారీరకంగా వేధించిందని పోలీసులు తెలిపారు. ఉపాధ్యాయురాలు తన వాంగ్మూలంలోనూ విద్యార్థిని శారీరకంగా వేధించినట్లు అంగీకరించిందని సూరత్ సిటీ డీసీపీ భగీరథ్ గర్వి చెప్పారు. ప్రయాణించే క్రమంలో ఉపాధ్యాయురాలు, టీచర్ కలిసి రెండుహోటళ్లలో రాత్రి బస చేశారని చెప్పారు. దీంతో ఆమెపై పోక్సో చట్టం, భారత న్యాయ సంహితలోని సెక్షన్ 127 కింద కేసు నమోదు చేశామన్నారు. ఇద్దరికీ వైద్య పరీక్షలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. సూరత్ నుంచి పారిపోయే క్రమంలో రైలు ఎక్కేముందు టీచర్ తన మొబైల్ ఫోన్‌ను స్విచ్ఛాఫ్ చేసిందన్నారు. ఆ టీచర్‌కు చెందిన రెండో మొబైల్‌ను ట్రాక్‌చేయగా లొకేషన్ వివరాలు తెలిశాయని డీసీపీ పేర్కొన్నారు. ఈ టీచర్ సూరత్‌లోని పూనాగం ప్రాంతంలో ఉన్న ఒక హిందీ మీడియం పాఠశాలలో పనిచేసేది. ఈ క్రమంలోనే ఒక విద్యార్థికి ఆమె చేరువైంది. సదరు విద్యార్థికి మూడు సంవత్సరాల పాటు ప్రైవేట్ ట్యూషన్ కూడా చెప్పింది. దీంతో ఇద్దరి మధ్య సంబంధం మరింత పెరిగిందని వెల్లడైంది. ఏప్రిల్ 25న మధ్యాహ్నం ఐదో తరగతి విద్యార్థి తన ఇంటి బయట ఆడుకుంటూ అకస్మాత్తుగా అదృశ్యమయ్యాడు. సమీపంలోని సీసీటీవీ ఫుటేజీని పోలీసులు పరిశీలించగా అసలు విషయం బయట పడింది. ఈ విద్యార్థి అదృశ్యం కావడానికి కొన్ని క్షణాల ముందు, తనకు ట్యూషన్ చెప్పే ఉపాధ్యాయురాలితో మాట్లాడినట్లు వెల్లడైంది. దీనిపై అదే రోజున సూరత్‌లోని పూనా పోలీస్ స్టేషన్‌లో కిడ్నాప్ కేసు నమోదైంది. సూరత్ రైల్వే స్టేషన్‌లో రికార్డయిన సీసీటీవీ ఫుటేజీని పోలీసులు ప్రాథమిక ఆధారంగా సేకరించారు. మహిళా టీచర్, బాలుడు కలిసి అక్కడే రైలు ఎక్కినట్లు సీసీటీవీ ఫుటేజీలో స్పష్టంగా రికార్డయింది. బుక్ మై ట్రిప్ యాప్ ద్వారా ఉపాధ్యాయురాలు టూర్‌కు సంబంధించిన బుకింగ్స్ అన్నీ చేసినట్లు తేలింది.

# ఐదేళ్లలో 119 మంది వైద్యవిద్యార్థుల ఆత్మహత్య



**న్యూఢిల్లీ, మే 2:** దేశవ్యాప్తంగా గత ఐదేళ్లలో 119 మంది వైద్య విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. వీరిలో 64 మంది ఎంబీబీఎస్ అండర్ గ్రాడ్యుయేట్లు, 55 మంది పీజీ మెడికల్ విద్యార్థులు. అలాగే గత ఐదేళ్లలో 1,116 మంది వైద్య విద్యార్థులు చదువు మధ్యలోనే వదిలేశారు. వీరిలో 160 మంది అండర్ గ్రాడ్యుయేట్లు, 956 మంది పీజీ విద్యార్థులు. యునైటెడ్ డాక్టర్స్ ఫ్రంట్ (యూడీఎఫ్) నుంచి సమాచార హక్కు (ఆర్టీఐ) ద్వారా నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) ఈ సమాచారాన్ని సేకరించింది. యువ వైద్య విద్యార్థుల ఆత్మహత్యలు, వైద్య విద్యను మధ్యలోనే వదిలేయడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. కాగా, 2018 నుంచి 2022 వరకు 64 మంది ఎంబీబీఎస్, 58 మంది పీజీ విద్యార్థులు సూసైడ్ చేసుకున్నట్లు గత ఆర్టీఐ డాటా ద్వారా వెల్లడైంది. అలాగే 2020-2022 మధ్య 531 వైద్య కాలేజీల్లో సుమారు 68 మంది వైద్య విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎన్ఎంసీ గతంలో నివేదించింది. మరోవైపు యువ వైద్యులపై విద్య, వర్క్‌ల ఒత్తిడి, తగినంత విశ్రాంతి లేకపోవడం, ప్రతికూల పని వాతావరణం, పని భారం, ఎక్కువ అంచనాలు, తీవ్రమైన మానసిక ఒత్తిడి వంటివి ఆత్మహత్యలు, డ్రాపవుట్లకు ప్రధాన కారణంగా తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో పని గంటలు తగ్గించడం, వైద్య విద్యార్థులను పర్యవేక్షించడం, కౌన్సెలింగ్ ఇవ్వడం వంటి చర్యలు చేపట్టాలని సీనియర్ వైద్యులు సూచించారు. కాగా, మెడికల్ కాలేజీల నిర్వహణ, నిర్లక్ష్యంపై ఎంబీబీఎస్, పీజీ వైద్య విద్యార్థులు సుమారు 1680 ఫిర్యాదులు చేసినట్లుఈ సమాచారం ద్వారా వెలుగులోకి వచ్చింది. దీంతో మెడికల్ కాలేజీల్లో వేధింపులు, ర్యాగింగ్‌ను నిరోధించాల్సిన అవసరాన్ని ఇది స్పష్టం చేస్తున్నదని సీనియర్ డాక్టర్లు వెల్లడించారు.

# ఒడిశా కిట్‌లో విద్యార్థిని అనుమానాస్పద మృతి



**కటక్, మే 2:** ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లోని ప్రతిష్ఠాత్మక కళింగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ టెక్నాలజీ (కిట్)లో మరో విషాదం చోటుచేసుకుంది. యూనివర్సిటీకి చెందిన బాలికల హాస్టల్ గదిలో నేపాల్ విద్యార్థిని గురువారం సాయంత్రం విగతజీవిగా కనిపించింది. మూడు నెలల వ్యవధిలో ఇదే క్యాంపస్‌లో నేపాల్ విద్యార్థిని మృతి చెందడం ఇది రెండోసారి కావడంతో తీవ్ర కలకలం రేపుతోంది. పోలీసుల కథనం ప్రకారం మృతురాలు కంప్యూటర్ సైన్స్ బీటెక్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఆమె స్వస్థలం నేపాల్ రాజధాని కఠ్మాండుకు సుమారు 135 కిలోమీటర్ల దూరంలో ఉన్న బీర్‌గంజ్. గురువారం రాత్రి 8 గంటల సమయంలో బాలికల హాస్టల్‌లోని తన గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకున్న స్థితిలో ఆమె మృతదేహాన్ని గుర్తించారు. వెంటనే యూనివర్సిటీ అధికారులు, పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, ఫోరెన్సిక్ నిపుణులు ఆధారాలు సేకరించారు. భువనేశ్వర్‌కటక్ పోలీస్ కమిషనర్ సురేష్ దేవ్‌దత్తా సింగ్ మాట్లాడుతూ, 'కిట్ యూనివర్సిటీలో నేపాల్‌కు చెందిన విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నట్టు మాకు సమాచారం అందింది. మేం సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించాం. శాస్త్రీయ బృందం వచ్చి అవసరమైన ఆధారాలు సేకరించింది. సమగ్ర విచారణ జరుపుతాం. మృతురాలి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాం. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఎయిమ్స్‌కు తరలించాం' అని తెలిపారు. పోస్ట్‌మార్టం నివేదిక వచ్చిన తర్వాతే మృతికి గల స్పష్టమైన కారణాలు తెలుస్తాయని, ప్రస్తుతానికి దీనిని అనుమానాస్పద మృతి గా పరిగణిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. గత మూడు నెలల్లో కిట్ యూనివర్సిటీలో నేపాల్ విద్యార్థిని మరణించడం ఇది రెండోసారి. ఫిబ్రవరి 16న బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్న ప్రకృతి లమ్సాల్ అనే నేపాల్ విద్యార్థిని కూడా ఇదే విధంగా హాస్టల్ గదిలో విగతజీవిగా కనిపించింది. ఆ సమయంలో సహచర విద్యార్థి ఒకరు తనను లైంగికంగా వేధించారని యూనివర్సిటీ ఇంటర్నేషనల్ రిలేషన్స్ ఆఫీస్‌కు ఫిర్యాదు చేసినట్టు తర్వాత వెలుగులోకి వచ్చింది. అయితే, యూనివర్సిటీ యాజమాన్యం తక్షణ చర్యలు తీసుకోలేదని, ఇది 'తీవ్ర నిర్లక్ష్యం' అని జాతీయ మానవ హక్కుల కమిషన్ ఎన్‌హెచ్‌ఆర్‌సీ వ్యాఖ్యానించింది. విద్యార్థి సంఘాలు, పౌర సమాజం తీవ్రంగా స్పందించడంతో, ఆమె మరణించిన మరుసటి రోజే నిందితుడిని అరెస్టు చేశారు. బీజేడీ నేత, మాజీ ఎంపీ అచ్యుత సమంత స్థాపించి, నిర్వహిస్తున్న ఈ యూనివర్సిటీపై అప్పట్లో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. నేపాల్ విదేశాంగ మంత్రి అర్జు రాణా దేవ్బా ఈ ఘటనపై స్పందించారు. నిజానిజాలు నిగ్గు తేల్చేందుకు భారత ప్రభుత్వం, ఒడిశా ప్రభుత్వం, ఢిల్లీలోని నేపాల్ రాయబార కార్యాలయ ఉన్నతాధికారుల ద్వారా దౌత్యపరమైన చర్యలు ప్రారంభించినట్టు సోషల్ మీడియా వేదిక ఎక్స్ ద్వారా తెలిపారు. 'ప్రిసా సాహ్ మరణం మమ్మల్ని తీవ్రంగా కలచివేసింది. ఆమె ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నాను, ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను' అని ఆమె పేర్కొన్నారు.

# నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా రాహుల్‌కు నోటీసులు

**న్యూఢిల్లీ, మే 2:** నేషనల్ హెరాల్డ్ మనీలాండరింగ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు ఢిల్లీ కోర్టు శుక్రవారం నోటీసులు జారీ చేసింది. నేషనల్ హెరాల్డ్ కేసుకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఈడీ ఛార్జిషీట్‌ను రౌస్ అవెన్యూ కోర్టు విచారణకు స్వీకరించింది. చార్జిషీట్‌కు సంబంధించిన కేసును విచారించడానికి నిందితులైన సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సహా ఇతర నిందితులు కోర్టుకు హాజరు కావాలని కోర్టు ఆదేశించింది. ఈ మేరకు తదుపరి విచారణను ఈ నెల 8వ తేదీకి కోర్టు వాయిదా వేసింది. నేషనల్ హెరాల్డ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ 2025 ఏప్రిల్ 9న మనీలాండరింగ్ నిరోధక చట్టంలోని సెక్షన్లు 3మరియు 4 కింద చార్జిషీట్ దాఖలు చేసింది. ఈ కేసులో సోనియా గాంధీని ఏ1గా, రాహుల్ గాంధీని ఏ2గా ఈడీ చేర్చింది. కాంగ్రెస్ నాయకులు సామ్ పిత్రోడా, సుమన్ దూబే వంటి వారు కూడా నిందితులుగా ఉన్నారు. నేషనల్ హెరాల్డ్ అనేది 1938లో జవహర్‌లాల్ నెహ్రూ స్థాపించిన చారిత్రక వార్తాపత్రిక. యంగ్ ఇండియన్ లిమిటెడ్ వైఐఎల్ ద్వారా ఏజేఎల్‌కుచెందిన రూ.2,000 కోట్ల విలువైన ఆస్తులను కేవలం రూ.50లక్షలకు సోనియా, రాహుల్‌గాంధీ కొనుగోలు చేశారని ఈడీ అభియోగాలు మోపింది. వైఐఎల్‌లో రాహుల్‌కు 38శాతం,



సోనియాకు 38శాతం షేర్లు ఉన్నాయి. ఏజేఎల్‌కు చెందిన 99శాతం షేర్లను యంగ్ ఇండియన్ లిమిటెడ్‌కు బదిలీచేశారు. ఈ లావాదేవీ మనీలాండరింగ్‌లో భాగమన్నది ఈడీ ప్రధాన ఆరోపణ.

# నాక్కూడా బెదరింపుకాల్స్ వస్తున్నాయ్..

## కర్ణాటక సీఎం సిద్దరామయ్య



**బెంగళూరు, మే 2:** తనకు కూడా బెదిరింపు కాల్స్ వస్తున్నాయని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అన్నారు. బెదిరింపులకు పాల్ప డుతున్న వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరినట్లు చెప్పారు. స్పీకర్ యుటి ఖాదర్‌కు బెదిరింపు కాల్ వచ్చిందంటూ విలేకరుల ప్రశ్నకు సీఎం ఈ విధంగా స్పందించారు. నాకు కూడా బెదిరింపు కాల్స్ వస్తున్నాయి. ఏం చేయాలి పోలీసులకు సమాచారం ఇచ్చాము. బెదిరింపు కాల్స్ చేస్తున్న వారిని కనుగొని వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరాని సీఎం సిద్ధరామయ్య విలేకరులతో అన్నారు. అంతేకాదు, మంగళూరులో జరిగిన రౌడీషీటర్ సుహాస్ శెట్టి హత్య ఘటన నిందితులను వీలైనంత త్వరగా గుర్తించి అరెస్టు చేయాలని పోలీసులను ఆదేశించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. మంగళూరులో రౌడీ షీటర్ సుహాస్ శెట్టి దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. ఐదుగురు వ్యక్తులు కొడవల్లు, కత్తులతో నడిరోడ్డుపై నరికి చంపేశారు. ఈ ఘటనతో మంగళూరులో పోలీసులు హై అలర్ట్ ప్రకటించారు. సిటీ పోలీసు స్టేషన్ పరిధిలో ప్రజలు గుమిగూడడాన్ని నిషేధించారు. ఊరేగింపులు, నినాదాలు చేయడం,ఆయుధాలను పట్టుకెళ్లడాన్ని నిషేధించారు. సుహాస్‌ను పథకం ప్రకారమే హత్య చేసినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. అయితే ఆమర్డర్ వెనుక ఉన్నకారణం ఇంకా తెలియరాలేదు.

# రెండునెలలపాటు ఆహారం నిల్వచేసుకోండి

## పీవోకే యంత్రాంగం ప్రజలకు సూచనలు



**ఇస్లామాబాద్, మే 2:** పహల్గాం ఉగ్రదాడితో భారత్ పాకిస్థాన్‌లమధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కశ్మీర్ వివాదాన్ని పూర్తిగారూపుమాపాలంటే పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను పూర్తిగా స్వాధీనంచేసుకోవాలని అంతర్జాతీయ స్థాయిలో భారత్‌కు సూచనలు వినిపిస్తున్నాయి. ఇలాంటి తరుణంలో ఆహారం నిల్వచేసుకోవాలంటూ స్థానికులను పీవోకే యంత్రాంగం అప్రమత్తంచేసింది. రెండునెలలకు సరిపగా ఆహారం నిల్వచేసుకోవాలని వాస్తవాధీన రేఖకు సమీపంలో ఉన్న 13 నియోజకవర్గాలప్రజలకు సూచనలు చేసామని చౌద్రీ అన్వర్ ఉల్‌హక్ స్థానిక అసెంబ్లీలో శుక్రవారం తెలిపారు. స్థానిక ప్రభుత్వం రూ.100 కోట్లతో ఎమర్జెన్సీ ఫండ్‌ను ఏర్పాటుచేసింది. ఆహారం ఔషధాలు ఇతర కనీస అవసరాల సరఫరాకు ఎలాంటి ఆటంకం కలగకుండాచూసుకునేందుకు ఈమొత్తం కేటాయించినట్లు ఉల్‌హక్ తెలిపారు. స్వాతంత్ర్యం సిద్ధించిన తొలినాళ్లలోనే దొంగదెబ్బతో పీవోకేను తన నియంత్రణలోకి తీసుకున్న పాకిస్థాన్ ఆప్రాంత అభివృద్ధిని గాలికొదిలేసింది. ఇండియాపై విద్రోహచర్యలకు పాల్పడేందుకు ఉపయోగించే ప్రదేశంగానే పీవోకేను పాక్‌చూస్తోంది. పీవోకే ప్రధానమంత్రి పీఠం అధిరోహించినవారు ఇస్లామాబాద్ సర్కారు చేతుల్లో కీలుబొమ్మగానే మిగిలిపోతున్నారు. ఫలితంగా స్థానికుల హక్కులకు రక్షణ లేకపోతోంది. దివాలా అంచున ఉన్న పాకిస్థాన్‌ను స్థానిక తిరుగుబాట్లు, వరుస ఉగ్రదాడులు సతమతంచేస్తున్నాయి. ఈపరిస్థితుల్లో అక్కడ భారత్ అనుకూల వాదం పెరుగుతోంది. భారత సంతతికి చెందిన బ్రిటిష్ ఎంపి లార్డ్ మేఘనాథ్ ఇటీవల మాట్లాడుతూ కాశ్మీర్ వివాదం రూపుమాపాలంటే ఆక్రమిత కాశ్మీర్‌ను పూర్తిగా భారత్ స్వాధీనంచేసుకోవాలని భారత ప్రభుత్వానికి సూచించారు. అదొక్కటే అన్ని సమస్యలకు పరిష్కారం అన్నారు. ఉగ్రవాదులను శిక్షించేందుకు ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ఉండాలంటే భారత్ కఠినంగా జవాబివ్వాలనికోరారు. పహల్గాంలో పర్యాటకులపై జరిగిన దాడి చాలాక్రూరమైనదని ఆవేదన వ్యక్తంచేసారు. కశ్మీర్ వివాదంలో ఈఘటనే చివరిది కావాలని ఆశాభావం వ్యక్తంచేసారు. ప్రధాని మోడీ నాయకత్వంలో భారత ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందన్న ధీమా వ్యక్తం చేసారు.

# దేశరాజధానిలో వర్షబీభత్సం

**న్యూఢిల్లీ మే 2:** దేశ రాజధాని ఢిల్లీలో వర్షం బీభత్సం సృష్టించింది. శుక్రవారం తెల్లవారుజామున ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో రోజువారీ పనులకు ఆటంకం కలిగింది. ఏకధాటిగా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలయమం అయ్యాయి. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. భారీ వర్షం కారణంగా ఢిల్లీలో విమానాశ్రయంలో విమానాల రాకపోకలకు అంతరాయం కలిగింది. సుమారు 100 విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. మరో 3 విమానాలను దారి మళ్లించినట్లు అధికారులు వెల్లడించారు. రెండు విమానాలను జైపుర్‌కు, ఒకటి అహ్మదాబాద్‌కు దారి మళ్లించినట్లు తెలిపారు. ఉత్తర భారతంలోని పలు ప్రాంతాల్లో కూడా విమాన సేవలకు అంతరాయం కలిగిందని ఎయిర్ ఇండియా వెల్లడించింది.రానున్న కొన్ని గంటల్లో ఢిల్లీలో ఉరుములు మెరుపులతో కూడిన అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. రాజధాని ప్రాంతానికి రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఇప్పటివరకూ నలుగురు మృతి చెందినట్లు తేలింది. బలమైన ఈ దురుగాలులతో ఢిల్లీలో చెట్లు నేలకొరిగాయి. ద్వారకలోని ఖర్ఖరి



కెనాల్ గ్రామంలోని పొలంలో నిర్మించిన ట్యూబ్‌వెల్ గదిపై చెట్లు విరిగి పడిన ఘటనలో నలుగురు మృతిచెందారు. ఒకరు గాయపడ్డారు. మృతులను 26 ఏళ్ల జ్యోతి, ఆమె ముగ్గురు పిల్లలుగా గుర్తించారు. ఆమె భర్త అజయ్ స్వల్ప గాయాలతో బయట పడినట్లు ఢిల్లీ పోలీసులు తెలిపారు.

# కేంద్ర మాజీ మంత్రి గిరిజా వ్యాస్ మృతి

## ఆమె లేని లోటు కాంగ్రెస్ పూడ్చుకోవడం కష్టం: టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్

**హైదరాబాద్,మే 2,ప్రభాతవార్త:** రాజస్థాన్‌కి చెందిన కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు గిరిజా వ్యాస్ (79) గురువారం సాయంత్రం మృతి చెందారు. గత మార్చి 31న ఆమె నివాసంలో పూజా కార్యక్రమం నిర్వహిస్తుండగా దురదృష్టవశాత్తూ ఆమె చీరకు మంటలు అంటుకున్నాయి. మంటల్లో తీవ్రంగా గాయపడిన గిరిజా వ్యాస్‌ను అత్యవసరంగా అహ్మదాబాద్లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అప్పటి నుండి ఆమె చికిత్స పొందుతున్నారు. తీవ్రంగా కాలిన గాయాల ప్రభావంతో ఆమె ప్రాణాలను కోల్పోయారు. ఆమె పివి నరసింహారావు మంత్రివర్గంలో కేంద్రమంత్రిగా సేవలందించారు. మహిళల హక్కుల కోసం, సామాజిక న్యాయ స్థిరీకరణ కోసం ఆమె ఎంతో కృషి చేశారు. ఆమె నిఖార్సైన నాయకత్వం, పార్లమెంటరీ విధానాలపై ఉన్న లోతైన అవగాహన రాజకీయ వర్గాల్లో విశేష గౌరవాన్ని పొందింది. గిరిజా వ్యాస్ రచయితగా కూడా ప్రసిద్ధి చెందారు, ఆమె రచనల ద్వారా సమాజంలో అభివృద్ధి, మార్పు సాధ్యమని నమ్మకం కలిగించారు. రాజస్థాన్ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలుగా సమర్థవంతంగా పనిచేసిన నాయకత్వం కలిగిన గిరిజవ్యాస్ మరణం కాంగ్రెస్ కటుబానికి తీరని లోటని టిపిసిసి చీప్ మహేష్ కుమార్‌గౌడ్ అన్నారు. గాంధీభవన్‌లో ఆయన మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ గిరిజా వ్యాస్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ గిరిజా వ్యాస్ మరణం బాధాకరం డాక్టర్ గిరిజా వ్యాస్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మాజీ కేంద్ర మంత్రి ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నా అని అన్నారు. 1985లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన ఆమె 1991, 1996, 1999లో ఉదయపూర్ నుంచి హ్యాట్రిక్ విజయాలతో లోక్‌సభ ఎంపీగా ఎన్నికయ్యారని గుర్తుచేసుకొన్నారు. పీవీ నరసింహారావు, మన్మోహన్ సింగ్ హయాంలో ఆమె కేంద్ర మంత్రిగా బాధ్యతలను నిర్వహించారు. రాజస్థాన్ కాంగ్రెస్ చీఫ్‌గా పనిచేసి కాంగ్రెస్‌పార్టీ గెలుపునకు దోహదపడ్డారని కొనియాడారు.

పశ్చిమగోదావరి,ఏలూరు వార్త

# బాలికల భవితకు కిశోరి వికాసం..

## యుక్త వయస్సు బాలికల కొరకు వేసవి శిక్షణా కార్యక్రమం..
## కిశోరి వికాసంపై పోస్టర్ ను విడుదల చేసిన జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి..



**ఏలూరు,మే,2: ప్రభాతవార్త :** యుక్తవయస్సులో ఉన్న బాలికలు, మహిళల ఉజ్వల భవిష్యత్ కు కిశోరి వికాసం కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి పేర్కొన్నారు. కౌమార బాలికల సాధికారిత లక్ష్యంగా జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన కిశోరీ వికాశంపై గోడపత్రికను శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఆవిష్కరించారు. ఈనెల 2వ తేదీ నుంచి జూన్ 10 వరకు వివిధ శిక్షణా కార్యక్రమాలను యుక్తవయస్సు బాలికలకు అందిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివిధ శాఖలను సమన్వయం చేసుకుంటూ జిల్లాలో ఈ ప్రత్యేక సమ్మర్ క్యాంపెయిన్ గ్రామ, వార్డు స్థాయిలో కిశోరీ బాలికల సాధికారత కొరకు ఆరు అంశాలను చర్చిస్తూ ముందుకు సాగే విధంగా పుస్తకాలను రూపొందించడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా యుక్తవయస్సు బాలికలకు విద్య ప్రాముఖ్యత, సంపూర్ణ ఆరోగ్యం, రుతుపరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, ఉన్నత విద్య, కెరీర్ మార్గదర్శనం, రక్షణ అంశాలు, బాల్య వివాహాల వలన కలిగే దుష్ప్రభావాలు, సైబర్ భద్రత, పోక్సో చట్టం వంటి అంశాల్లో శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. బాలల సంరక్షణ కు అవసరం అయిన టోల్ ఫ్రీ నెంబర్ చైల్డ్ హెల్ప్ లైన్ 1098 సేవల వినియోగం, స్వీయ రక్షణ, ఆర్థిక నిర్వహణ, నాయకత్వం, నిర్ణయాధికారం, లింగ వివక్ష, పునరుత్పత్తి ఆరోగ్యం, శారీరక వ్యాయామం, యోగా వంటి పలు అంశాలపై వారికి వేసవి సెలవులలో అంగన్వాడీ,సచివాలయ కేంద్ర పరిధిలో నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. గ్రామ/వార్డు స్థాయి వనరుల బృందం, అంటే మహిళా పోలీసు, అంగన్వాడీ కార్యకర్త, ఏ.ఎన్.ఎం, వి.ఓ నాయకురాలు/సభ్యురాలు, సి.ఆర్పి లేదా విద్యా కార్యదర్శి, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన క్యాలెండర్ ప్రకారం నిర్దేశిత బోధన ఆయా అంశాల మీద సంబంధిత రిసోర్స్ పర్సన్ ద్వారా అవగాహనా తరగతులు (గ్రూపు చర్చలు) నిర్వహిస్తారన్నారు. సంబంధిత శాఖల జిల్లా అధికారులు తమ నియంత్రణలో పని చేసే ఫీల్డ్ స్థాయి సిబ్బందికి అవసరమైన సూచనలు జారీ చేయాలన్నారు. ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, గ్రామ, వార్డు స్థాయి బాలల సంక్షేమ, సంరక్షణ కమిటీ సమావేశాలు శుక్రవారం అన్ని సచివాలయాల్లో తప్పనిసరిగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందుకు సంబంధించి మహిళా పోలీసులు సదరు కమిటీ కి మెంబర్ కన్వీనర్ గా ప్రధాన భూమిక పోషిస్తారని తెలిపారు. ప్రతిరోజూ నిర్వహించే కార్యక్రమాలను ఈసాధన పోర్టల్ లో అప్లోడ్ చేయాలి, ఈ వేసవి కార్యక్రమం మొత్తం విజ్ఞానవంతం గా,ఆనందోత్సాహంగా ఉండాలని దీనిలో ప్రతీ కిశోర బాలిక పాల్గొనేలా చూడాలనీ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేసినారు. కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారత అధికారి పి. శారద,జిల్లా బాలల సంరక్షణా అధికారి డాక్టర్ సి హెచ్. సూర్య చక్రవేణి, డిపిహెచ్ఎన్ఓ జ్యోతి, పిడి ఆఫీస్ ఈవో వి. మల్లిక, చైల్డ్ హెల్ప్ లైన్ కో ఆర్డినేటర్ రాజు, డి సి పి యు సిబ్బంది జాహ్నవి, సునీత, మాధవి, రాజ కుమార్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాబందుల ముఠా పార్టీకి అధ్యక్షుడు జగన్- మంత్రి రామానాయుడు



**ప్రభాతవార్త పాలకొల్లు:** రాబందుల ముఠా పార్టీకి అధ్యక్షుడు జగన్ అని, వైసీపీకి కాదని రాష్ట్ర జల వనరుల అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో మన మంత్రి మన రామానాయుడు కార్యక్రమంలో కోటి అరవై లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన సందర్భంగా మీడియాతో మాట్లాడారు. జగన్ తీరు చూస్తే శవ రాజకీయాలు చేస్తున్నట్టుగా కనిపిస్తుందని, ఎక్కడ ఎవరు చనిపోయిన అక్కడకు వాలిపోతున్నారన్నారు. సింహాచలం ఆలయంలో ప్రకృతి విపత్తు వల్ల జరిగిన ప్రమాదాన్ని కూడా శవ రాజకీయంగా మాట్లాడడం సరికాదన్నారు. గుడ్ల కమ్మ, అన్నమయ్య ప్రాజెక్టు గేట్లు కొట్టుకుపోయిన సంఘటనలో మృతులు, తిరుపతిలో ఆక్సిజన్ అందక మృతిచెందిన సమయాల్లో జగన్ కనీసం సంఘటన ప్రాంతాలకు కూడా వెళ్లలేదన్నారు. గత ఐదేళ్ల పాలనలో ఆంధ్రప్రదేశ్ తగలబడుతుంటే, నీరో చక్రవర్తిలా మద్యం డబ్బులు లెక్కపెట్టుకున్న జగన్ కి, జనాల సమస్యలపై మాట్లాడే అర్హత లేదన్నారు. భారీకేడ్లు, పరదాలు, 144 సెక్షన్, 30 యాక్టులు, ముందస్తు అరెస్టులతో, తాడేపల్లి కి బందీగా నాడు జగన్ పాలన సాగిందన్నారు. అమరావతి రాజధాని పునర్నిర్మాణం, రేపటి రోజు దేశ చరిత్రలో చారిత్రాత్మకంగా నిలిచిపోతుందని, ప్రధాని మోదీ చేతుల మీదగా ప్రారంభం జరగబోతుందన్నారు. ఈ కార్యక్రమానికి లక్షలాదిమంది ప్రజలు స్వచ్ఛందంగా తరలి వస్తున్నారన్నారు.. అమరావతి ఉద్యోగ, ఉపాధి కల్పనా కేంద్రంగా, సెల్ఫ్ ఫైనాన్స్ రాజధానిగా, లక్ష కోట్ల ఆదాయం అందించబోతుందన్నారు. రాజధాని రైతుల త్యాగంతో, ప్రతి పౌరుడు, గర్వించేలా ప్రపంచస్థాయి రాజధానిని చంద్రబాబు నిర్మించేందుకు శ్రమిస్తున్నారని మంత్రి రామానాయుడు తెలిపారు. విధ్వంస పాలకుడి చేతిలో శిధిలమైన, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి, స్వప్న సాకారం దిశగా అడుగులు వేస్తుందన్నారు.

# అంతర్జాతీయ కార్మిక దినోత్సవం




**నరసాపురం ప్రభాతవార్త :** అంతర్జాతీయ కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన వారోత్సవాల్లో భాగంగా సందర్భంగా ఈ రోజు అనగా శుక్రవారం మధ్యాహ్నం నర్సాపురం సిపిఎం కార్యాలయం మీటింగ్ హాల్ లో క్రాంతి ఆటో యూనియన్ ఓనర్ అండ్ డ్రైవర్స్ ప్రెసిడెంట్ యస్ స్టాన్లీ కుమార్ ఆధ్వర్యంలో కార్మిక చట్టం, అసంఘటిత రంగంలోని కార్మికులకు న్యయసేవాలు అనే అంశంపై న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి నర్సాపురం మండల న్యాయ సేవాధికార సంస్థ నామినేటెడ్ సభ్యులు మరియు న్యాయవాదులు చల్లా దానయ్యానాయుడు, వై. దేవేంద్ర ఫణీకర్ మరియు పట్టణ మహిళా సబ్ ఇన్స్పెక్టర్ జయ లక్ష్మి పాల్గొని మాట్లాడుతూ, అందరూ కార్మిక చట్టం, బాల కార్మికుల చట్టం పై అవగాహన కల్గిఉండాలి, డ్రైవర్లు కు తప్పకుండా లైసెన్స్, ఇన్స్యూరెన్స్ కలిగివుండాలి. మొబైల్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకుండా శ్రద్ధ వహించాలన్నారు. వార్షిక ఆదాయం 3 లక్షల లోపు ఉన్న వారు ఉచిత న్యాయ సహాయము పొందే అవకాశం ఉందని, వృద్ధ తల్లిదండ్రులను చూడవలసిన బాధ్యత వారి పిల్లలకు ఉంది వారిని చూడకపోతే తల్లితండ్రులు ఆర్డీవో గారి వద్ద అర్జీ చేసుకుని పిల్లల నుండి భరణము పొందవచ్చు అన్ని జులై 5న జరుగు జాతీయ లోకదాలతలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. నర్సాపురం టౌన్ ఎస్ ఐ సిహెచ్ జయలక్ష్మి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ మైనర్ బాలికలు బ్యాగ్ లు పట్టుకుని ఆటో ప్రయాణం కోసం వస్తే ఆటో డ్రైవర్లు, ఓనర్లు ప్రత్యేక శ్రద్ధ వహించి చర్యలు తీసుకునేలా పోలీసులకు సహకరించాలి. మైనర్ బాలికల పట్ల ప్రతీ ఒక్కరూ జాగ్రత్తగా వ్యవరించాలి. ప్రస్తుతం వయస్సు తారతమ్యం లేకుండా అత్యాచారాలకు గురికావడం తరచూ వింటూనే ఉంటున్నాం. అలాటివారిపై ఫోక్స్ చట్టం కఠినంగా చట్టం ప్రకారం జైలు శిక్ష అనుభవించవాల్సొస్తుంది. ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని ప్రయాణం చేస్తే ఫైన్ విధించి, కేసులు పెట్టడం జరుగుతుంది. మీ కుటుంబాలతో సంతోషంగా జీవించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పి ఎల్ వి లు ఎం. విజయకుమార్, బొడ్డు కృష్ణ భగవాన్, నల్లి ప్రతిభారాజీ, బి. శ్యామ్ కుమార్ ఆటో యూనియన్ మెంబర్లు పాల్గొన్నారు.

# ఉదయ భాస్కర్‌కి దాసరి సేవ రత్న అవార్డు




**పాలకొల్లు ప్రభాతవార్త :** సీనియర్ జర్నలిస్ట్ ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ పశ్చిమగోదావరి జిల్లా ఉపాధ్యక్షులు జిల్లా ఉత్తమ జర్నలిస్ట్ అవార్డు గ్రహీత గుమ్ములూరు ఉదయ భాస్కర రావు కి దాసరి సేవ రత్న అవార్డు అందుకున్నారు. దర్శకరత్న దాసరి నారాయణరావు జన్మదినాన్ని పురస్కరించుకొని హైదరాబాదు ప్రసాద్ ల్యాబ్ లో జరిగిన దాసరి ఫిలిం అవార్డు సభలో సినీ నటులు మురళీమోహన్ హీరో సుమన్ సాయి కుమార్ నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణ అందజేశారు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఈ కార్యక్రమంలో దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ నిర్మాత దిల్ రాజ్ విజయేంద్ర ప్రసాద్ దర్శకులు రేలంగి నరసింహారావు అనిల్ రావిపూడి బి గోపాల్ హీరోయిన్ దివ్యవాణి కోర్టు చలనచిత్ర దర్శకులు నిర్మాతలు నటుడు దర్శకుడు ధనరాజ్ అవార్డు గ్రహీతలు హాజరైనారు ఈ కార్యక్రమానికి జర్నలిస్ట్ ప్రభు స్వాగతం పలికారు. దాసరి అవార్డు గ్రహీత అయిన జర్నలిస్ట్ ఉదయ భాస్కర రావు కి మహారాష్ట్ర బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ సత్యనారాయణ ప్రముఖ నటులు కాపినిస్తే కార్టూ నిస్ట్ తాడి బలరాం నటుడు సినీ దర్శకుడు ఆకుమర్తి బాబురావు ఈ సందర్భంగా మహారాష్ట్ర బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ గాలి దేరి సత్యనారాయణ మాట్లాడుతూ రంగస్థలం నటుడు దర్శకుడు సీనియర్ జర్నలిస్ట్ అయిన ఉదయ భాస్కర్ కి దాసరి సేవ రత్న ఫిలిం అవార్డు రావటం పట్ల ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నాను అన్నారు

# ఎండ వడగాల్పులను తేలికగా తీసుకోవద్దు



**తణుకు/ఇరగవరం, ఏప్రిల్ 30 ( ప్రభాత వార్త) :** నడి వేసవిలో వీస్తున్న వడగాల్పులను తేలికగా తీసుకోవద్దని, సత్వర చికిత్స చేయకపోతే ప్రాణాంతకం కావచ్చని ఇరగవరం మండల వైద్యాధికారి యార్లగడ్డ మౌనిక అన్నారు. ఇరగవరం పిహెచ్సి తరఫున గత రెండు రోజులుగా అసానిక వ్యవసాయ కూలీలకు ఓఆర్ఎస్ సాచెట్స్ ను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు ప్రభాతవార్తతో మాట్లాడుతూ సాధారణ స్థితి కంటే అధికంగానే ఎండలు కాస్తున్నాయని దీనివల్ల వడగాల్పులు పెరిగే అవకాశం ఉందని ఒక్కోసారి 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతను పెరుగుతున్నాయి అన్నారు. దీనివల్ల ఎండలో తిరిగే వారు తరచూ వడదెబ్బకు గురయ్య ప్రమాదం ఉందన్నారు. ఈ సందర్భంగా తప్పనిసరి ఎండలో ప్రయాణం చేసేవారు పొలాల్లో పని చేసుకునేవారికి కొన్ని సూచనలు చేశారు. హైడ్రేషన్ కు గురికాకుండా ప్రజలు రోజూ 2-3 లీటర్ల నీళ్ళు తాగాలని ఇంకా అవకాశం ఉంటే నిమ్మరసం, కొబ్బరి నీళ్లు, ఓఆర్ఎస్ వంటివి తీసుకోవాలన్నారు. అలాగే తేలికైన, వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలని తెల్లని లేదా లేత రంగులు ఎంచుకోవాలన్నారు. ముఖానికీ సన్‌స్క్రీన్ ఉపయోగించి చర్మాన్ని సూర్యకిరణాల నుండి రక్షించుకోవాలన్నారు. మధ్యాహ్నం బయటకు వెళ్లే సమయంలో తలపాగా లేదా గొడుగు, టోపీ, గొడుగు లేదా స్కార్ఫ్ ఉపయోగించాలని తెలిపారు. తాజా పండ్లు, కూరగాయలు, సలాడ్లు తీసుకోవాలని, . జంక్ ఫుడ్, జిడ్డుగల ఆహారం మానేయాలని సూచించారు. వడదెబ్బ తగిలితే తలతిరగడం, వాంతులు, అధిక చెమటలు వంటి హీట్ స్ట్రోక్ వంటి లక్షణాలు కనిపిస్థాయిని అపుడు వెంటనే వైద్య సహాయం తీసుకోవాలని తెలిపారు. శరీర ఉష్ణోగ్రత 40°%C (104°F ) లేదా అంతకంటే ఎక్కువగా పెరిగే ప్రమాదకరమైన పరిస్థితి. ఇది వైద్యపరమైన అత్యవసర స్థితి, దీనిని వెంటనే చికిత్స చేయకపోతే ప్రాణాంతకం కావచ్చని వివరించారు.

# రాష్ట్ర మన్యం బంద్ విజయవంతం



**వేలేరుపాడు, ఏప్రిల్ 2, ప్రభాత వార్త :** ఏజెన్సీ స్పెషల్ డిఎస్సి తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేయాలని, షెడ్యూల్ ఏరియా ఆదివాసి ప్రాంతంలో 100% రిజర్వేషన్ నియామక చట్టం చేయాలని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేయాలని చేపట్టిన బంద్ మండలం లో ప్రశాంతంగా జరిగింది. ముందుగా వేలేరుపాడు నుండి భూదేవిపేట వరకు బైక్ ర్యాలీ జరిగింది. అనంతరం అంబేద్కర్ సెంటర్లో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మడివి దుర్గారావు అధ్యక్షతన సభ జరిగింది. ఈ సందర్భంగా గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కారం దారయ్య, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ధర్ముల రమేష ఇది మెగా డీఎస్సీ కాదు దగా డీఎస్సీ అని విమర్శించారు. జీవో నెంబర్ 3 కి ప్రత్యామ్నాయంగా ఏజెన్సీ 100% ఉద్యోగ నియామక చట్టం తెస్తానని ప్రకటించి మోసం చేశారని మండిపడ్డారు. ఐదో షెడ్యూల్ ఏరియా 100% రిజర్వేషన్ అమలుపై స్పష్టత ఇవ్వాలి అన్నారు. 94%నివాసం ఉంటున్న ఎస్టీలకు కేవలం ఆరు శాతం,6% నివాసం ఉంటున్న గిరిజనేతరులకు 94% పోస్టులు కేటాయించడం అంటే ఆదివాసులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పున పరిశీలన చేయాలని, ఏజెన్సీ ఏరియాలో ఆదివాసులకు 100% ఉద్యోగ నియామక చట్టం చేయాలని డిమాండ్ చేశారు. సత్వరమే ప్రభుత్వం పునరాలోచన చేయకపోతే ఆదివాసులందరినీ ఐక్యం చేసి రాష్ట్రవ్యాప్త ఉద్యమంగా మారుస్తామని హెచ్చరించారు. బందుకు సహకరించినవారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం నాయకులు కారం వెంకట్రావు, కరటం ప్రకాష్ గిరిజన సమైక్య జిల్లా నాయకులు పిట్టా వీరయ్య, బంధం అర్జున్ ఆదివాసీ సంక్షేమ పరిషత్ అధ్యక్షులు సోడే సీతారామయ్య, నాగేంద్ర బాబు,నాగు, పండు, కంగాల గంగరాజు, మధు, ప్రేమ్, తదితరులు పాల్గొన్నారు.

# మావుళ్ళమ్మను దర్శించుకున్న
## కలెక్టర్ చదలవాడ నాగరాణి


దేవాలయం సిబ్బంది నల్లం లోకనాదం, దేవాలయం ఇన్స్పెక్టర్ యు.రామకృష్ణ, వెంకటేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

**భీమవరం మే 2 ప్రభాతవార్త :** జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి భీమవరం శ్రీమావుళ్ళమ్మను సందర్శించారు. ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ పూర్ణకుంభంతో స్వాగతం పలికి మంగళ వాయిద్యాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించి అంతరాలయానికి తీసుకొని వెళ్లారు. గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వదించి, తీర్థాన్ని అందజేశారు. అనంతరం ఆలయ ఆశీర్వచన మండపములో వేద పండితులుఆశీర్వచనాలు పలికి తీర్థప్రసాదాలను, అమ్మవారి చిత్రపటాన్ని అందించారు. కార్యక్రమం లో వేద పండితులు,

# చాట్రాయి లో సబ్ పోస్ట్ ఆఫీస్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్

**ప్రభాతవార్త చాట్రాయి**
మండల కేంద్రమైన చాట్రాయిలో సబ్ పోస్ట్ ఆఫీస్ ఏర్పాటు చేసేందుకు పోస్టల్ ఉన్నతాధికారులు గ్రీన్ సిగ్నల్ చెప్పారు. సుమారు 25 సంవత్సరాలు నుండి చాట్రాయిలు సబ్ పోస్ట్ ఆఫీస్ ఏర్పాటు చేయాలని మండల ప్రజలు అనేకమార్లు అర్జీలు పెట్టారు. దీనిపై కేంద్ర మంత్రుల దృష్టికి కూడా గతంలో ఎన్నో మార్లు తీసుకొచ్చినప్పటికీ ప్రయోజనం కలగలేదు. కానీ చాట్రాయి మండల ప్రజల కల త్వరలోనే నెరవేరే అవకాశాలు కనపడుతున్నాయి. పోస్టులు ఉన్నతాధికారులు దీనిపై పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించగా సబ్ పోస్ట్ ఆఫీస్ అవసరం ఎంతైనా ఉందని కేంద్ర ప్రభుత్వానికి నివేదిక అందజేసినట్లు తెలుస్తోంది. అయితే నూజివీడు శాసనసభ్యులు రాష్ట్ర గృహ నిర్మాణ మరియు సమాచార శాఖ మాత్యులు కొలుసు పార్థసారథి దృష్టికి సబ్ పోస్ట్ ఆఫీస్ ఏర్పాటు ఆవశ్యకత గురించి ఏలూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి మందపాటి బసవ రెడ్డి విన్నవించారు. దీనిపై స్పందించిన మంత్రి పోస్టల్ ఉన్నతాధికారులకు సబ్ పోస్ట్ ఆఫీస్ ఏర్పాటు చేయాలని సిఫార్సు చేశారు. దీనిపై ఉన్నతాధికారులు కూడా స్పందించి మరో రెండు మాసాలలోనే సబ్ పోస్ట్ ఆఫీస్ ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్టు తెలిసింది. దీనిపై మండల బిజెపి నాయకత్వం కేంద్ర గ్రామీణ శాఖ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కు అర్జీ సమర్పించగా ఆయన కూడా స్పందించి తక్షణమే ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించినట్టు తెలుస్తోంది. సబ్ పోస్ట్ ఆఫీస్ చాట్రాయిలో ఏర్పాటు చేస్తే మండలంలోని 15 గ్రామాల ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటివరకు బ్రాంచ్ పోస్ట్ ఆఫీస్ ఉండగా ఉదయం 12 గంటలకి మూతపడుతోంది. కానీ సబ్ పోస్ట్ ఆఫీస్ ఏర్పాటు అయితే సాయంత్రం ఐదు గంటల వరకు కార్యకలాపాలు జరుగుతాయని దీనివల్ల మండల కేంద్రానికి వచ్చిన ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఏది ఏమైనా సబ్ పోస్ట్ ఆఫీస్ ఏర్పాటు చేస్తున్నారని వార్త వెలుగులోకి రావడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.




# పర్యావరణ పరిరక్షణలో
# అందరూ భాగస్వాములు కావాలి



**భీమవరం మే 2 ప్రభాతవార్త :** ప్లాస్టిక్ ను నిషేధించి పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని ఎఎస్ఎన్ రాజు బ్లడ్ బ్యాంక్ అల్లూరి సూర్యనారాయణ రాజు, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వరరావు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, భీమవరం పురపాలక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం జెపి రోడ్డులోని ఎఎస్ఎన్ రాజు బ్లడ్ బ్యాంక్ వద్ద ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన సదస్సు, ఉచితంగా గుడ్డ సంచులను పంపిణీ చేశారు. ప్లాస్టిక్ నిషేధ కమిటీ సభ్యులు కంతేటి వెంకటరాజు, చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఇప్పటికే పట్టణంలో 50 శాతం వరకు ప్లాస్టిక్ నిషేధం జరిగిందని, జిల్లా యంత్రాంగం తక్షణ చర్యలుగా విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారని, ప్రజల్లో అవగాహన పెరిగిందన్నారు. ప్లాస్టిక్ ను ప్రతిఒక్కరూ ఖచ్చితంగా నిషేదించాలని అన్నారు. అనంతరం చితంగా గుడ్డ సంచులను పంపిణీ చేశారు.

# అమరావతి పునర్నిర్మాణ సభకు వెళ్లేందుకు
# అద్భుత ప్రజా స్పందన.....
## - గోదావరి జిల్లాల నుంచే లక్ష మంది - మంత్రి నిమ్మల



**నరసాపురం ప్రభాతవార్త :** భారత ప్రధాని మోదీ పాల్గొంటున్న అమరావతి పునర్నిర్మాణ సభకు ఒక్క ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నుంచే 50వేల మంది వరకు పాల్గొబోతున్నారని ఉభయ గోదావరి జిల్లాల నుంచి లక్ష మంది వరకు వెళ్లేందుకు ఉత్సాహం చూపుతున్నారని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పాలకొల్లులో గురువారం ఆయన కార్యాలయం వద్ద ముఖ్య కూటమి నాయకులతో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రం దిశ దశ మార్చే ఈ చారిత్రక సభకు హాజరయ్యేందుకు కూటమిలోని తెదేపా, జనసేన, భాజపా పార్టీల సమన్వయంతో తగిన ఏర్పాట్లు చేసామన్నారు. ప్రధాని సభకు తరలి వెళ్లేందుకు ప్రజా స్పందన అద్భుతంగా ఉందన్నారు. జగన్ విధ్వంసం తర్వాత రాష్ట్రానికి రేపటి రోజు పునర్జన్మ లాంటిదన్నారు. అన్ని రంగాలు అస్తవ్యస్తమై కొన ఊపిరితో కునారిల్లుతున్న రాష్ట్రానికి కూటమి ప్రభుత్వ అధినేత చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు ఊపిరి లూదారు. గాడి తప్పిన ప్రగతిని పట్టాలెక్కించారు. దానికి కేంద్ర ప్రభుత్వం తరపున ప్రధాని మోదీ ఆర్థిక వెన్నుదన్నుగా నిలిచారని మంత్రి రామానాయుడు తెలిపారు. పాలకొల్లు నియోజకవర్గం నుంచి 25 బస్సులు, 120 కార్లలో 5 వేల మందికి పైగా తరలి వెళు న్నారని, వీరికి ఎటువంటి ఇబ్బందులు కలక్కుండా కూటమి నాయకులు బాధ్యత తీసుకోవాలని మంత్రి రామానాయుడు తెలిపారు. పార్టీలతో సంబంధం లేకుండా ప్రధాని సభకు రావాలని ఉత్సాహపడుతున్న అందర్నీ కలుపుకుని తీసుకురావాలన్నారు. పాలకొల్లు ప్రజలకు ప్రత్యేక విజ్ఞప్తి ఏమిటంటే.. ప్రభుత్వం చేపట్టే అన్ని కార్యక్రమాలలోనూ, నిధులు తెచ్చి అభివృద్ధి పరచుకోవడంలోనూ మనమే ముందుంటున్నాం. కృతజ్ఞతలు చెప్పడానికి వెళ్లే ప్రజా సంఖ్యలోనూ పాలకొల్లు ఫస్ట్ ఉండాలన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు పాలకొల్లు పట్టణ టిడిపి అధ్యక్షులు జీవీ మీసాల రామచంద్రరావు వల్లభ శ్రీనివాస్ జనసేన నాయకులు భాను నరసయ్య తులా రామలింగేశ్వర సిరగం సురేంద్ర కొమ్ముల దినేష్ బిజెపి నాయకులు ఉన్నమట్ల కపర్తి జక్కంపూడి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వాసవి క్లబ్ వారిచే చలివేంద్రం

**ప్రభాతవార్త నరసాపురం :** నరసాపురం వాసవి క్లబ్ తరపున 3వ చలివేంద్రాన్ని వాసవి క్లబ్ రిజినల్ చైర్మన్ వంకాయల శ్యామల స్థానిక స్టీమర్ రోడ్ నందు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ నరసాపురం క్లబ్ వారు చేస్తున్న సేవాతత్పరత ఎనలేనిదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ నూలి శ్రీనివాస్, సెక్రటరీ కె.బాబ్జీ,జోన్ ఛైర్మన్ ఎ.బదరి,ఎం.రాజా, దేవత సుబ్బారావు,కె.బాబు,నవీన్,రాతికింది ప్రసాద్,జల్లూరి శ్రీనివాస్,ఈరోజు స్పాన్సర్ బంగారు గుప్త తదితరులు పాల్గొన్నారు.



# భారత కమ్యూనిస్టు పార్టీ నూతన కమిటీ ఎన్నిక

వేలేరుపాడు, ఏప్రిల్ 2, ప్రభాత వార్త : భారత కమ్యూనిస్టు పార్టీ మండల కార్యదర్శిగా రెండవసారి బాడిశ రాము, సహాయ కార్యదర్శిగా పిట్టా ప్రసాద్ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 55 మందితో మండల కమిటీ ఏర్పడగా 17 మంది కార్యవర్గంలో తీసుకున్నారు. మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై వెనుతిరగని పోరాటం చేస్తామని, ముఖ్యంగా పోలవరం నిర్వాసితులు ఎదుర్కొంటున్న సమస్యలపై దపాలుగా పోరాటాలు చేస్తామని నూతన కార్యదర్శి బాడిస రాము పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాలలో ఉన్న ప్రత్యేక చట్టాలను అమలు చేసే విధంగా, పోడు భూములకు పట్టాల కొరకు ఆదివాసి సంఘాలను కలుపుకొని పోరాటాలు చేస్తామని సహాయ కార్యదర్శి పిట్టా ప్రసాద్ అన్నారు. ఈ మహాసభలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, ఏపీ జి ఎస్ రాష్ట్ర



అధ్యక్షులు కారం దారయ్య సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సన్నేపల్లి సాయిబాబు,మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మన్నవ యామని, జెవి రమణ రాజు మై సాక్షి వెంటాచారి బాబు రావు పిట్టా వీరయ్య కాట వెంకటేశ్వర్లు కొరిమల వెంకటేశ్వర్లు యర్రా మధు బంధం నాగేశ్వరావు మడివి కామయ్య బంధం అర్జున్ తదితరులు పాల్గొన్నారు

# జెట్టి గురునాథరావుకు ఘనంగా సత్కారం

జంగారెడ్డిగూడెం,ప్రభాతవార్త: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్సిపి రాష్ట్ర అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులుగా రాష్ట్ర కార్యదర్శి జెట్టి గురునాథరావును నియమించినందులకు గురువారం పార్టీ నాయకులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని ఘనంగా గురునాథరావును జంగారెడ్డిగూడెంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి సభ్యులు ముప్పిడి శ్రీనివాసరావు, పార్టీ బీసీ సెల్ రాష్ట్ర నాయకులు కుక్కల ధర్మారావు,ఓరుగంటి నాగేంద్ర కుమార్,చలమాల శ్రీనివాస్,తాడేపల్లి ఉమాదేవి, కొయ్య లీలాధర రెడ్డి,వెంప లివింగ్ స్టన్,కుర్రు రవి, వీరవల్లి సోమేశ్వరరావు,తీడా మహేష్,కాటం ప్రసాద్,దిండి రాము,ఏలూరి ఫణి కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముప్పిడి శ్రీనివాసరావు మాట్లాడుతూ



గురునాథరావు పార్టీ అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, అందరికీ అందుబాటులో ఉండే నాయకుడిగా గుర్తింపు పొందారన్నారు. విద్యుత్ పై పన్నులు పెంచడం పట్ల పెద్ద ఎత్తున వైఎస్ఆర్ పార్టీ తరపున ఆందోళన చేపట్టారని, ఇలాంటి వ్యక్తిని గుర్తించి మాజీ సీఎం జగన్ పదవి ఇవ్వడం పట్ల ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.



# శ్రీ నూకాలమ్మ అమ్మవారికి స్వర్ణవర్ణ నాగాభరణం సమర్పణ

జంగారెడ్డిగూడెం, ప్రభాతవార్త: పట్టణంలోని శ్రీ నూకాలమ్మ అమ్మవారు శుక్రవారం సందర్భంగా విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి పెన్మేత్స రాజంరాజు,నాగలక్ష్మి దేవి కుటుంబ సభ్యులు రూ.25 వేలు విలువ గల స్వర్ణవర్ణ నాగాభరణం సమర్పించారని ఆలయ చైర్మన్ డాక్టర్ రాజన సత్యనారాయణ తెలిపారు. ఈ నెల 12 న ఆలయ యాగశాల నందు వైశాఖ పౌర్ణమి సందర్భంగా 75 వ చండీ హెూమం నిర్వహిస్తున్నామని తెలిపారు.

# నేడు విద్యుత్ సరఫరా లో అంతరాయం

జంగారెడ్డిగూడెం,ప్రభాతవార్త: జంగారెడ్డిగూడెం పేరంపేటరోడ్డు సబ్ స్టేషన్ పరిధిలో లైన్ మీద చెట్ల కొమ్మలు తొలగించు నిమిత్తం ఈనెల 3వ తేదీ శనివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు అయ్యప్ప టౌన్ షిప్, పేరంపేటరోడ్డు,బాట గంగానమ్మ లేఅవుట్ కాలనీ,పేరంపేట రోడ్డులో గల ఇండస్ట్రియల్ సర్వీసులకు విద్యుత్ సరఫరా లో అంతరాయం కలుగునని జంగారెడ్డిగూడెం ఆపరేషన్ ఈ ఈ పీర్ అహ్మద్ ఖాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున వినియోగదారులు సహకరించాలని కోరారు.

# కార్మికులతో న్యాయ అవగాహన సదస్సు

భీమవరం మే 2 ప్రభాతవార్త : "కార్మికుల పని గంటల కొరకు మరియు వారి హక్కుల సాధనకు కృషి చేసిన మహనీయులు డా.బి.ఆర్. అంబేద్కర్ని స్మరించుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని, ఎందరో మహనీయుల త్యాగ ఫలితం కార్మికుల దినోత్సవంగా జరుపుకుంటున్నామని, చట్టాల పరిరక్షణకు న్యాయస్థానాలు ఉన్నాయి, ఎవరికైనా వారి హక్కుల కు భంగం కలిగితే న్యాయ స్థానాలను ఆశ్రయించవచ్చని, న్యాయవాదిని నియమించుకునే ఆర్థిక స్తోమత లేనివారు కోర్టు ప్రాంగణంలో ఉన్న మండల న్యాయ సేవా సంస్థను సంప్రదించి ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని" భీమవరం 3వ అదనపు జిల్లా న్యాయమూర్తి మరియు మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్ బాధ్యతలు నిర్వహిస్తున్న ఫోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి డాక్టర్ బి. లక్ష్మి నారాయణ అన్నారు. గురువారం అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా స్థానిక ఆర్ టీ సి డిపో గ్యారేజ్ లో కార్మికులతో నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సుకు న్యాయమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని కార్మిక చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) జి. సురేష్ బాబు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు యేలేటి యోహాన్ (న్యూటన్), డిపో మేనేజర్ పి వి వి ఎస్ ఎన్ మూర్తి, ప్యానల్ న్యాయవాదులు పి.అంబేద్కర్, కె.జ్యోతి, ఎన్.సుధీర్, డి.రవికిరణ్, కె.సుబ్బరాజు, పారా లీగల్ వాలంటీర్లు ఎస్.సత్యనారాయణ రాజు, షేక్.చాన్ బాషా, కె.నాగేంద్ర కుమార్, కార్మిక సంఘ నాయకులు, ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

# మున్సిపల్ మేనేజర్ గా నాగేశ్వరావు

భీమవరం మే 2 ప్రభాతవార్త :భీమవరం మున్సిపాలిటీ నూతన మేనేజర్ గా ఎస్.నాగేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో పాలకొల్లు పురపాలక సంఘం నందు మేనేజర్ గా పనిచేసే భీమవరం పురపాలక సంఘం కు బదిలీపై వచ్చారు..



# వేసవి దుక్కు వాళ్ళ ఎన్నో ప్రయోజనాలు.

అత్తిలి - మే 2( ప్రభాత వార్త ):వేసవి దుక్కుల వలన ప్రయోజనాలు న్నాయని అత్తిలి వ్యవసాయాధికారి టి. కే. రాజేష్ తెలిపారు. నేలలో ఉత్తమ నీటి నిల్వ సామర్థ్యం ఏర్పడుతుందని , వర్షపు నీరు భూమిలోకి ఇంకి భూగర్భనీటిమట్టం పెరుగుతుంద ని తెలిపారు. వాలుకు అడ్డంగా దుక్కులు దున్నడం వలన నేల కోతకు గురి కాకుండా ఉంటుంద ని,చేలలో ఉండే మొండి జాతి కలుపు మొక్కలను దుంపలతో సహా పెకలించేలా లోతు దుక్కి దున్నడం వల్ల కలుపు బెడద ఉండదని తెలిపారు. భూమిలో నిద్రావస్థలో ఉన్న పలు కీటకాల కోశస్థ దశలు నశింపబడి, తదుపరి వేసే పంటల మీద చీడపీడల ఉధృతి తగ్గించవచ్చు న్నారు. తొలకరిలో దున్నటం వలన నేలలోకి నీరు బాగా ఇంకి భూమి బాగా గుల్లబారి..తర్వాత వేసే పంటకు ఉపయోగపడుతుంద ని,పంట మొక్కల వేర్లు లోనికి పోయి తేమను, పోషకాలను ఎక్కువ శాతం అందుకొని దిగుబడులు, నాణ్యత పెరుగుతాయ న్నారు. వేసవిలో దున్నటం వలన గత పంటకు చెందిన ఆకులు, చెత్త నేలలో కలిసి సేంద్రీయ పదార్థంగా మారాయని తెలిపారు. ఎండు తెగులు ఉన్న ప్రాంతాల్లో వేసవి దుక్కులు చేస్తే.. భూమిలోని శిలీంద్రాలు నశించి తర్వాత పంట కాలానికి ఆ తెగులు తీవ్రత చాలా వరకు తగ్గుతుంద న్నారు. ముందుగానే దుక్కి చేసుకోవడం వలన వర్షాలు కురవగానే ఖరీఫ్ పంటలను సరైన అదునులో వేసుకోవచ్చు ని అన్నారు.

# అమరావతి సభ బస్సులు ప్రారంభం .

అత్తిలి - మే 2 ( ప్రభాత వార్త ):అమరావతి పునః నిర్మాణ పనులు ప్రారంభ కార్యక్రమానికి దేశ ప్రధాని మోడీ విచ్చేస్తున్న సందర్భముగా తణుకు నియోజకవర్గ శాసన సభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ పిలుపు మేరకు అమరావతి పునః ప్రారంభోత్సవ కార్యక్రమానికి అత్తిలి మండలం నుండి బయలుదే రే బస్సులను మండల తెలుగుదేశం జనసేన బీజేపీ పార్టీల అధ్యక్షులు ఆనాల ఆదినారాయణరావు , దాసం ప్రసాద్ ఎం. నాగబాబు జెండా ఊపి ప్రారంభించారు. ఎంపీడీఓ పి. శామ్యూల్, డిప్యూటీ ఎంపీడీఓ శ్రీనివాస్, డ్వాక్రా సీసీ లు,గ్రామ కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇ-శ్రమ్ పోర్టల్ సేవల్ని వినియోగించుకోండి

భీమవరం మే 2 ప్రభాతవార్త :"అసంఘటిత రంగ కార్మికులు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇ-శ్రమ్ పోర్టల్ లో పేరు నమోదు చేయించుకుంటే మేలుజరుగుతుందని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జి. సురేషబాబు అన్నారు. ప్రమాదం జరిగినప్పుడు ఇన్సూరెన్స్ వర్తిస్తుందని, ఇదివరకే పేరు నమోదు చేయించుకుని సంవత్సరం దాటినవారు గ్రామ సచివాలయంలో రెన్యువల్ చేయించుకోవచ్చని, అదే విధంగా ఆర్థిక స్తోమత లేనివారు మండల న్యాయ సేవా సంస్థను సంప్రదించి ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని" భీమవరం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) సురేష్ బాబు అన్నారు. శుక్రవారం పాలకోడేరు సచివాలయం లో కార్మికులకు నిర్వహించిన అవగాహన సభలో మాట్లాడారు. అసంఘటిత రంగ కార్మికులకు




రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈనెల 1నుండి 7వరకూ నిర్వహిస్తున్న అవగాహన సదస్సుల్లో భాగంగా దీనిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాదులు బి.సురేష్ కుమార్, ఎన్.సుధీర్, పి.అంబేద్కర్, సచివాలయ కార్యదర్శిసీహెచ్.పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా రామానుజుల వారి బ్రహ్మోత్సవాలు

**నరసాపురం ప్రభాతవార్త:** పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో శ్రీ ఆదికేశవ ఎంబర్ మన్నారు స్వామి వారి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు తిరు నక్షత్ర ఉత్సవాలు అంగరంగ వైభవం జరుగుతున్నాయి. పరమ పవిత్ర గోదావరి నది తీరం వాసులైన వైష్ణవ సాంప్రదాయ పాటించే సంవత్సరంలో చెందిన శ్రీ పుప్పాల రమణప్ప నాయుడు శ్రీ పెరంబుదూర్ ఆలయ సంప్రదాయాన్ని పాటిస్తూ నరసాపురం శ్రీ ఆదికేశవ ఎంబెరు మానార్ స్వామి వారి దేవస్థానం నిర్మించారు. ఇప్పటికీ సుమారు 250 సంవత్సరాల క్రితం అన్నమాట, భారతదేశంలో మొదటి దేవాలయం శ్రీ పెరంబుదూర్, రెండోది ఆంధ్రప్రదేశ్లో నరసాపురం. రాష్ట్రంలో ఇట్టి రమనీయమైన భగవత్ రామానుజ దేవాలయం మొదటిది. నరసాపురంలో శ్రీ ఆదికేశవ ఎంబర్ మన్నారు స్వామి వారి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు మరియు తిరు నక్షత్ర ఉత్సవాల లో భాగంగా తమిళనాడు నుంచి 250 భక్తులు విచ్చేయడం 11 రోజులు స్వామి వారి సేవలు ఉండటం విశేషం.శ్రీ రామానుజుల స్వామివారి ప్రవచనాలు కార్యక్రమం తెలగ కళ్యాణ మండపం నందు జరిగాయి. తమిళనాడు చెందిన భక్తులు భగవత్ రామానుజుల స్వామి వారు గురించి ఆయన జీవిత చరిత్ర గురించి భక్తి విషయాలు భక్తులకు తెలియజేశారు. జై రామానుజ అంటూ భక్తులు స్వామి నామస్మరణ చేశారు. ఉత్సవాల ఊరేగింపులో వారి నృత్యం చేశారు. చైత్ర మరియు వైశాఖ మాసాల్లో శ్రీ ఆదికేశవ స్వామివార్ల బ్రహ్మోత్సవం 10 రోజులు మరియు భగవద్రామానుజ వర్ష తిరునక్షత్ర ఉత్సవాలు 11 రోజులు జరుగుతున్నాయి. ఆదికేశవ స్వామికి



బ్రహ్మోత్సవాల్లో భాగంగా రామ అవతారం, స్వామివారిని శేష, గజ,సింహ, గరుడ, సూర్య ప్రభ, చంద్రప్రభ వాహనోత్సవాలు మరియు రథోత్సవం ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగింది. రామానుజ స్వామి వారి వర్షతిరునక్షత్ర ఉత్సవాల్లో భాగంగా పల్లకి ఉత్సవము, రామానుజల స్వామివారిని సూర్య ప్రభ, చంద్రప్రభ, శేష, గజా, హంస వాహనోత్సవాలు మరియు రథోత్సవం నరసాపురం తిరువీధులలో ఊరేగింపు వైభవంగా జరిగింది. రామానుజుల స్వామివారి జన్మదిన వేడుక సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. దసరాల్లో తొమ్మిది రోజులు, ధనుర్మాసంలో 30 రోజులు ఉత్సవాలు జరుగును. ముక్కోటికి ఉత్తర ద్వార దర్శనం. భోగి రోజున గోదాదేవి కళ్యాణం, మీనోత్తర కళ్యాణం. గురు పుష్య ఉత్సవాలు మూడు రోజులు, పల్లవోత్సవాలు 3రోజులు పగల్ పత్తు 10 రోజులు, రా పత్తు 10 రోజులు, పవిత్రోత్సవాలు 5రోజులు,



తిరుమంగై ఆల్వారి వర్ష తిరు నక్షత్ర ఉత్సవాలు 5రోజులు, ఆండాళ్ విరాట ఉత్సవాలు 10 రోజులు, మనవళామముని ఉత్సవాలు10 రోజులు, హనుమాన్ జయంతి, నిత్య, పక్ష, మాస మరియు వర్ష ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగును. ప్రతిరోజు ఉదయం రాత్రి తీర్థం ప్రసాద వినియోగాలు జరుగును. స్వామివారి తిరుమంజనం, పల్లకి సేవ, వేద పండితుల మంత్రోచ్చారణతో అభిషేక అర్చనలు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ప్రతి సంవత్సరం ఉత్సవాలకు కర్ణాటక, తెలంగాణ, తమిళ రాష్ట్రం మరియు దేశ విదేశాలనుండి భక్తులు రావడం, ఉత్సవాల ఊరేగింపులో వారి నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఈ కార్యక్రమాలకి స్థానాచార్యులు కె. వెంకటాచార్యులు, ప్రధాన అర్చకులు పెద్దింటి మోహన రామాచార్యులు, చైర్మన్ పుప్పాల వెంకట కృష్ణారావు, కార్య నిర్వహణ అధికారి ఆర్ వి వి ఎన్ రామచంద్ర కుమార్,అర్చకులు, సిబ్బంది టి.వెంకటేశ్వరరావు, రామానుజ చార్యులు మరియు భక్తులు పాల్గొంటారు

# ఎరువులు మోతాదును పున పరిశీలన చేయాలి - డాక్టర్ పి వి సత్యనారాయణ

పెనుమంట్ర, మే-02, ప్రభాతవార్త: వరి, మొక్కజొన్న లాంటి సాగులో ఎరువులు మోతాదును పున పరిశీలన చేయాలని ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయ పరిశోధనా సంచాలకులు డా.పి.వి.సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మండలంలోని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో రెండొవ రోజు జరిగిన "గోదావరి మండల పరిశోధన మరియు విస్తరణ సలహా మండలి సమావేశం" శుక్రవారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ వరి, మొక్కజొన్న లాంటి పంటలలో ఎరువుల వినియోగం సిఫార్సుకంటే చాలా ఎక్కువగా ఉంటున్నదని అన్నారు. దానికి తగ్గట్టుగా దిగుబడిలో పెరుగుదల కూడా కనిపిస్తున్నది కావునా ప్రస్తుతం సిఫారసులో ఉన్న ఎరువుల మోతాదును పునఃపరిశీలన చేయవలసిన ఆవశ్యకత పంటల యాజమాన్యం మరియు మృత్తిక శాస్త్రవేత్తలపై ఉన్నదని తెలిపారు. వరి ప్రధానంగా ఉన్న ప్రాంతాలలో కోత తరువాత మిగిలిన దుబ్బులను తగలబెట్టడం జరుగుతున్నదని, దానిని తగ్గించడానికి, సులభంగా కుళ్ళిపోయి భూమిలో కలిసిపోయేలా



చేయడానికి ప్రస్తుతం అందుబాటులో ఉన్న యంత్రాలను గోదావరి మండలంలో పరిశీలించాలని ఆదేశించారు. మొక్కజొన్నలో అధిక మోతాదులో ఎరువులు వినియోగిస్తున్న దృష్ట్యా, మార్కెట్ లో ఉన్న అన్ని సంకర రకాలతో పాటూ పెద్దాపురం పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు రూపొందించిన కొత్త వంగడాలను కూడా రసాయన ఎరువుల అవసరత కొరకు పరిశోధనలు చేపట్టవలసిన అవసరం ఉన్నదని తెలిపారు. విస్తరణ సంచాలకులు డా.జి.శివనారాయణ మాట్లాడుతూ పరిశోధనా స్థానాలు మరియు విత్తనోత్పత్తి సంస్థ లపై భారం తగ్గించడానికి రైతు విత్తనోత్పత్తి దారులను గ్రామాలలో అభివృద్ధి చేయవలసిన అవసరం ఉన్నదని విస్తరణ కేంద్రాలను ఆదేశించారు. తదుపరి వరి ఎగుమతిదారుల సంఘం అధ్యక్షులు బి.వి.కృష్ణా రావు మాట్లాడుతూ మన రాష్ట్రంలో పండించే 127 లక్షల టన్నుల ధాన్యం నుండి సుమారు 80 లక్షల టన్నుల బియ్యం ఉత్పత్తి అవుతుంది. మన రాష్ట్ర అవసరాలకు సుమారు 50 లక్షల టన్నుల బియ్యం సరిపోతుంది, మిగిలిన 30 లక్షల టన్నుల బియ్యాన్ని బాసుమతియేతర రకాల కేటగిరీ కింద ఇతర దేశాలకు ఎగుమతి చేయటం వల్ల రైతులకు అధిక ఆదాయం తో పాటు రాష్ట్ర ఆర్థిక అభివృద్ధికి మరింత మేలుజరిగే అవకాశం ఉన్నదని తెలిపారు. తదుపరి శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు, అభ్యుదయ రైతులు ఐదు బృందాలుగా ఏర్పడి వరి, అపరాలు, చెరకు, చిరుధాన్యాలు, యాంత్రీకరణలలో వచ్చే సంవత్సరానికి చేపట్టవలసిన పరిశోధన మరియు విస్తరణ ప్రణాళికను రూపొందించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఎడిఆర్ డా. టి.శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారులు ఎస్.మాధవరావు, వి.బోసు బాబు, శాస్త్రవేత్తలు మరియు అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

# ఆసుపత్రికి వెళ్లి పింఛన్ అందచేసిన ఉద్యోగి.



అత్తిలి - మే 2 ( ప్రభాత వార్త ): అత్తిలి లో సామజిక పింఛన్లు పంపిణి సందర్భంగా ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న రోగికి సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ పింఛన్ అందచేసి తన ఔదార్యాన్ని చాటుకున్నాడు . అత్తిలి కి చెందిన ర్యాలీ ధన లక్ష్మి అనారోగ్యంతో కాకినాడ ఆసుపత్రి లో చికిత్స పొందుతోంది. ఆమె కు సామాజిక పింఛన్ మొత్తాన్ని సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ ఉమామహేశ్వరరావు కాకినాడ వెళ్లి అందచేశారు. ఉమామహేశ్వరరావు ఔదార్యాన్ని ఎంపిడిఓ శ్యామ్యూల్ తదితరులు అభినందించారు.

# 6న భీమవరంలో 110 మంది ప్రతిభవంతులకు పురస్కారాలు..




భీమవరం మే 2 ప్రభాతవార్త :ఈనెల 6వ తేదీన భీమవరం త్యాగరాజ భవనంలో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఈ విద్యా సంవత్సరంలో ప్రతిభ కనబరిచిన 110 మంది ప్రతిభవంతులకు పురస్కారాలను అందిస్తున్నట్లు శ్రీవిజ్ఞానవేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, కంతేటి వెంకటరాజు తెలిపారు. శుక్రవారం హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీపద్మావతి వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. భీమవరం పట్టణ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల, కళాశాలలో పదో తరగతి, ఇంటర్ పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించిన 110 మంది విద్యార్థులకు సర్టిఫికేట్స్, మెడల్స్ తో పురస్కారాలను అందిస్తామని తెలిపారు. గత 27 ఏళ్లుగా శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ప్రతిభ వంతులను ప్రోత్సహిస్తూ ఈ పురస్కారాలను అందిస్తున్నామని, ఉదయం 9 గంటలకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరవుతున్నారని, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మందిర కార్యదర్శి కుక్కల బాల, అరసవల్లి సుబ్రమణ్యం, మడిపల్లి చంద్రశేఖర్, పుప్పాళ్ళ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# అమరావతి వెళ్లేవారి కి సదుపాయాలు .

అత్తిలి - మే 2 ( ప్రభాత వార్త ):అమరావతి పునః ప్రారంభం జరుగు కార్యక్రమమునకు అత్తిలి మండలం నుండి వెళ్లుచున్న కార్యకర్తలకు, టిఫిన్ లు,వాటర్ బాటిల్స్,మజ్జిగ పెకట్స్, ఓఆర్ ఎస్ లు, బిస్కెట్ లు, అరిటిపళ్ళు, కేక్స్,గ్లూకోస్ బాటిల్స్,టవల్స్,తినుబండారాలు పంపిణిచేసినట్లు ఎంపిడిఓ పి . శ్యామ్యూల్ తెలిపారు . మండలం కూటమి నాయకులు,పంచాయతీ కార్యదర్శిలు,కార్యాలయ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ కనకదుర్గ అమ్మవారి జాతర మహోత్సవములు ప్రారంభం

నరసాపురం మే 2 (ప్రభాతవార్త) పసలదీవి గ్రామంలో వెలసియున్న శ్రీ కనకదుర్గ అమ్మవారి జాతర మహోత్సవ వేడుకలు మే 4వ తేదీ ఆదివారం నుండి రెండు రోజులు పాటు అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు ఆలయ నిర్వాహకులు శుక్రవారం విలేకరులకు తెలియజేశారు ఆదివారం అమ్మవారి సంబరం ఆసాదులు డాన్సులు తీన్మార్ డప్పులతో వాయిద్యం ఊరేగింపు కనకదుర్గమ్మ వారికి చనివిడి పానకాలు భక్తిశ్రద్ధలతో సమర్పించుట 5వ తేదీ సోమవారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు మొక్కుబడులు తీర్చుకొనుట అనంతరం నిప్పుల గుండం వంటి కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు కమిటీ వారు తెలియజేశారు



# శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారికి వారికి ప్రత్యేక అలంకరణ

మొగల్తూరు మే 2 (ప్రభాతవార్త) భవాని కాలనీలో వెలసియున్న శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో శుక్రవారం సందర్భంగా అమ్మవారికి ఆలయ అర్చకులు రామ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక అలంకరణ చేశారు ఈ సందర్భంగా భక్తులు పలు గ్రామాల నుండి పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని నైవేద్యములు సమర్పించారు కమిటీ వారు భక్తులకు ఎటువంటి అసౌకర్యములు కలగకుండా దగ్గరుండి నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదములు అందజేశారు

# మార్కెట్ అవసరాలకు తగినట్టుగా రైతులు రకాలు ఎంపిక చేసుకోవాలి, జిల్లా కలెక్టర్ నాగరాణి

పెనుమంట్ర, మే-01, ప్రభాతవార్త: మార్కెట్ అవసరాలకు తగినట్టుగా రైతాంగం రకాలు ఎంపిక చేసుకోవాలని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ సి నాగరాణి రైతులకు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో జరిగిన "గోదావరి మండల పరిశోధన మరియు విస్తరణ సలహా మండలి సమావేశానికి" కలెక్టర్ సి.నాగరాణి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం నుండి విడుదల చేయబడిన వరి రకాలు ప్రపంచవ్యాప్తంగా 9%, భారతదేశంలో 33% విస్తీర్ణంలో సాగుచేస్తున్నారని అన్నారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన స్వర్ణ రకం ఈ పరిశోధనా స్థానం నుండి విడుదలకావడం ఎంతో గర్వకారణమని తెలిపారు. మన ప్రాంతంలో తుఫానులు మరియు అకాల వర్షాల కారణంగా రైతులు ఎక్కువగా నష్టపోతున్నారు కనుక, వీటిని తట్టుకునే రకాలను ఎక్కువ విస్తీర్ణంలో రైతులు సాగుచేసేలా ప్రోత్సహించాలని వ్యవసాయ శాఖ సిబ్బందిని కోరారు. పి.ఆర్ 126 రకానికి ప్రత్యమ్నాయ రకాలైన యం.టి.యు 1290, యం.టి.యు 1293, యం.టి.యు 1273 రకాల ప్రదర్శనా క్షేత్రాల రూపంలో సాగుచేసి, రైతుల అభిప్రాయాలను తెలియజేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. పరిశోధనా ఫలితాలు కేవలం పరిశోధనా స్థానాలకు పరిమితం కాకుండా, రైతులకు చేరేవిధంగా చేయవలసిన భాద్యత ప్రతి వ్యవసాయ అధికారిపై ఉన్నదని తెలిపారు. "వర్షపాతానికి ముందు పొడి విత్తనం" చల్లే పద్ధతిని



పెద్ద ఎత్తున రైతులలోనికి తీసుకువెళ్ళవలసిన భాద్యత వ్యవసాయ శాఖపై ఉన్నదని తెలిపారు. గుర్రపుడెక్క కలుపు నుండి కంపోస్ట్ తయారుచేసే ప్రక్రియ డ్వాక్రా సంఘాల ద్వారా నిర్వహిస్తున్నామని, వీరికి డికంపోజర్ల వాడకం పై అవగాహన కల్పించవలసిన అవసరం ఉన్నదని తెలిపారు. అధిక పోషకవిలువలు కలిగిన నల్ల బియ్యం రకాలు, బియ్యంగా కంటే నూకగా తీసుకుంటే తినటానికి బావున్నాయని ఆమె తన అభిప్రాయం తెలియజేశారు. ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయ పరిశోధనా సంచాలకులు డా.పి.వి.సత్యనారాయణ మాట్లాడుతూ ప్రస్తుతం మారుతున్న జీవనశైలి కారణంగా వినియోగదారులు ఎక్కువగా సన్న గింజ రకాలను తినడానికి ఇష్ట పడుతున్నారని, కావునా రైతులు కూడా, అవకాశం ఉన్న ప్రాంతాలలో తినటానికి అనువైన సాంబ మషూరి (బి.పి.టి 5204), మారుటేరు సాంబ (యంటియు 1224), మారుటేరు మషూరి (యంటియు 1262) మరియు యంసియం 103 వంటి సంనగింజ రకాల సాగుచేయవలసిన అవసరం ఉన్నదని తెలిపారు

# ప్రకృతి వ్యవసాయం పెంపకముపై అవగాహన ర్యాలీ నిర్వహణ

మొగల్తూరు మే 2 (ప్రభాతవార్త) పంచాయతీ పరిధిలో పెద్ద పల్లవ పాలెం రైతు సేవ కేంద్రం నందు 2025-2026 సంవత్సరం కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమం గురించి శుక్రవారం మధ్యాహ్నం పకృతి వ్యవసాయం పెంపకము గురించి సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో జిల్లా ప్రకృతి వ్యవసాయ కోఆర్డినేటర్ ఎం అరుణకుమారి పకృతి వ్యవసాయం గురించి మరియు రైతులు కేటగిరి గురించి వివరించడం జరిగింది ఈ సందర్భంగా పశ్చిమగోదావరి జిల్లా డిపిఎం వై నూకరాజు రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ రసాయనిక పురుగుమందులు వాడి వ్యవసాయం చేయడం వల్ల ఖర్చులు పెరుగుతున్నాయని వాతావరణం లో వేడి పెరుగుతుందని వాతావరణ కాలుష్యం అవుతుందని గాలిలో కార్బన్డయాక్సైడ్ పెరగడం వల్ల భూతాపం పెరుగుతుందని వివరించారు గాలిలో ఉన్న కార్బన్డయాక్సైడ్ భూమిలో కలిపే విధానంలో భాగంగా పకృతి వ్యవసాయం చేయాలని సూచించారు నవధాన్యాలు 16 రకాలు నవధాన్యాలు వేయడం వల్ల భూమిలో ఉన్న మొక్కకు కావలసిన పోషకాలకు అందించే బ్యాక్టీరియాలు వృద్ధి చెందుతాయని చెప్పడం జరిగింది అదే



విధంగా వాతావరణంలోని మార్పులు మొక్క లకు ఆహారం తయారు చేయడం కోసం కావలసిన పోషకాలు గురించి వివరించడం జరిగింది ఈ గ్రేడ్ మోడల్ ఫిష్ ప్యాడ్ కిచెన్ గార్డెన్స్ గురించి వివరించడం జరిగింది పకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు ఘనంగా సన్మానం చేశారు రైతులకు సమక్షంలో జీవామృతం డెమో చేయడం జరిగింది రైతులు పకృతి వ్యవసాయ సిబ్బంది గ్రామంలో ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో నర్సాపురం డివిజన్ ఇంచార్జ్ నరసింహారావు మొగల్తూరు మండల ఇన్చార్జ్ కే లక్ష్మి కుమారి రైతులు మరియు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది స్థానికులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

తెర

# దాదాఫాల్కే ఫిలిం ఫెస్టివల్ 2025లో బెస్ట్ ఫిలిం 'క'



కిరణ్ అబ్బవరం హీరోగా నటించిన సూపర్ హిట్ మూవీ "క" మరో అరుదైన గౌరవం సొంతం చేసుకుంది. ఈ సినిమా ప్రతిష్ఠాత్మక 15వ దాదాఫాల్కే ఫిలిం ఫెస్టివల్‌లో ఉత్తమ చిత్రంగా అవార్డ్ గెల్చుకుంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ మూవీ టీమ్ తమ హ్యాపీనెస్ సోషల్ మీడియా ద్వారా షేర్ చేసింది. ప్రేక్షకులు "క" సినిమా టీమ్ కు తమ శుభాకాంక్షలు తెలియజేస్తు న్నారు. ఈ సినిమాకు డెబ్యూ డైరెక్టర్స్ సుజీత్, సందీప్ రాసిన స్ట్రాంగ్ స్టోరీ, మ్యాజికల్ స్క్రీన్ ప్లే, సరికొత్త బ్యాక్ డ్రాప్ ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. గతేడాది దీపావళికి రిలీజైన "క" సినిమా పెద్ద చిత్రాల పోటీని తట్టుకుని బాక్సాఫీస్ విన్నర్‌గా నిలిచింది. ఈ సినిమాలో తన్వీ రామ్, నయన్ సారిక హీరోయిన్స్‌గా నటించారు. "క" సినిమాను శ్రీమతి చింతా వరలక్ష్మి సమర్పణలో శ్రీచక్రాస్ ఎంటర్ టైన్ మెంట్స్‌తో బ్యానర్‌పై చింతా గోపాలకృష్ణ రెడ్డి భారీ ప్రొడక్షన్ వ్యాల్యూస్‌తో నిర్మించారు. తెలుగులో ప్రొడ్యూసర్ వంశీ నందిపాటి రిలీజ్ చేశారు.

# 'హిట్: థర్డ్ కేస్'తో 'మే' అంతా హిట్ 3నే

నేచురల్ స్టార్ నాని సెన్సేషనల్ బ్లాక్ బస్టర్ హిట్: థర్డ్ కేస్. శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటించింది. డాక్టర్ శైలేష్ కొలను దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని వాల్ పోస్టర్ సినిమా, నాని యూనానిమస్ ప్రొడక్షన్స్ బ్యానర్స్‌పై ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. హ్యూజ్ బజ్, ట్రెమండస్ బుకింగ్స్‌తో మే 1న పాన్ ఇండియా గ్రాండ్‌గా రిలీజ్ అయినహిట్: థర్డ్ కేస్ అందరినీ ఆకట్టుకొని బ్లాక్ బస్టర్ సక్సెస్‌ని అందుకొంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ప్రెస్ మీట్‌లో నేచురల్ స్టార్ నాని మాట్లాడుతూ.. అందరికి నమస్కారం. ఇది ఒక అద్భుతమైన రిలీజ్ డే. పొద్దున లేచి చూస్తే నా ఫోను మెసేజ్లతో నిండిపోయింది. ఇండస్ట్రీ, అభిమానులు, శ్రేయోభిలాషులు అందరూ సినిమా గురించి అద్భుతంగా చెబుతున్నారు. చాలా రిలీజ్ డేస్ చూసాను. కానీ ఈ రిలీజ్ డేట్ వైబ్ అదిరిపోయింది. సినిమా బుకింగ్స్ అదిరిపోయాయి. సినిమా సూపర్ హిట్.. ఇవన్నీ పక్కన పెడితే ఇది జస్ట్ బిగినింగ్ ఆఫ్ హిట్ 3 జర్నీ.. ప్రతి రోజు కూడా ఒక సెలబ్రేషన్ లాగా ఉండబోతుంది. ఇది ఎక్కడికెళ్లి ల్యాండ్ అవుతుందనేది మా టీంఅంచనాలకి అందడం లేదు. అందుకే ఎలాంటి స్టేట్మెంటు ఇవ్వదల్చుకోలేదు. మీ అందరి ప్రేమని ఎక్స్పీరియన్స్ చేస్తున్నాం. ఈ సినిమాకు వచ్చిన రెస్పాన్స్ గొప్ప ఆనందాన్ని ఇచ్చింది. ఇది ఇప్పుడిప్పుడే ఆగదు. ఈ సినిమాకి కనీసం నాలుగైదు సెలబ్రేషన్స్ చేయాలి. ఈసారి నేను ప్రొడ్యూసర్ కూడా కాబట్టి ఎక్స్ట్రా రెస్పాన్సిబిలిటీ ఉంది. ప్రతిసారి నాకు ఒక నమ్మకం ఉంటుంది. నేను మీరు ఒకటేనని నమ్మిన ప్రతిసారి మీరు నేను కరెక్ట్ అని ప్రూవ్ చేసినందుకు మీ అందరికీ పేరుపేరునా థాంక్యూ సో మచ్. సినిమాని ఇంత అద్భుతంగా సపోర్ట్ చేసి మీడియాకి థాంక్యూ సో మచ్. మీ సపోర్ట్ వలనే ఈ బ్లాక్ బస్టర్ సాధ్యమైంది. మే ఫస్ట్ స్టార్ట్ అయింది. మే అంత ఇది సెలబ్రేషన్స్ లాగా ఉండాలని కోరుకుంటున్నాను. ఈరోజు రాత్రికి అమెరికా వెళుతున్నాను. నాలుగైదు రోజులు అందుబాటులో ఉండను. వచ్చిన వెంటనే మీ అందరిని కలుసుకొని గ్రాండ్‌గా సక్సెస్‌ని సెలబ్రేట్ చేసుకుందాం. శైలేష్ విషయంలో చాలా ప్రౌడ్‌గా ఫీల్ అవుతున్నాను. ఇది తన విజన్‌కి ఒక టీజర్ ట్రైలర్ మాత్రమే. మాకు ఎప్పుడూ సపోర్ట్ చేసే దిల్ రాజుకి థాంక్యూ సో మచ్. టికెట్ విషయంలో సపోర్ట్ చేసిన ఏపీ గవర్నమెంట్, ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు గారికి, ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారికి, అందరికీ కృతజ్ఞతలు. ఇది తెలుగు సినిమా సక్సెస్. రాబోయే సినిమాలు కూడా ఇదే సక్సెస్‌ని కంటిన్యూ చేయాలని కోరుకుంటున్నాను. ప్రేక్షకులందరు ప్రతి సినిమాని ఇలాగే ఆదరించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. థాంక్యూ సో మచ్.నిర్మాత దిల్ రాజ్ మాట్లాడుతూ నిర్మాత.. మే1న మళ్ళీ తెలుగు సినిమా ఇండస్ట్రీ బ్రీతింగ్ తీసుకుంది. లాస్ట్ మంత్ అంతా సినిమాలో వస్తున్నాయి కానీ ఆడియన్స్ థియేటర్స్‌కి రావడం లేదు, సమ్మర్ అయిపోతుంది అనుకుంటున్న తరుణం. ఏప్రిల్ నెలలో సరైన సినిమాలు లేక చాలా సింగిల్ స్క్రీన్స్ ఏపీ, తెలంగాణలో క్లోజ్ చేయడం కూడా జరిగింది. ఇలాంటి సమయంలో మా హోప్స్ అన్నీ కూడా హిట్ 3 సినిమా మీదే ఉన్నాయి.ఆడియన్స్ సినిమాకి ఏ రేంజ్‌లో ఫుల్స్ ఇస్తారని బ్రీతింగ్ హోల్డ్ చేసుకుని ఉన్నాము. అలాంటిది ఈ సినిమాకి మూడు రోజులు ముందుగానే ఆన్లైన్ బుకింగ్ చూసి జనాలు థియేటర్స్‌కి వస్తున్నారని హ్యాపీగా ఫీలయ్యా. ఈ సినిమాకి ఎక్కడ చూసినా యునానమస్‌గా లాస్ట్ హాఫ్ అండ్ అవర్ ఎక్స్ట్రార్డినరీ అనే మాట వినిపిస్తుంది. సినిమా అదిరిపోయింది. దీంతో తెలుగు సినిమా ఇండస్ట్రీ ఊపిరి పీల్చుకున్నట్టు అయింది. ట్రెమండస్ ఓపెనింగ్స్ వచ్చాయి. నానికి ఓవర్సీస్ దసరా హైయెస్ట్ ఉండే ఈ సినిమా క్రాస్ చేసింది. నానికి అక్కడ ఓవర్సీస్ హైయెస్ట్ గ్రాఫర్ అయ్యింది. అలాగే తెలంగాణలో కూడా మేము ఎక్స్పెక్ట్ చేస్తున్నాము. నానికి డే వన్ కలెక్షన్ హైయెస్ట్ కాబోతుంది. నాని థాంక్యూ వెరీ మచ్.



# సోనుది ఫిలిమ్ ఫ్యాక్టరీ 'ప్రొడక్షన్ నం01'

సోను ది ఫిలిమ్ ఫ్యాక్టరీ అధినేత ఆర్.యు రెడ్డి అన్నమాట ప్రకారం తాను ప్రారంభించిన ప్రొడక్షన్ నం1 సినిమా దిగ్విజయంగా షూటింగ్ పూర్తి చేసుకుందన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, ఇదొక కొత్త రకమైన సినిమా. అనేక ఎమో షన్స్ కలగలిసిన కథ. మంచి కథ కావటంతో మా నటీనటులు ఆశిష్‌గాంధీ, మానస రాధా కృష్ణన్‌ల నుండి ఎంతో చక్కని సహకారం లభించటంతో సినిమాను అనుకున్న సమయానికి షూటింగ్ పూర్తి చేయగలిగాం. మా దర్శకులు కిరణ్ కిట్టి, లక్ష్మీ చైతన్యలు కొత్త వారైనా కథను చెప్పి నట్లు తెరకెక్కించారు. ఒక్క పాట మినహా షూటింగ్ పార్టంతా పూర్త యింది. ఆ పాటను ప్రముఖ కొరియో గ్రాఫర్ జానీ మాస్టర్ చేయనున్నారు. త్వరలోనే సినిమా టైటిల్‌ను, ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేస్తాం. సినిమాను రెండు నెలల్లో ప్రేక్షకుల ముందుకు తీసుకు వస్తాం. ప్రముఖ సంగీత దర్శకుడు గోపిసుందర్ అందించిన ఆరు పాటలు మా సినిమాకు హైలెట్‌గా నిలుస్తాయి. మా బ్యానర్ నుండి మరి కొన్ని చెప్పిన సినిమాలు ఈ ఏడాదిలో ప్రారంభిస్తాం అన్నారు.



# ట్రెడిషనల్ టచ్‌తో నభా నటేష్

సౌత్ ఇండస్ట్రీలో మాస్ గ్లామరస్ బ్యూటీగా తనకంటూ ఒక ప్రత్యేకమైన క్రేజ్ అందుకున్న బ్యూటీ నభా నటేష్. కర్ణాటక నుంచి వచ్చిన ఈ బ్యూటీ 2015లో కన్నడ సినిమా వజ్రకాయతో యాక్టింగ్ లోకి అడుగుపెట్టింది. తెలుగులో నన్ను దోచుకుందువటే సినిమాతో ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత అదుగో డబుల్ ఇస్మార్ట్, డిస్కో రాజా, సోలో బ్రతుకే సో బెటర్, మాస్ట్రో వంటి సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. నభా నటనతో పాటు ఆమె అందం, గ్లామర్‌తో కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ తన అభిమానులతో టచ్‌లో ఉంటుంది. నభా నటేష్ ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన ఫోటోలు చూస్తే ఆమె గ్లామరస్ లుక్స్‌కు ఫిదా అవ్వాల్సిందే. ఎరుపు రంగు లెహంగా చోళీలో ఆమె చాలా అందంగా కనిపిస్తుంది. ఆ ఎరుపు దుపట్టా, బంగారు నగలు ఆమె అందానికి మరింత ఒప్పుగా ఉన్నాయి. ఆ డ్రెస్‌పై బంగారు బార్డర్, చిన్న చిన్న డిజైన్లు ఆమె లుక్‌ను మరింత స్పెషల్‌గా చేశాయి. నభా స్టైల్‌లో ఎప్పుడూ ఒక ట్రెడిషనల్ టచ్ ఉంటుంది. ఆమె లెహంగాలో కూర్చున్న ఫోటోలు చాలా ఆకర్షణీయంగా ఉన్నాయి. అలాగే బంగారు నగలు, చేతుల్లో బంగారు గాజులు చాలా అందంగా ఉన్నాయి. నభా ఎప్పుడూ తన డ్రెస్సింగ్‌తో అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. ఆమె సింపుల్‌గా ఉంటూనే గ్లామరస్‌గా కనిపిస్తుంది. ఇక ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



# 'భోగి' విడుదలకు రెడీ

పీసీ క్రియేషన్స్ పతాకంపై వరుణ్.కె దర్శకత్వంలో ప్రదీప్ చంద్ర నిర్మాతగా రూపొందుతున్న చిత్రం భోగి. సస్పెన్స్ కథాంశంతో, యూత్ ఎంటర్టైనర్‌గా రూపొందిన ఈ చిత్రం, షూటింగ్ పూర్తి చేసుకుని నిర్మాణానంతర కార్యక్రమాలను శరవేగంగా జరుపుకుంటోంది. ఆగస్టు నెలలో విడుదలకు సిద్ధం అవుతున్న ఈ చిత్రం ఫస్ట్ లుక్ ఇదివరకే విడుదలయ్యి మంచి ప్రజాదరణ పొందింది విషయం తెలిసిందే. ఈ సందర్భంగా డైరెక్టర్



వరుణ్.కె మాట్లాడుతూ, నేను కెరీర్ తొలినాళ్లలో 15కు పైగా షార్ట్ ఫిలిమ్స్ డైరెక్ట్ చేశానని, 2 సినిమాలకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా వర్క్ చేశానని చెప్పారు, అప్పుడు నాతో కలిసి పనిచేసిన ప్రదీప్ చంద్రతో కలిసి ఒక సినిమాను ప్లాన్ చేసానని. నేను అనుకున్న లైన్ బాగా నచ్చడంతో 2022లో ఈ భోగి చిత్రాన్ని ప్రారంభించామని తెలిపారు. కథకు తగ్గట్లుగానే భోగి అనే పవర్ఫుల్ టైటిల్‌తో మీముందుకు వస్తున్నాం అని అన్నారు. త్వరలోనే పోస్ట్ ప్రడక్షన్ పూర్తి చేసి విడుదల చేస్తామన్నారు.

# సిలంబరసన్ నటించిన 'పత్తు తల' నాకిష్టం

ఇండియన్ స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ ఇటీవల ఓ చాట్ షోలో మాట్లాడుతూ, సిలంబరసన్ టీఆర్ నటించిన "పత్తు తల" సినిమా నుంచి "నీ సింహం దాన్" పాటను చాలా ఇష్టపడతానని చెప్పారు. ఈ పాటను సోషల్ మీడియా రీల్స్ లో, క్రికెట్ వీడియోల్లో చాలా సార్లు వాడుతున్నారు కూడా. ఆర్‌సీబీ పోస్టులో విరాట్ కోహ్లీని ట్యాగ్ చేయడంతో ఎస్ఆర్‌టి కూడా స్పందించి, "నీ సింహం దాన్" అంటే "నువ్వు నిజమైన సింహం" అని వ్యాఖ్యానించారు. ఎస్‌టిఆర్ మరియు విరాట్ అభిమానులు ఈ అరుదైన కలయికను తెరపై కాదు గానీ తెర వెలుపల ఆస్వాదిస్తున్నారు. ఇక్కడితో అయిపోలేదు, ఈ ఇద్దరు తమ ప్రత్యేకమైన బియర్డ్ స్టైల్‌లో ఆకట్టుకున్నారు. ఎస్‌టిఆర్ తన ఫిట్‌నెస్‌ను పెంచుకోవడంతో, అతని లుక్ కొంతవరకు విరాట్ కోహ్లీని తలపిస్తోంది. ఎస్‌టిఆర్, విరాట్ కోహ్లీ బయోపిక్ లో అతడి పాత్ర పోషించబోతు న్నాడా అని ముంబయి వర్గాల్లో ప్రస్తుతం చర్చ నడుస్తోంది. ఇటీవల వీరి మధ్య సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న సంభాషణల ప్రకారం చూస్తే, విరాట్, అనుష్క ప్రొడ్యూసర్లకు ఓకే అంటే, ఎస్‌టిఆర్ ఈ బయోపిక్‌కు ఎంపిక అయ్యే అవకాశముంది. ఒకవైపు విరాట్ ఐపీఎల్‌లో విజృంభిస్తుండగా, మరోవైపు స్టీఆర్ "థగ్ లైఫ్", "ఎస్‌టిఆర్ 49", "ఎస్‌టిఆర్ 50", "ఎస్‌టిఆర్ 51" సినిమాలతో ఇండస్ట్రీలో దూసుకెళ్తున్నారు. దీనికి విరాట్ కోహ్లీ బయోపిక్ కూడా చేరితే, ఇది పాన్ ఇండియా స్థాయిలో ఓ పండుగ అవుతుంది.






# సినిమాల్లో పాపులర్ అయిన శ్రీలీల

సౌత్ సినీ ఇండస్ట్రీలో ఇప్పుడు ఓ యంగ్ బ్యూటీ సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. అందం, టాలెంట్ మాత్రమే కాదు.. అంతకు మించిన మంచి మనసుతో అందరినీ ఆకట్టుకుంటోంది. అద్భుతమైన డ్యాన్సులతో, క్రేజీ యాక్టింగ్ స్టైల్‌తో తెలుగు, కన్నడ ప్రేక్షకులకు పిచ్చెక్కిస్తున్న ఈ బ్యూటీ.. ఆమె ఎవరో కాదు, శ్రీలీల. శ్రీలీల 2001, జూన్ 14న అమెరికాలో పుట్టింది. కానీ పెరిగింది మాత్రం బెంగళూరులోనే. వాళ్ల అమ్మ డాక్టర్ స్వర్ణలత బెంగళూరులో ఫేమస్ గైనకాలజిస్ట్. ఆమె చాలా సంప్రదాయ కుటుంబం నుంచి వచ్చినా, శ్రీలీల సినిమాల వైపు అడుగులేసింది. ఎంబిబిఎస్ చదువుతూనే ఇండస్ట్రీకి వచ్చింది. 2021లో తన మెడికల్ స్టడీస్ కూడా పూర్తి చేసింది. చిన్నప్పటి నుంచే భరతనాట్యంలో ట్రైనింగ్ తీసుకున్న శ్రీలీల, 2019లో కన్నడ సినిమా కిస్‌తో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత భరాటే, బై టూ లవ్ లాంటి కన్నడ సినిమాలు చేసింది. తెలుగులో మాత్రం పెళ్లి సందీద సినిమాతో గ్రాండ్ ఎంట్రీ ఇచ్చి, ఇక్కడి కుర్రాళ్ల మనసు దోచేసింది. ఆ తర్వాత వెనక్కి తిరిగి చూసుకోలేదు. ధమాకా, స్కంద, భగవంత్ కేసరి, ఆదికేశవ, ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్, గుంటూరు కారం లాంటి సినిమాలతో దూసుకుపోతోంది.నటన, డ్యాన్స్ మాత్రమే కాదు.. శ్రీలీలకు సేవా గుణం కూడా ఎక్కువే. 2022, ఫిబ్రవరిలో, అంటే కేవలం 21 ఏళ్ల వయసులోనే, ఓ అనాథాశ్రమాన్ని సందర్శించినప్పుడు అక్కడ ఉన్న ఇద్దరు ప్రత్యేక అవసరాలున్న పిల్లలు గురు, శోభితను దత్తత తీసుకుని పెద్ద మనసు చాటుకుంది.



# 'బకాసుర రెస్టారెంట్' ఫస్ట్ లుక్

ప్రముఖ కమెడియన్, నటుడు ప్రవీణ్ త్వరలోనే భకాసుర అనే రెస్టారెంట్‌ను ప్రారంభించబోతున్నారు.. అనే న్యూస్ అందరిలోనూ కాస్త ఆసక్తి కలిగించి వైరల్‌గా మారింది. అయితే ప్రవీణ్ నటుడిగా బిజీగానే ఉన్నాడు కదా.. మరీ వ్యాపారంలోకి ఎందుకు వెళ్లుతున్నాడు అనే సందేహం కూడా అందరిలో కలిగింది. అయితే ఎట్టకేలకు ఇప్పుడు ఈ న్యూస్‌పై ఓ క్లారిటీ వచ్చింది. ప్రవీణ్ ఎటువంటి రెస్టారెంట్‌ను పెట్టడం లేదు.. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం పేరు భకాసుర రెస్టారెంట్. ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను చిత్రబృందం శుక్రవారం విడుదల చేసింది. ఈ ఫస్ట్ లుక్ పోస్టర్‌లో ప్రవీణ్ పెద్ద గరిటెతో వంట చేస్తుండటం, ఆ పక్కనే ఇతర పాత్రలు ఆ పోస్టర్‌లో కనిపిస్తున్నాయి. ఆ పోస్టర్‌లోనే గమనిస్తే వైవా హర్ష, షైనింగ్ ఫణి మరో వైపు విచిత్రంగా సమ్‌థింగ్ స్పెషల్ పాత్రలుగా కనిపిస్తున్నారు. ఎన్నో విజయవంతమైన చిత్రాలతో మంచి నటుడిగా, కమెడియన్‌గా అందరికి సుపరిచితుడైన ప్రవీణ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రంలో వైవా హర్ష టైటిల్ రోల్‌లో నటిస్తున్నారు. కృష్ణభగవాన్ ,షైనింగ్ ఫణి, కేజీఎఫ్ గరుడ రామ్, ఇతర ముఖ్య పాత్రలో యాక్ట్ చేస్తున్నారు. ఎస్‌జే శివ దర్శకుడిగా పరిచయం కాబోతున్న ఈ చిత్రాన్ని ఎస్‌జే మూవీస్ పతాకంపై లక్ష్మయ్య ఆచారి, జనార్ధన్ ఆచారి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ చిత్రం విడుదలకు సిద్ధమైంది. ప్రమోషనల్ భాగంగా ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ, హంగర్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. పూర్తి వినోదాత్మకంగా తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో నేటి యువతరంతో పాటు అన్ని వర్గాలు అలరించే అంశాలున్నాయి. ప్రతి సన్నివేశం అందరికి ఎంతో థ్రిల్లను పంచుతుంది. ప్రవీణ్ కెరీర్‌లో గుర్తుండిపోయే సినిమాగా ఇది ఉండబో తుంది. నటుడిగా ఆయనలోని మరో కోణాన్ని ఈ చిత్రంలో చూడబోతున్నారు. కొత్తదనం కోరుకునే ప్రేక్షకులకు మా చిత్రం తప్పకుండా నచ్చుతుందనే నమ్మకం ఉంది అన్నారు. ప్రవీణ్, వైవా హర్ష, షైనింగ్ ఫణి (బమ్‌చిక్ బంటి), కేజీఎఫ్ గరుడ రామ్, కృష్ణభగవాన్, శ్రీకాంత్ అయ్యంగార్, ఉప్పెన జయ కృష్ణ, వివేక్ దండు, అమర్, రామ్‌పటాస్ తదితరులు.



# సమ్మర్ క్యాంప్స్

వేసవి సెలవులు .. ఒత్తిడి వాతావరణం నుండి ఒక విరామం. పరీక్షలు అయిపోగానే వచ్చే వేసవి సెలవులు పిల్లలకు ఒక ఆటవిడుపు. పల్లెల్లో పిల్లలయితే చెరువుగట్లు, కాలువగట్లు, పొలాల వెంట తిరుగుతూ ఆడుకుంటారు. చెట్లు, గుట్టలు ఎక్కుతూ ప్రకృతితో మమేకమవుతారు. ఇక నగరాల్లో అయితే ఇలా సెలవులు వస్తాయో లేదో అలా సమ్మర్‌క్యాంపులకు పరుగు తీస్తారు. సాంకేతిక పరిజ్ఞానం నుంచి సృజనాత్మక రంగాల వరకూ, శారీరక దృఢత్వం నుంచి వ్యక్తిత్వ వికాసం వరకూ విస్తరించి ఉన్న ఈ క్యాంపులు, విద్యా జీవితానికి వెలకట్టలేని అనుభవాలను అందిస్తున్నాయి. రెండు నెలల కాలాన్ని ఇంటిపట్టునే ఉండి వృధా చేయకుండా ఇటు విజ్ఞానం, అటు వినోదం సమ్మిళితంగా సమ్మర్‌క్యాంపులు ఏర్పాటు చేయడం విశేషం. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఎప్పటికప్పుడు మారుతున్న అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకోవడానికి టెక్నికల్ స్కిల్స్ నేర్చుకోవడానికి ఈ తరం ఎక్కువ ఆసక్తి చూపిస్తుందనేది నమ్మదగ్గ విషయం. విద్య, వృత్తిపరమైన నైపుణ్యాలు ఎన్ని ఉన్నా



ఏదో ఒక కళలో ప్రావీణ్యముండటం ఈ తరంలో సెలబ్రిటీ హోదాగా మారింది. నగరవాసుల సక్సెస్‌మంత్ర ఏదైనా ఉందంటే అది ఆరోగ్యం, ఫిట్నెస్ అని చెప్పవచ్చు. ఆరోగ్యశిక్షణ, క్రీడలు, ఫిట్నెస్ రంగాలకు ప్రస్తుతం మంచి ఆదరణ ఉంది. ఈ శిక్షణల ద్వారా విద్యార్థుల్లో ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా, క్రమశిక్షణ, టీం వర్క్, ఫోకస్ వంటి విలువలు పెంపొందుతాయి. కేవలం చదువులు మాత్రమే కాదు, క్రీడలతో అంతర్జాతీయ గుర్తింపు, ఉన్నతస్థాయి జీవితానికి నాంది పలకవచ్చని చెపుతున్నాయి. సమ్మర్ క్యాంపుల ద్వారా విద్యార్థులు, యువత కొత్త ప్రపంచాన్ని అన్వేషించే అవకాశం పొందుతున్నారు.

తల్లిదండ్రులు తమ పిల్లల్లోని ఆసక్తి గుర్తించి, అనుగుణమైన శిక్షణలను ప్రోత్సహించగలిగితే భవిష్యత్తులో విశ్వాసంతో ముందుకు సాగుతారు.

## ఆధ్యాత్మికం

# శ్రీ వాసవీ కన్యకాదేవి

వైశ్యరాజ్యాన్ని ప్రజాను రంజకంగా పరిపాలిస్తుండిన ధర్మమూర్తి కుసుమశ్రేష్టి, కుసుమాంబ దంపతులకు పుత్రకామేష్టి యజ్ఞఫలంగా జన్మించింది వాసవి. మూడేండ్ల ప్రాయంలో బాలవాసవి ఒకనాడు అన్నము తినక మారాము చేసింది. తల్లి కుసుమాంబ ఆమెతో అన్నాన్ని తినిపించాలని, 'ఏయ్ బుజ్జీ! నోరు తెరు, నోరు తెరు' అని గద్దించింది. వాసవి నోరు తెరిచింది. బ్రహ్మాండమంతా గోచరించింది ఆ చిన్న నోటిలో! వాసవాంబను తన హృదయానికి హత్తుకొంది కుసుమాంబ. ఆమె కళ్లవెంట ఆనందభాష్పాలు జలజలరాలాయి. బాలవాసవికి ఐదేండ్ల వయసు వచ్చింది. పూజగదిలోని దేవీపీఠంమీద ఆశీనురాలై అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తింది. తాను పరమేశ్వరియేనని సూచనప్రాయంగా తెలిపింది. కన్యగా వాసవి 'త్రిలోకైక సౌందర్యవారాశిగ రూపొందినది'. చెలులతో కలిసిఉన్న వాసవిని పట్టపురాజు చూసి, 'ఔర! చుక్కలనడుమచందురునట్లు వెలిగెడు కన్నె ముందర వన్నె కాంచిన నగరుసుందరలందరొక లెక్కా' అనుకొన్నాడు. (పుట 352 'కన్యక' గురజాడ సాహిత్య సర్వస్వం) అది కేవలం ఆమె దేహసౌందర్యంకాదు, దైవీగుణసౌందర్యం. మానవునిలో సత్యము, శాంతము, కరుణ, అహింస, త్యాగము అను అయిదు గుణాలు పంచప్రాణములై వృద్ధి చెందాలన్నది ఆమె బోధ. వివాహ విషయమున వ్యక్తికి గల స్వాతంత్ర్యమును హరించు అధికారము ఎవ్వరికీ లేదనునది ఆమె అభిప్రాయము. ఆమె 'కన్యక'గానే జీవించాలనుకొంది. విష్ణువర్ధన మహరాజు ఆమెను బలాత్కారముగా వివాహమాడదలిచాడు. అలా జరగకుండా ఉండటానికి వాసవి అగ్నిగుండ ప్రవేశం చేసింది. తాను ప్రాణత్యాగాన్ని చేసింది. కానీ ఆ రాజును దూషించలేదు. రాజును శపించినది కదా అని కొందరంటారు. ఆమె శపించలేదని, 'విష్ణువర్ధనుని తలవేయి వ్రయ్యలుగ వ్రీలి పోగలదు' అని ఆకసము నుండి ఒక వాణి వినపడిందని శ్రీవాసవీ కన్యకాదేవి పురాణము (కొల్లిపర పాండురంగారావు) చెబుతుంది.

**- రాచమడుగు శ్రీనివాసులు**

# వయసు ఆటంకం కాదు..

'నేనేమన్నా చిన్న పిల్లనా.. చెప్పగానే ఇట్టే పట్టేయడానికి!' వయసుపై బడ్డ వాళ్లు ఇలాంటి మాటలు అనడం వింటూ ఉంటాం. కానీ ఒక కళో, నైపుణ్యమో నేర్చుకోవడానికి మనం చిన్నపిల్లలుగానే ఉండక్కర్లేదదు. నాట్యం, సంగీతం.. ఇలా నైపుణ్యం ఏదైనా సరే. చిన్న వయసు లోనే ఒంట పడతాయి. అన్న భావన మనలో ఉంటుంది. ఆ వయసుని గోల్డెన్ పీరియడ్ అంటుంటారు. కానీ ఒక విద్యని నేర్చుకోవడానికి గోల్డెన్ పీరియెడ్ అంటూ ఏదీ ఉండదు. చిన్న పిల్లలు ఎలా నేర్చుకుంటారో అంతేవేగంగా పెద్దవాళ్లు నేర్చుకుంటారు. ఆ నైపుణ్యాలని మర్చిపోతారు. పెద్ద వాళ్లకుండే బాధ్యతలు, నిద్రలేమి కారణంగా వాళ్లకే సమస్యాలేదని నిర్ధయించారు. కాబట్టి శ్రద్ధా, సాధనా తోడైతే ఎంత పెద్ద వయసు వాళ్లైయినా కొత్త అంశాలు నేర్చుకోవచ్చు.

## ఆరోగ్య భాగ్యం

# పల్మోనరీ టి.బి -2



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

కోయాగ్యోపతీ, ప్రోతాంబిన్ ఇండెక్స్ తక్కువుగా ఉన్నవారిలో, ఊపిరితిత్తుల్లో మచ్చలు, కేషియేషన్ ఎక్కువుగా ఉన్నవారిలో, బిలియరీ సిర్రోసిస్, లివర్ కణాల్లో ఆక్సిజన్ టెన్షన్ తక్కువుగా ఉన్న క్షయ మందుల వల్ల లివర్ డామేజ్ కావడం వల్ల హెపటోటాక్సిసిటీ ఏర్పడినప్పుడు (ఐసోనియా జెడ్, రిఫాంపినిన్, పైరజినా మైడ్ మందుల వల్ల, సూక్ష జీవుల మల్టీ డ్రగ్ రెసిస్టెన్స్ వల్ల, స్థూల కాయం వల్ల, కొన్ని రకాల వైరస్‌ల వల్ల వస్తుంది.

అంతే కాకుండా నాన్ కమ్యూనికబుల్ కారణాలు, ప్రైమరీ సిర్రోసిస్, వైరల్ హెపటైటీస్, విటమిన్ ఎ,డి, జింక్ లోపం, పోషకాహార లోపం ఉన్నవారిలో, కలుషిత ఆహారం తీసుకున్నవారిలో, రోగ నిరోధక శక్తి లేని ఎయిడ్స్ కేన్సర్, కరోనా రోగులు, క్రానిక్, కాలేయ వ్యాధులు, ఇన్ఫెక్టివ్ హైపాటిక్ గ్రాన్యులోమాటస్ రోగులు, లివర్ సిర్రోసిస్‌తో బాధ పడుతున్న రోగులు ఎక్స్‌ట్రా పల్మోనరీ క్షయవ్యాధికి గురవుతారు. అంతేగాకుండా కిడ్నీ రోగులు, హమోలిసిస్, పిత్తవాహికలు దెబ్బతిన్నప్పుడు పిత్తాశయం, ప్రాంకియాజ్ వ్యాధులున్న వారిలో కన్పిస్తుంది.

ఫాస్ట్ ఫుడ్ సంస్కృతి, మానవ జీవన విధానంలో అనేక మార్పులు రావడం, ఆహార అలవాట్లలో మార్పులు, కొవ్వు, చక్కెర, నూనె అధికంగా ఉన్న (పిజ్జా, బర్గర్‌లు) ఆహార పదార్థాల్ని తీసుకోవడం వల్ల ఫ్యాటీ లివర్‌తో బాధపడేవారిలో స్థూలకాయం, హెపాటో టాక్సిక్ మందుల వల్ల, హెపటైటిస్ వైరస్ వల్ల కాలేయ వ్యాధుల చరిత్ర ఉన్నవారిలో, గుండె జబ్బులున్న వారిలో హెపాటిక్ క్షయ వచ్చే అవకాశం ఉంది.

రకాలు: 1905లో రోలెస్టన్, మాక్‌నీ హెపాటిక్ క్షయలో అనేక రకాలున్నాయని గుర్తించారు.

1. ప్రైమరీ హెపాటిక్ క్షయ : ఇది అరుదుగా వస్తుంది. ఎందుకంటే లివర్‌లో ఆక్సిజన్ టెన్షన్ తక్కువుగా ఉండడం వల్ల క్షయ బాక్టీరియా లివర్‌కి చేరే అవకాశం తక్కువగా ఉంటుంది.

2. సెకండరీ హైపాటిక్ క్షయ : ఇది పల్మోనరీ ఉదరక్షయ వల్ల వస్తుంది. లివర్‌లో గ్రాన్యులోమాటస్, నెక్రోసిస్, ఫైబ్రోసిస్, కాల్సిఫికేషన్ వంటి స్టేజెస్‌కి గురికావడం వల్ల అనేక మార్పులు ఏర్పడతాయి. దాని ప్రకారం ఇది అనేకరకాలుగా కన్పిస్తుంది.

3. ట్యూబర్ క్యులోమా– దీన్నే గ్రాన్యులోమాటస్ డిసీజ్ అంటారు. ఇది 1–4 సెం.మీ మిలియరీ ట్యూబర్ క్యుల్స్ వల్ల వస్తుంది. లివర్‌కి అధిక రక్త సరఫరా ఉండడం, ఎక్కువ రెటిక్యులో ఎండోథిలియం కణాలుండటం పోర్టల్ సిరల ద్వారా రక్త ప్రసరణ అధికంగా ఉండడం వల్ల గ్రాన్యులోమాలు ఏర్పడడానికి అవకాశం ఉంది.

ఎ. లోకల్ (స్థానిక)హైపాటిక్ క్షయ : దీన్నే ట్యూబర్ క్యులోమా, మాక్రోనోడ్యులార్ హెపాటిక్ టి.బి, సూడోట్యూమరల్ హెపాటిక్ టి.బి అని అంటారు. ఇది 20% మందిలో కన్పిస్తుంది. ఇది జీర్ణాశయాంతర వ్యవస్థ ద్వారా వ్యాపిస్తుంది. ఇది పోర్టల్ సిర ద్వారా వ్యాపిస్తుంది. 1-3 సెం.మీ ట్యూబర్ క్యుల్స్ పోర్టల్‌లో సిర దగ్గర ఏర్పడతాయి. వీరిలో కాల్సిఫికేషన్ తక్కువగా ఉన్న ఎక్కువ సాంద్రత కల్గిన నోడ్యుల్స్ ఏర్పడతాయి. హెపాటిక్‌సెల్యులార్ డామేజ్ అవుతుంది. ఇది కాంప్లెక్స్ ప్రాసెస్ అనే చెప్పవచ్చు లివర్ టి.బి అబ్సెస్ సాధారణంగా లోకల్ హెపాటిక్ టి.బి. నుండి పుడుతుంది. దాని తర్వాతనే మిలియరీ హెపాటిక్ క్షయ కంటే స్థానిక హెపాటిక్ టిప.బి హెపా విరుద్ధంగా స్థానిక హెపాటిక్ క్షయ ఉన్నవారు సాధారణంగా ఆక్టివ్ పల్మోనరీ డిసీజ్‌ని కల్గి ఉండరు.

మిలియరీ హెపాటిక్ క్షయ : ఇది ఊపిరి తిత్తుల ఇన్ఫెక్షన్ వల్ల వ్యాపిస్తుంది. దీన్నే జనరలైజ్‌నడ క్షయ లేదా మెక్రోనొడ్యులార్ మిలియరీ టి.బి అని అంటారు. ఇది 80% మందిలో కన్పిస్తుంది. ఇది హెపాటిక్ ఆర్టరీ వ్యాపిస్తుంది.

# అల్లం దివ్యౌషధం

మన వంటగదిలో సులభంగా లభించే అల్లం కేవలం వంటకాలకు రుచిని అందించడమే కాదు, ఆరోగ్యానికి ఓ దివ్యౌషధంలా పనిచేస్తుంది. నెలరోజుల పాటు రోజూ చిన్న అల్లం ముక్కను ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల శరీరానికి ఎన్నో రకాల ప్రయోజనాలు కలుగుతాయని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. అల్లంలో అద్భుత గుణాలు దాగి ఉన్నవి. అల్లం ఘాటైన రుచిని కలిగి ఉండటమే కాకుండ, ఎన్నో ఔషధ గుణాలను తనలో నింపుకుంది. ఇందులో జింజెరాల్, షోగావోల్, జింజిబెరేన్‌వంటి శక్తివంతమైన బయోయాక్టివ్ సమ్మేళనాలతో పాటు విటమిన్లు, ఖనిజ లవణాలు పుష్కలంగా ఉంటాయి. శతాబ్దాలుగా అనేక రకాల అనారోగ్యాలను నయం చేయడానికి అల్లం సంప్రదాయ వైద్యంలో విరివిగా ఉపయోగిస్తున్నారు. అల్లంలో ఉండే 'జింజెరాల్' అనే పదార్థం వికారం, వాంతులు వంటి లక్షణాలను తగ్గించడానికి కూడా ఇది సహాయపడుతుంది. అలాగే 'షోగావోల్' అనే సమ్మేళనానికి నొప్పిని నివారించే గుణం ఉంది. ఇది కాన్సర్, గుండెజబ్బుల నివారణలోనూ తోడ్పడుతుందని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఇక అల్లంలోని 'జింజిబెరేన్' జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగుపరచడంలో ముఖ్య భూమిక పోషిస్తుంది. ఇవే కాకుండా అల్లానికి యాంటీ, డయామెటిక్ గుణాలు ఉన్నాయని, మెదడు పనితీరును మెరుగుపరుస్తుందని, రోగనిరోధకశక్తిని పెంచుతుందని పలు పరిశోధనల్లో వెల్లడైంది.



రోజూ దాదాపు 1.5 సెంటీమీటర్ల అల్లం ముక్కను చిన్న చిన్న ముక్కలుగా చేసి టీ, స్మూతీ లేదా కూరల్లో కలుపుకుని తీసుకోవడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయని సూచిస్తున్నారు.

# గుత్తిగన్నేరు

మొక్కను పింక్ గార్డేనియా, ప్రభ్ వింకా, గుత్తిగన్నేరు అని చాలా పేర్లతో పిలుస్తారు. రంగు, సువాసనలతో ఆకర్షించే ఇది అలంకరణ మొక్కగా పాపులర్. మొగ్గలు పింక్‌కలర్‌లో వచ్చినా విచ్చుకున్నాక లేత గులాబీ, తెలుపు ఛాయలోకి మారతాయి. ఆకులు ముదురాకుపచ్చ రంగులో లెదర్ లుక్‌లో మెరిసిపోతాయి. పింక్ గార్డేనియాకు ఔషధ గుణాలతో పాటు గాలిని శుద్ధి చేసే శక్తి ఉంది. ముఖ్యంగా హానికారక రసాయనాలు, టాక్సిన్లను తొలగిస్తుంది. ఈ మొక్కకు సూర్యకాంతి అందాలి. నీళ్ల రోజూ పోయాలి. వేపనూనెను పిచికారీ చేస్తే మొక్కకు చీడపీడల ప్రమాదం ఉండదు.



# తిరుమల భద్రత మరింత పటిష్టం!

## అలిపిరిలో ప్రత్యేకంగా ఎపిఎస్‌పి చెక్‌పోస్టు

## కొండకొచ్చే అన్ని మార్గాల్లో నిరంతర తనిఖీలు

**తిరుమల,మే 2 ప్రభాతవార్తప్రతినిధి:** ప్రముఖ యాత్రాస్థలంగా, ఆధ్యాత్మిక్షేత్రంగా విరాజిల్లుతున్న తిరుపతినగరంతోబాటు హిందూ పుణ్యక్షేత్రం తిరుమలలో భద్రతను మరింతగా పటిష్టంచేసేదిశగా తిరుపతి జిల్లా పోలీసు యంత్రాంగం కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా తిరుమలకు వచ్చే అన్ని ప్రవేశ మార్గాల్లో వాహనాలను, భక్తును క్షుణ్ణంగా నిరంతరం తనిఖీ చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇప్పటికే తిరుపతి అలిపిరిలో సప్తగిరి తనిఖీ కేంద్రం ఉండగా అదనంగా కొత్తగా ఏపిఎస్‌పి చెక్‌పోస్టును ఏర్పాటుచేయాలని కూలంకుషంగా చర్చించి నిర్ణయం తీసుకున్నారు. దీనివల్ల తిరుమలకు



తిరుమల ఘాట్‌లో లింకురోడ్డువద్ద భద్రత సిబ్బంది ఆకస్మిక తనిఖీలు

అసాంఘిక శక్తులు, నిషేధిత పదార్థాలు తీసుకురాకుండా నియంత్రించడమేగాక పూర్తిగా తిరుమలను భద్రతావలయంలో ఉంచేందుకు దోహదపడుతుంది. ప్రస్తుత పరిణామాలు, పరిస్థితుల్లో తిరుపతి,తిరుమల భద్రతపై జిల్లా పోలీసుయంత్రాంగం కఠినమైన నిర్ణయాలు తీసుకుని అమలుచేయాలని భావించారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆధ్వర్యంలో అదనపు ఎస్పీలు ఐ.రామకృష్ణ, రవిమనోహరచారి, డిఎస్పీలు , సిఐలు , ఇంటెలిజెన్స్,విజిలెన్స్ అధికారులుతో ఎస్పీ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అందరి అభిప్రాయాలుతో భద్రతావిషయంలో ముందుకు వెళ్ళనున్నారు. ఇప్పటికే తిరుమల,తిరుపతిలో భద్రతను పటిష్టం చేసి 24గంటలూ డేగకళ్ళతో పహరాకాస్తున్నారు. ఇంకా తిరుపతిలో 24గంటలూ యాత్రికుల రాకపోకలతో కిటకిటలాడుతోంది. అయితే ఇకపై అర్ధరాత్రి దాటిన తరువాత అనుమానాస్పదంగా సంచరించే, కొత్తవ్యక్తులపై మరింత నిఘా ఉంచి వారి వేలిముద్రలు తీసుకునేందుకు పోలీసులు అడుగులు వేస్తున్నారు. తిరుపతి,తిరుమలలో నిత్యం తనిఖీలు చేయాలని, అనధికారిహాకర్ల భరతం పట్టాలని జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు ఆదేశించారు. తిరుమలకొండదిగువన 3 సిసికెమెరాలు, కొండకు వేళ్ళేమార్గంలో 3 సిసికెమెరాలు ఏర్పాటుచేసి 24గంటలూ పర్యవేక్షణ చేయాలన్నారు. జిల్లాల మధ్య సమాచారం ఉంటే నేరస్తుల కదలికలను పసిగట్టి పట్టుకోవడం సులభమవుతుందన్నారు. కీలక ప్రదేశాల్లో నిరంతరం తనిఖీలు తప్పవన్నారు. ఇతర రాష్ట్రాలవారిని గుర్తించి వారివద్ద ఉన్న గుర్తింపుకార్డులతోబాటు వారి చిరునామాలు నిరంతరం తనికీ చేయాలన్నారు. ప్రతిరోజూ హోంస్టేలు, లాడ్జీలు,.హోటళ్ళలో తనిఖీలు చేయాలని ఎస్పీ స్పష్టంచేశారు. తిరుమలలో నిర్మాణంలో భవనాల వద్ద పనిచేసే కార్మికులపై పోలీసులు నిఘా ఉంచాలని, ప్రైవేటు కాంట్రాక్టు పెళ్ళిళ్ళ బ్రోకర్లు, లేబర్‌కాంట్రాక్టర్లను తనిఖీచేయాలన్నారు. ఒక్కో సెక్టార్‌లో హాకర్లును తనిఖీచేసి వివరాలు సేకరించాలన్నారు. వారివారి ఆధార్‌కార్డులను తరచూ తనిఖీ చేయాలన్నారు. కీలక ప్రాంతాల్లో 24గంటలూ తనిఖీలు, అలర్టుగా ఉండాలన్నారు.

# కులగణన అంశంలో తెలంగాణ ప్రభుత్వం దేశానికే దిక్సూచి

## కేంద్రం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకం: స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్.మే2:** కులగణన అంశంలో తెలంగాణ ప్రభుత్వం దేశానికే దిక్సూచిగా నిలిచిందని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ స్పష్టం చేశారు. జనాభా లెక్కలు,కులగణనపై కేంద్రం తీసుకున్న నిర్ణయంపై ట్విట్టర్ వేదికగా శుక్రవారం స్పందించారు. ఈ సందర్భంగా స్పీకర్... దేశంలో జనాభా లెక్కలతో పాటు కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకం అని,కులగణనతో దేశంలో మెజారిటీగా ఉన్న దళిత,గిరిజన,వెనుకబడిన వర్గాలకు సరైన న్యాయం జరుగుతుందని తెలిపారు. అంతేగాక పెరిగిన జనాభాకు అనుగుణంగా వారికి విద్యా,ఉద్యోగం, రాజకీయ పదవులలో న్యాయమైన వాటా లభిస్తుందని అన్నారు. జనాభా లెక్కించడం ద్వారా నిధులు,సంక్షేమ పథకాలు అందుతాయని,రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేడ్కర్ కన్న కలలు నిజం అవుతాయని స్పష్టం చేశారు. అలాగే తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో కులగణన పూర్తి చేసి, తెలంగాణ దేశానికే దిక్సూచిగా నిలిచిందని వివరించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని శాసనసభ ఏకగ్రీవంగా తీర్మాణం చేసిందని, రాష్ట్ర శాసనసభలో ఆమోదం పొందిన బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదించి రాష్ట్రపతికి పంపినందుకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ధన్యవాదాలు తెలిపారు. శాసనసభలో ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించి అమలు చేస్తున్న మొదటి రాష్ట్రం తెలంగాణ అని, తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వంలో వెనుకబడిన తరగతులకు పెద్దపీట వేస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి,మంత్రులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఇక కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా త్వరగా కులగణన పూర్తి చేయాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కోరారు.




డిప్యూటీ సిఎం పవన్‌ను ప్రధాని మోడీ దగ్గరకు పిలిచి చాక్లెట్ ఇవ్వడంతో నవ్వుతున్న సిఎం చంద్రబాబు

# పవన్‌ను ప్రత్యేకంగా పిలిచి చాక్లెట్ ఇచ్చిన ప్రధాని నరేంద్ర మోడీ

## మీ హృదయం మాదిరి ఇది తియ్యనది అంటూ చమత్కరించిన పిఎం

**విజయవాడ,మే2,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతి పున:ప్రారంభ కార్యక్రమంలో ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. సభా వేదికపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు ప్రధాని మోదీ తన దగ్గరకు ప్రత్యేకంగా పిలిచారు.ఆయనకు ప్రత్యేక బహుమతి( స్పెషల్ గిఫ్ట్)ఇచ్చారు.అత్యంత ఆసక్తికరమైన ఈ పరిణామంలో నవ్వులు విరిసాయి. పవన్ ప్రసంగం తర్వాత స్వయంగా ప్రధాని మోదీ . పవన్‌ను తన వద్దకు రమ్మని ఆహ్వానించారు. ఆపై డిప్యూటీ సీఎంకు అత్యంత ఖరీదైన చాక్లెట్‌ను గిఫ్ట్‌గా ఇచ్చారు.మీ హృదయం మాదిరిగా ఇది తియ్యనది అంటూ చమత్కరించారు. ప్రధాన మంత్రి చాక్లెట్‌ను తీసుకున్న పవన్ ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. పవన్‌కు మోదీ చాక్లెట్ ఇవ్వడంతో పక్కనే ఉన్న సీఎం చంద్రబాబు కూడా నవ్వులు పూయించారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై సిఎం నాన్చుడు ధోరణి సరికాదు: ఎఐఎస్ఎఫ్

## పరీక్షలు నిర్వహించలేని పరిస్థితి నెలకొందంటూ ఆవేదన

**హైదరాబాద్, మే 02, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రియింబర్స్ మెంట్, స్కాలర్‌షిప్ బకాయిల విడుదలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాన్చుడు దోరణితో వ్యవహారించడం సరైంది కాదని అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) తెలంగాణ రాష్ట్ర కమిటీ మండిపడింది. రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం విడుదల చేయక పోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సంఘం రాష్ట్ర అధ్యక్షులు మణికంఠరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయకపోవడంతో రాష్ట్రం లోని డిగ్రీ కళాశాల యాజమాన్యాలు సెమిస్టర్ పరీక్షలు నిర్వహించడం లేదని తెలిపారు. కాకతీయ యూనివర్సిటీతోపాటు పాలమూరు, తెలంగాణ, మహాత్మా గాంధీ, శాతవాహన యూనివర్సిటీల పరిధిలోని ఫీజు బకాయిల విడుదల లేక, కళాశాలల నిర్వహణ జరగడం లేదన్నారు. అప్పులు తెచ్చి మరి కళాశాలలు నిర్వహిస్తున్నామని .. ఫీజు బకా యిలు విడుదల చేసే వరకు సెమిస్టర్ పరీక్షలు నిర్వహించమని కాలేజీ యాజమాన్యాలు ప్రకటిం చాయన్నారు. ఇప్పటికే అనేక యూనివర్సిటీల్లో పరీక్షలు వాయిదా పడ్డప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని.. ప్రభుత్వ నిర్ణయంతో డిగ్రీ మూడో సంవత్సరం 6వ సెమిస్టర్ పరీక్షలు రాసే విద్యార్థులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ బకాయిల విడుదలపై ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల విద్యార్థుల చదువులకు ఆటంకాలు కలుగుతున్నాయన్నారు. విద్యాశాఖను తన దగ్గరే పెట్టుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే డిగ్రీ కళాశాల యాజమాన్యాలతో చర్చలు జరిపి బకాయిలు విడుదల చేసి.. పరీక్షల నిర్వహణ జరిగేలా చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# అవసరమైతే ఇండియా కోసం చనిపోవడానికి సిద్ధం

## సినీ కొరియోగ్రాఫర్ జానీమాస్టర్

**కావలి, (నెల్లూరు)మే 2 ప్రభాతవార్త** ఇండియన్ ఫ్లాగ్‌లో మూడు రంగులు ఎలా ఉన్నాయో ఇండియాపై దాడిచేసేవారికి హిందూ, ముస్లిం, క్రిష్టియన్ ఏకమై ఎదుర్కొంటామని అవసరమైతే ఇండియాకోసం చనిపోవడానికైనా సిద్ధమేనని ప్రముఖ సినీ కొరియోగ్రాఫర్ జానీమాస్టర్ తెలిపారు. కావలి ఆనాలవారివీధిలో నివసిస్తున్న ఉగ్రవాదుల దాడుల్లో మృతిచెందిన మధుసూధన్ కుటుంబాన్ని జానీమాస్టర్ కలిశారు. చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండించారు. ఎన్ని కుట్రలు పన్నినా ఇండియాలో అందరం కలిసి ఉంటామని హెచ్చరికలు చేశారు. ఉగ్రవాదులు ఇలాంటి దాడులకు పాల్పడడం దారుణ మన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ మధుసూధన్ కుటుంబసభ్యులను ఆదుకోవడం ఆ కుటుంబానికి ధైర్యాన్నిచ్చిందన్నారు. ఉగ్రవాదుల దాడుల్లో మృతిచెందిన 26 మంది కుటుంబాలను అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలన్నారు. కొందరు కులాలు, ప్రాంతాల మధ్య కూడా చిచ్చుపెట్టాలని చూస్తున్నా రన్నారు. ఇది మంచి పద్ధతి కాదన్నారు. మేమందరం భారతీయులమని అవసరమైతే ఇండియా కోసం ప్రాణాలర్పించడానికైనా సిద్ధమేనంటు కుటుంబసభ్యులకు ధైర్యాన్నిచ్చారు.



# మధుసూధన్ కుటుంబానికి అన్నివిధాలా అండగా ఉంటాం!

## వారి బిడ్డలకు ఉచితంగా మా కళాశాలల్లో చదివిస్తాం :సినీ హీరో మంచు విష్ణు

**కావలి, (నెల్లూరు)మే2 ప్రభాతవార్త** ఉగ్రవాదుల చేతుల్లో బలైన మధుసూధన్ కుటుంబానికి అన్నివిధాలా అండగా ఉంటామని సినీ హీరో మంచువిష్ణు తెలిపారు. కావలి పట్టణ ఆనాలవారి వీధిలో నివసిస్తున్న మధుసూధన్ కుటుంబసభ్యులను శుక్రవారం పరామర్శించారు. చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులతో ఆయన మాట్లాడారు. మధుసూధన్ కుటుంబానికి అన్నివిధాలుగా అండగా ఉంటామన్నారు. ఆయన బిడ్డలకు తమ పాఠశాలల్లో, కళాశాలల్లో ఉచితంగా విద్యనందిస్తామన్నారు. ఏ సహాయం కావాలన్నా అండగా ఉంటామన్నారు.

# డెన్‌లో డాన్‌గా ముంబై



## కిందకి పడిపోయిన ఆర్సీబీ
## ప్లే ఆఫ్ బెర్త్ కోసం పోటీ
## మాజీ ఛాంపియన్లు ఎలిమినేట్స్

**న్యూఢిల్లీ:** ఐపిఎల్ 2025 పాయింట్స్ టేబుల్‌లో ముంబై ఇండియన్స్ తొలిసారి టాప్ ప్లేస్‌కు చేరుకుంది. ఐపిఎల్ ప్లే ఆఫ్స్‌కు దగ్గరవుతున్న కొద్దీ ముంబై ఇండియన్స్ తన తడాఖాతో పాయింట్స్ టేబుల్ టాప్‌లో తొడగొట్టింది. సీజన్ ఆరంభంలో అట్టడుగు స్థానాలతో పోటీపడిన ముంబై ఇండియన్స్ ఇప్పుడు టాప్ ప్లేస్‌లో కింగ్‌లా కూర్చుంది. మొదటి ఐదు మ్యాచ్‌లలో కేవలం ఒక్కటే గెలిచి హార్దిక్ సేన, ఆ తర్వాత వరుసగా ఆరు విజయాలతో ముంబై ఈజ్ బ్యాక్ అని చాటిచెప్పింది. ఇప్పటివరకు 11 మ్యాచ్‌లు ఆడిన ముంబై ఇండియన్స్ ఏడు విజయాలతో టేబుల్ టాప్‌లో నిలిచింది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కంటే నెట్ రన్‌రేట్ ఎక్కువ ఉండటంతో ముంబై ఫస్ట్ ప్లేస్‌కి చేరుకుంది. వరుసగా ఆరు మ్యాచ్‌లలో విజయం సాధించిన ముంబై ఇండియన్స్ 14 పాయింట్లతో మొదటి స్థానంలో నిలిచింది. ఆర్సీబీకి కూడా 14 పాయింట్లు ఉన్నప్పటికీ నెట్ రన్‌రేట్ కారణంగా రెండో స్థానానికి వెళ్లాల్సి వచ్చింది. పంజాబ్ కింగ్స్, గుజరాత్ టైటాన్స్, ఢిల్లీ క్యాపిటల్స్, లక్నో జట్లు ప్లేఆఫ్ బెర్త్ కోసం పోటీ పడుతున్నాయి. సీఎస్కే, రాజస్థాన్ టోర్నీ నుంచి ఎలిమినేట్ అయ్యాయి. ఇక ఢిల్లీ క్యాపిటల్స్‌తో మొదలుపెట్టి వరుసగా సన్‌రైజర్స్ హైదరాబాద్, చెన్నై సూపర్ కింగ్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్, లక్నో సూపర్ జెయింట్స్, రాజస్థాన్ రాయల్స్‌పై ముంబై ఇండియన్స్ వరుసగా ఆరు మ్యాచ్‌లు గెలిచింది. 14 పాయింట్లతో 1.274 నెట్ రన్‌రేట్‌తో టాప్ ప్లేస్‌లో నిలిచింది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు పది మ్యాచ్‌లలో ఏడు గెలిచి 0.521 రన్‌రేట్‌తో రెండో స్థానంలో కొనసాగుతోంది. మరో పక్క పంజాబ్ కింగ్స్, గుజరాత్ టైటాన్స్, ఢిల్లీ క్యాపిటల్స్, లక్నో సూపర్ జెయింట్స్ జట్టు ప్లే ఆఫ్ బెర్త్ కోసం పోటీపడుతున్నాయి. పంజాబ్ కింగ్స్ పది మ్యాచ్‌లలో ఆరు గెలిచి, మరో మ్యాచ్ డ్రా కావడంతో 13పాయింట్లతో 0.199 రన్‌రేట్‌తో మూడో స్థానంలో ఉంది. గుజరాత్ టైటాన్స్ తొమ్మిది మ్యాచ్‌లలో 12 పాయింట్లతో 0.748 నెట్ రన్‌రేట్‌తో నాలుగో స్థానంలో కొనసాగుతోంది. ఢిల్లీ క్యాపిటల్స్ కూడా పది మ్యాచ్‌లు ఆడి 12 పాయింట్లతో 0.362 రన్‌రేట్‌తో ఐదో స్థానంలో ఉండగా, లక్నో పది పాయింట్లతో 0.325 రన్‌రేట్‌తో ఆరో స్థానానికి పడిపోయింది. కోల్‌కతా నైట్ రైడర్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లకు దాదాపు ప్లే ఆఫ్ ఆశలు లేనట్టే అని చెప్పొచ్చు. భారీ అద్భుతం జరిగితే తప్ప ఈ రెండు జట్లు ప్లే ఆఫ్‌కు చేరుకోలేవు. కేకేఆర్ తొమ్మిది పాయింట్లతో ఏడో స్థానంలో కొనసాగుతుండగా, సన్‌రైజర్స్ ఆరు పాయింట్లతో తొమ్మిదో స్థానంలో ఉంది. మాజీ ఛాంపియన్లు ఎలిమినేట్ ఐపీఎల్‌లో ఐదు ట్రోఫీలు గెలుచుకున్న చెన్నై సూపర్ కింగ్స్ ఈ సీజన్ నుంచి ఫస్ట్ ఎలిమినేట్ అయినజట్టుగా నిలవగా, ముంబైపై ఓటమి తర్వాత రాజస్థాన్ కూడా ఎలిమినేట్ అయింది. రాజస్థాన్ రాయల్స్ ఆరు పాయింట్లతో ఎనిమిదో స్థానంలో ఉండగా, సీఎస్కే నాలుగు పాయింట్లతో అట్టడుగున పదో స్థానంలో ఉంది.



## ఫైనల్లో మలేషియా ఆశలు గల్లంతు
### భారత్‌కు ఓదార్పు విజయం

**న్యూఢిల్లీ:** క్వార్టర్ ఫైనల్స్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ చైనాచేతిలో 0-3తేడాతో ఓడిపోవడంతో మలేషియా సుదిర్మాన్ కప్ ప్రచారం ముగిసింది. మొదటి సర్వ్‌కు ముందే, జియామెన్‌లోని ఫెంగ్‌హువాంగ్ జిమ్నాసియంలో 13 సార్లు ఛాంపియన్‌గా నిలిచిన మలేషియాతో తలపడటం చైనాకు పెద్ద సవాల్ అయినా, చివరకు దాన్ని అధిగమించింది. మిక్స్‌డ్ డబుల్స్ జోడీ చెన్ టాంగ్ జీతో ఈ వీ మలేషియాకు సానుకూల ఆరంభాన్ని అందించే ప్రయత్నంలో తమ సర్వస్వం అందించారు, కానీ ఫెంగ్ యాంజెహు వాంగ్ డాంగ్‌పింగ్‌ను నిర్వహించడం చాలా కష్టంగా అనిపించింది. ఎంత కష్టపడినా, టాంగ్ జీ మరియు ఈ వీ 49 నిమిషాల్లో 17-21, 17-21 తేడాతో ఓడిపోయారు. గ్రూప్ దశలో ప్రపంచ 8వ ర్యాంకర్ కోడై నరోకాను అద్భుతంగా ప్రదర్శించిన తర్వాత ఊపందుకున్న పురుషుల సింగిల్స్ షట్లర్ లియోంగ్ జున్ హావో, ప్రపంచ 1వ ర్యాంకర్ షి యుకిపై అదే ప్రదర్శనను పునరావృతం చేయలేకపోయాడు. జున్ హావో అసాధారణంగా కనిపించాడు మరియు యుకికి సరితూగలేకపోయాడు, చైనా తన రెండవ పాయింట్‌ను 38 నిమిషాల్లో 6-21, 14-21 తేడాతో ఓడిపోయింది. మలేషియా ఫైనల్ ఆశాకిరణం కె. లెట్షానా కూడా టోక్యో 2020 ఒలింపిక్ బంగారు పతక విజేత చెన్ యుఫీపై కఠినంగా వ్యవహరించినా ఫలితం లేకపోయింది. కేవలం 30 నిమిషాల్లో 8-21, 7-21 తేడాతో ఓడిపోయింది. గత రెండు ఎడిషన్లలో వంటా (2021) మరియు సుజౌ (2023)లలో చేసినట్లుగా, కనీసం పతకంతో తిరిగి రావాలనే మలేషియా ఆశలకు ఈ ఓటమి ముగింపు పలికింది. ఇక ప్రతిష్టాత్మక సుదిర్మన్ బ్యాడ్మింటన్ ఫైనల్స్‌లో వరుసగా రెండు మ్యాచ్‌లు ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించిన భారత జట్టుకు ఓదార్పు విజయం. గ్రూప్ దశలో భాగంగా జరిగిన చివరి మ్యాచ్‌లో భారత్.. 32తో ఇంగ్లండ్‌ను ఓడించింది. మహిళల సింగిల్స్‌లో అనుపమ 21-12, 21-16తో మియులిన్‌ను ఓడించి ఆరంభంలోనే ఆధిక్యం అందించింది. కరుణాకరన్ 18-21, 22-20, 21-13తో హ్యారీను చిత్తు చేశాడు.

## ఉమెన్స్ వన్డే ప్రపంచ కప్‌కు
# భారత్ ఆతిథ్యం

**న్యూఢిల్లీ:** భారత్‌లో జరిగే వన్డే ప్రపంచకప్-2025కి అర్హత సాధించిన పాకిస్తాన్‌తో హైబ్రిడ్ మోడ్‌లో టోర్నమెంట్ జరగనుంది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఐసీసీ ఉమెన్స్ వన్డే ప్రపంచకప్ మెగా టోర్నీ జరగనుంది. సెప్టెంబర్ 29 నుంచి అక్టోబర్ 26 వరకు జరిగే ఈ మెగా టోర్నమెంట్‌కు భారతదేశం ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ మెగాటోర్నీకి ఫాతిమా సనా నేతృత్వంలోని పాకిస్తాన్ జట్టు అర్హత సాధించింది. ఇక పాక్ జట్టు వన్డే ప్రపంచ కప్ 2025 క్వాలిఫై కావడంతో ఈ మెగా టోర్నీని హైబ్రిడ్ మోడ్‌లో నిర్వహించనున్నారు. పాక్ ఆడే మ్యాచ్‌లను ఏ దేశంలో నిర్వహిస్తారు అన్న దానిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ఈ మెగా టోర్నీలో ఆతిథ్య హోదాలో భారత్ ఆడనుండగా, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, దక్షిణాఫ్రికా, శ్రీలంక, న్యూజిలాండ్ ర్యాంకింగ్స్‌లో తొలి ఆరు స్థానాల్లో నిలిచి అర్హత సాధించాయి. క్వాలిఫయర్స్‌లో ఆడి పాక్ అర్హత సాధించగా మరో స్థానం బంగ్లాదేశ్ సంపాదించింది. ఈ ఏడాది జరిగిన మెన్స్ ఛాంపియన్స్ ట్రోఫీ-2025కు పాకిస్థాన్ ఆతిథ్యం ఇచ్చింది. అయితే భద్రతా కారణాల దృష్ట్యా భారత జట్టును పాక్‌కు పంపలేమని బిసిసిఐ ఐసిసికి తెలియజేసింది. ఈ క్రమంలో ఐసిసి సమక్షంలో బిసిసిఐ, పిసిబి బోర్డుల మధ్య హైబ్రిడ్ మోడ్‌కు అంగీకారం కుదిరింది. ఛాంపియన్స్ 2025తో పాటు భవిష్యత్తులో జరగనున్న అన్ని టోర్నీల్లో భారత్, పాక్ జట్లు తటస్థ వేదికల్లోనే ఆడతాయి.

## మాడ్రిడ్ ఓపెన్ టైటిల్ సెమీస్‌లో..
# కోకో గౌఫ్ సంచలన విజయం
### వరల్డ్ ఛాంపియన్ స్వియాటెక్ ఘోర పరాజయం



**న్యూఢిల్లీ:** పోలిష్ ప్రపంచ నంబర్ టూ మరియు ఐదు సార్లు గ్రాండ్ స్లామ్ విజేత, రెండవ ర్యాంక్‌లో ఉన్న ఇగా స్వియాటెక్ ఒక్క బ్రేక్ పాయింట్‌ను కూడా సాధించ లేక పోయింది మరియు ఆమె ఎదుర్కొన్న ఏడు బ్రేక్ పాయింట్ లలో రెండింటిని ఒక గంటా ఆరు నిమిషా ల్లోనే కాపాడుకుంది. జరిగిన సెమీఫైనల్లో ప్రస్తుత ఛాంపియన్ ఇగా స్వియాటెక్ కోకో గౌఫ్ చేతిలో 6-1, 6-1 తేడాతో ఘోర పరాజయం పాలైంది. అమెరికన్ క్రీడాకారిణి మాడ్రిడ్ ఓపెన్ టైటిల్ కోసం ప్రపంచ నంబర్ వన్ అరినా సబలెంకాను ఎదుర్కోనుంది. సెమీఫైనల్ మ్యాచ్‌లో విజయం సాధించిన తర్వాత అమెరికాకు చెందిన కోకో గౌఫ్ సంబరాలు చేసుకుంటున్నారు. రెండవ ర్యాంకర్ స్వియాటెక్ గౌఫ్‌పై ఐదుసార్లు సర్వీస్‌ను వదులుకుంది. సాధారణంగా క్లే కోర్ట్ మీద అద్భుతంగాఉండే స్వియాటెక్, మాడ్రిడ్ టైటిల్ డిఫెన్స్ సమయంలో ఇబ్బంది పడింది. ఆమె అలెగ్జాండ్రా ఈలా మరియు డయానా ష్నైడర్‌లపై సెట్‌లను కోల్పోయింది, ఆపై కేవలం 24 నిమిషాల్లో మాడిసన్ కీస్ చేతిలో బాగెల్‌ను ఎదుర్కొంది. అయితే, 23ఏళ్ల పోల్ అమెరికన్‌ను ఓడించడా నికి బలంగా పుంజుకుని మొదటిసారి స్వియా టెక్‌ను ఓడించాడు. ఈ తాజా ఓటమితో, మేనెలలో తన ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్‌ను కాపాడుకునే ముందు, స్వియాటెక్‌కు రాబోయే ఇటాలియన్ ఓపెన్ మాత్రమే విజయాల బాటలో తిరిగి రావడానికి సహాయపడుతుంది.

## చెస్ టోర్నీలో ప్రజ్ఞాకు మూడో ప్లేస్



**న్యూఢిల్లీ:** ఇండియా గ్రాండ్ మాస్టర్ ఆర్. ప్రజ్ఞానంద (20.5 పాయింట్లు) సూపర్బెట్ ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ టోర్నీలో మూడో స్థానంలో నిలిచాడు. పోలెండ్‌లోని వార్సా వేదికగా జరిగిన ఫైనల్ రౌండ్లో ప్రజ్ఞా తొలి ఐదు గేమ్‌ల్లో ఒక్క పాయింట్ మాత్రమే సాధించాడు. కానీ సెకండాఫ్‌లో ఇండియన్ మాస్టర్ వరుసగా డుడా, తపలోవ్, అరవింద్, గావ్రిలెసెక్‌ను ఓడించాడు. దీంతో తొమ్మిది గేమ్‌ల్లో ఐదు పాయింట్లను సాధించడంతో మూడో ప్లేస్ ఖాయమైంది. వ్లాదిమిర్ ఫడోసీవ్ (స్లోవేనియా) 26.5 పాయింట్లతో టైటిల్‌ను గెలుచుకోగా, మ్యాక్సీమ్ వాచిర్ లాగ్రెవ్ (ఫ్రాన్స్) 21.5 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచాడు. ఇండియాకు చెందిన అరవింద్ చిదంబరం 17 పాయింట్లతో ఎనిమిదో స్థానంతో సరిపెట్టుకున్నాడు. ఈ నెల 7 నుంచి మొదలయ్యే క్లాసికల్ ఈవెంట్లో ప్రజ్ఞానందతో పాటు గుకేశ్ బరిలోకి దిగనున్నాడు. అమెరికన్ ద్వయం కరువానా, వెస్లీ సో, నోడిర్బెక్ అబ్దుసత్తారోవ్ (ఉజ్బెకిస్తాన్) పోటీలో ఉన్నారు. రొమేనియా రాజధాని బుకారెస్ట్లో ఈ టోర్నీ జరగనుంది.

# ఎయిరిండియాకు రూ.5వేల కోట్ల నష్టం!

**న్యూఢిల్లీ, మే 2:** పహల్గాం ఉగ్ర దాడితో తలెత్తిన ఉద్రిక్తతల వల్ల పాక్ గగనతలం ఏడాది పాటు మూసివేతతో ఎయిర్ ఇండియా సంస్థకు రూ.5 వేల కోట్ల వరకు నష్టం వాటిల్లనుంది. ఈ విషయాన్ని ఆంగ్ల వార్తా సంస్థ పీటీఐ వెల్లడించింది. పాక్ పై భారత్ తీసుకొన్న దౌత్యపరమైన చర్యలకు ప్రతిగా వారు ఈ నిర్ణయం తీసుకొన్నారు. ఎయిర్ ఇండియా సహా, ఇండిగో, స్పైస్‌జెట్ వంటి విమానయాన సంస్థలు తాజాగా సూచనలు, సలహాలను పౌర వైమానిక శాఖకు తెలియజేశాయి. ఈ నేపథ్యంలో వీటిని పరిశీలించి తగిన పరిష్కారం వెతికే పనిలో ఆ శాఖ తలమునకలైంది. ఈ క్రమంలో ఏడాదిపాటు పాక్ గగనతలం మూసివేస్తే తమకు సుమారు 600 మిలియన్ డాలర్లు (రూ.5 వేల కోట్లు) నష్టం వాటిల్లుతుందని ఎయిర్ ఇండియా పేర్కొంది. ఈనేపథ్యంలో ఆ వైమానిక సంస్థ పలు ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి పెట్టింది. ఈ విషయంపై ఆ సంస్థ నుంచి ఎటువంటి అధికారిక వ్యాఖ్యలు వెలువడలేదు. మనదేశంలో ఎయిర్ ఇండియా, ఎయిర్‌ఇండియా ఎక్స్‌ప్రెస్, ఇండిగో, స్పైస్‌జెట్, ఆకాశా ఎయిర్ అంతర్జాతీయ సర్వీసులను నడుపుతున్నాయి. ఈ మేరకు ఏప్రిల్ 28న పౌర విమాన యాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు మన విమానయాన సంస్థలతో కలిసి ప్రత్యామ్నాయాలపై కసరత్తు చేస్తున్నారు. పాక్ నిర్ణయం ప్రభావం ఉత్తర భారత్‌లోని నగరాల నుంచి నడిచే సర్వీసులపై పడుతుంది. మన వైమానిక సంస్థలకు వారానికి రూ.77 కోట్ల అదనపు భారం పడొచ్చని అంచనా. ఇక భారత్ కూడా గత బుధవారం నుంచి పాకిస్థాన్ విమానాలకు మే 23వ తేదీ వరకు గగనతలం మూసివేసింది.





# టాటా ఆల్ట్రోజ్‌కు ఫేస్‌లిఫ్ట్

**ముంబై, మే 2:** ఆటోమొబైల్ ఇండస్ట్రీలో మే నెలలో సందడి వాతావరణం కనిపించనుంది. కొత్తగా అప్‌డేట్‌లు ఏవీ లేకపోవడంతో ఏప్రిల్ నెల చప్పగా సాగిపోయింది. ఈ నెలలో మాత్రం కార్లకు సంబంధించిన కొన్ని అప్‌డేట్స్ వాహన ప్రియులను అలరించనున్నాయి. ఆ వివరాలు ఇవీ..టాటా మోటార్స్‌కు చెందిన ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ టాటా ఆల్ట్రోజ్ ఫేస్ లిఫ్ట్ ఈ నెల రాబోతోంది. ఎక్స్‌టీరియర్ పరంగా బంపర్లు, అలాయ్ వీల్స్ వంటి చిన్నచిన్న మార్పులతో రాబోతున్న ఈ కారులో ఇంటీరియర్ పరంగా చాలావరకు మార్పులు చేయనున్నట్లు సమాచారం. సీఎన్‌జీ, పెట్రోల్, టర్బో పెట్రోల్, డీజిల్ ఇంజిన్లతో లభించబోతోంది. మే 21న కొత్త ఫేస్‌లిఫ్ట్‌ను లాంచ్ చేసే అవకాశం ఉంది. కియా కరెన్స్ ఫేస్‌లిఫ్ట్ క్లావిస్‌గా మార్కెట్‌లోకి ఎంట్రీ ఇవ్వనుంది. మే 8న దీన్ని ఆన్‌లైన్‌లో ఆవిష్కరించనున్నారు. జూన్ 2న ధర వెల్లడి కానుంది. 360 డిగ్రీల కెమెరా, ఆరు ఎయిర్ బ్యాగులతో పాటు లెవల్2 అడాస్ ఫీచర్లతో ఈ కారు రాబోతోంది. పనోరమిక్ సన్‌రూఫ్, 12.3 అంగుళాల ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్‌తో వస్తోంది. పెట్రోల్, టర్బో పెట్రోల్, డీజిల్ ఇంజిన్ ఆప్షన్లతో ఈ ఎంపీవీ లభించనుంది. జేఎస్‌డబ్ల్యూ ఎంజీ తన విండ్‌సోర్ ఈవీని మరింత బిగ్ బ్యాటరీతో తీసుకురాబోతోంది. ప్రస్తుతం 38కెడబ్ల్యూహెచ్ బ్యాటరీతో లభిస్తున్న ఈ కారులో కొత్తగా 50.6 కెడబ్ల్యూహెచ్ సామర్థ్యం కలిగిన బ్యాటరీ ఇవ్వనున్నారు. దీంతో ఆ మేర రేంజ్ పెరగనుంది. ఎంజీ మాతృ సంస్థ సియాక్‌కు చెందిన వులింగ్ క్లౌడ్ ఈవీకి అనుగుణంగా బిగ్‌బ్యాటరీతో విండ్‌సోర్ కారును తీసుకురానున్నారు. ఇది మే నెలలోనే రాబోతున్నప్పటికీ.. తేదీ మాత్రం ఇంకా వెల్లడికాలేదు. జర్మన్ కార్ల తయారీ సంస్థ గోల్ఫ్ జీటీఐ మోడల్‌ను ఇదే నెలలో లాంచ్ చేయనుంది. పోలో జీటీఐ తర్వాత జీటీఐ బ్యాడ్జ్‌తో వస్తున్న రెండో మోడల్ ఇది. దీన్ని నేరుగా దిగుమతి చేసి దేశీయంగా విక్రయించనున్నారు. 2 లీటర్ టర్బో పెట్రోల్ ఇంజిన్‌తో వస్తున్న ఈ కారు 261 బీహెచ్‌పీ పవర్‌ను, 370 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. వీటితో పాటు మెర్సిడెస్‌బెంజ్, ఆడి, బీఎండబ్ల్యూ నుంచి కూడా అప్‌డేట్స్ ఉండొచ్చని ఆటోమొబైల్ వర్గాలు చెబుతున్నాయి.



## అలెంబిక్ జనరిక్‌కు యుఎస్ఎఫ్‌డిఎ ఆమోదం

**వాషింగ్టన్, మే 2:** గుండెపోటు, స్ట్రోక్ నివారణకు జనరిక్‌ఔషధాన్ని మార్కెట్ చేయడానికి యూఎస్ హెల్త్ రెగ్యులేటర్ నుంచి ఆమోదం లభించిందని అలెంబిక్ ఫార్మా శుక్రవారం తెలిపింది. టికాగ్రెలర్ టాబ్లెట్లు..90 ఎంజి, 60ఎంజి కొత్త ఔషధ అప్లికేషన్(ఎఎన్‌డిఎ) కోసం కంపెనీ యుఎస్ఎఫ్‌డిఎ నుంచి తుది ఆమోదం పొందిందని అలెంబిక్ ఫార్మా ఒక ప్రకటనలో తెలిపింది. కంపెనీ ఆమోదించిన ఆస్ట్రాజెన్ కా ఫార్మాకు సంబంధించిన బ్రిలింటా టాబ్లెట్లు 60ఎంజి, 90 ఎంజిలకు చికిత్సా పరంగా సమానం అని అలెంబిక్ ఫార్మా పేర్కొంది. టికాగ్రెలర్ మాత్రలు తీవ్రమైన కరోనరీ సిండ్రోమ్ ఉన్న రోగులలో కార్డియోవాస్కులర్ మరణం, మయోకార్డియల్ ఇన్ఫార్క్షన్(ఎంఐ), స్ట్రోక్ నుంచి ప్రమాదాన్ని తగ్గించడానికి సూచించబడుతుంటాయి. ఐక్యూవిఐఎ ప్రకారం, 2025, మార్చితో ముగిసిన పన్నెండు నెలలకు టికాగ్రెలర్ ఔషధాలు(90 ఎంజి)..1,062 మిలియన్ డాలర్ల(రూ.8,920 కోట్ల) మార్కెట్ పరిమాణాన్ని కలిగి ఉన్నట్లు అంచనా. టికాగ్రెలర్ ఔషధాలు(60ఎంజి)..2025, మార్చితో ముగిసిన పన్నెండు నెలలకు 242 మిలియన్ డాలర్ల(రూ.2,032 కోట్ల) మార్కెట్ పరిమాణాన్ని కలిగి ఉన్నట్లు అంచనా.




# టారిఫ్‌లతో ఆపిల్‌పై 900 మిలియన్ డాలర్ల ప్రభావం!

# వాణిజ్యం

**వాషింగ్టన్, మే 2:** ఐఫోన్ తయారీ కంపెనీ ఆపిల్ ప్రస్తుత సంవత్సరం మొదటి త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. విశ్లేషకులు ఊహించిన దానికంటే మెరుగైన ఫలితాల్ని నమోదు చేసింది. అయితే రానున్న త్రైమాసికంలో అమెరికా సుంకాల కారణంగా కంపెనీకి నష్టం వాటిల్లే అవకాశం ఉందని తెలిపింది. తమ సప్లై చెయిన్‌ను ఇది దెబ్బతీసే అవకాశం ఉందని వెల్లడించింది. సుంకాల వల్ల కంపెనీపై 900 మిలియన్ డాలర్ల మేర ప్రభావం పడనున్నట్లు కంపెనీ సీఈఓ టిమ్ కుక్ తెలిపారు. అమెరికా, చైనా భారీస్థాయిలో పరస్పర సుంకాలు విధించుకోవడంతో ఇరుదేశాల మధ్య వాణిజ్య యుద్ధం రాజుకుంది. ఈ క్రమంలోనే టారిఫ్‌ల నుంచి తప్పించుకునేందుకు దిగ్గజ సంస్థ యాపిల్ ఇప్పుడు ప్రత్యామ్నాయ మార్గాలను వెతుకుతోంది. అయితే ప్రతీకార సుంకాల నుంచి ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లు, సెమీ కండక్టర్లను మినహాయించారు. ఈ నేపథ్యంలో యాపిల్ ముందస్తుగా జాగ్రత్తలు తీసుకుంటూ భారత్‌లో ఉత్పత్తిని పెంచింది. రానున్న రోజుల్లో సుంకాలపై ఎలాంటి చర్యలు తీసుకొనే అవకాశం ఉందో తెలియదు. దీంతో సుంకాల ప్రభావాన్ని కచ్చితంగా అంచనా వేయలేకపోతున్నాం. ప్రస్తుత సుంకాల రేట్లు, విధానాలు మారకపోతే ఆపిల్‌పై 900 మిలియన్ డాలర్లు అధిక భారం పడే అవకాశం ఉంది అని టిమ్ కుక్ అన్నారు. భారత్‌లో ఉత్పత్తిని మరింత విస్తరించాలని చూస్తున్నట్లు కంపెనీ అధికారి ఒకరు అభిప్రాయపడ్డారు. ఐప్యాడ్, మ్యాక్, ఆపిల్ వాచ్, ఎయిర్‌పాడ్ వంటి ఉత్పత్తులు దాదాపుగా వియత్నాంలో ఉత్పత్తి అవుతున్నాయని కుక్ తెలిపారు. అమెరికా వెలుపలి మార్కెట్ కోసం చైనా ఇప్పటికీ ప్రధాన ఉత్పత్తి కేంద్రంగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఇక ప్రస్తుత సంవత్సరం మొదటి త్రైమాసికంలో ఐఫోన్ విక్రయాలు జోరందుకున్నాయి. దీంతో ఆపిల్ 95.4 బిలియన్ డాలర్లఆదాయం నమోదు చేసింది. ఇందులో చైనా నుంచే 17 బిలియన్ డాలర్లు వచ్చాయి. ఇక కంపెనీ లాభం 24.8 బిలియన్ డాలర్లుగా నమోదైంది.



# ఫ్లాట్‌గా ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, మే 2:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నేడు ఒడుదొడుకులు ఎదుర్కొన్నాయి. ఆరంభంలో భారీ లాభాల్లో దూసుకెళ్లిన సూచీలు, ఇంట్రాడేలో ఆ లాభాలను కోల్పోయాయి. ముఖ్యంగా మెటల్, ఫార్మా షేర్లలో అమ్మకాలు సూచీలను పడేశాయి. సెన్సెక్స్ ఓ మోస్తరు లాభాల్లో ముగియగా, నిఫ్టీ 24,300 ఎగువన ఫ్లాట్‌గా స్థిరపడింది. సెన్సెక్స్ ఉదయం 80,300.19 పాయింట్ల వద్ద (లాభాల్లో ప్రారంభమై, ఇంట్రాడేలో దాదాపు 900 పాయింట్లకు పైగా లాభపడి 81,177.93 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 259.75 పాయింట్ల లాభంతో 80,501.99 వద్ద ముగిసింది. నిఫ్టీ 12.50 పాయింట్ల లాభంతో 24,346.70 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 84.50గా ఉంది. అదానీ పోర్ట్స్, బజాజ్ ఫైనాన్స్, ఎస్‌బీఐ, ఇండస్ ఇండ్ బ్యాంక్, మారుతీ సుజుకీ షేర్లు లాభపడ్డాయి. నెస్లే ఇండియా, ఎన్టీపీసీ, కోటక్ మహీంద్రా బ్యాంక్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, టైటాన్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 61 డాలర్ల వద్ద ట్రేడవగా, బంగారం ఔన్సు 3270 డాలర్ల వద్ద కొనసాగింది.



# ఇంకా చలామణిలోనే రూ.2వేల నోట్లు

**న్యూఢిల్లీ, మే 2:** పెద్ద నోట్ల రద్దు తర్వాత తీసుకొచ్చిన రూ.2 వేల నోట్లను ఉపసంహరించుకుని దాదాపు రెండేళ్లవుతున్నా.. రూ.6266 కోట్ల విలువైన నోట్లు ఇంకా చలామణీలో ఉన్నాయి. ఇప్పటి వరకు 98.24 శాతం నోట్లు వెనక్కి వచ్చాయని.. మిగిలినవి ఇంకా రావాల్సి ఉన్నాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెల్లడించింది. నోట్లను వెనక్కి తీసుకున్నప్పటికీ.. అవి లీగల్ టెండర్ (చెల్లుబాటు)గా కొనసాగుతాయని తెలిపింది. 2023 మే 19 చలామణీలో ఉన్న రూ.2 వేల నోట్లను ఆర్‌బీఐ వెనక్కి తీసుకున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయం ప్రకటించే నాటికి రూ.3.56 లక్షల కోట్లు విలువైన నోట్లు చలామణీలో ఉన్నాయి. నోట్ల ఉపసంహరణ తర్వాత 2023 అక్టోబర్ 7 వరకు బ్యాంకుల్లో డిపాజిట్ చేసేందుకు పౌరులకు ఆర్‌బీఐ అవకాశం కల్పించింది. ఆపై రిజర్వ్ బ్యాంక్‌కు చెందిన 19 ప్రాంతీయ కార్యాలయాల్లో డిపాజిట్ చేసే వెసులుబాటు కల్పిస్తోంది. అలా ఏప్రిల్ 30 నాటికి రూ.6,266 కోట్లు విలువైన నోట్లు ఇంకా వెనక్కి రాలేదని ఆర్‌బీఐ పేర్కొంది. ఆర్‌బీఐ ప్రాంతీయ కార్యాలయాలకు వెళ్లలేని వారు పోస్టాఫీసు సేవల్ని వినియోగించుకోవాలని సూచించింది. తమ వద్ద ఉన్న నోట్లను ఆర్‌బీఐ ప్రాంతీయ కార్యాలయాలకు పంపిస్తే.. అందుకు సమానమైన మొత్తం బ్యాంక్ ఖాతాలో జమ చేస్తారు.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.